www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 225 | బుధవారం | 15-07-2026 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ప్రపంచానిక ఆఖరు ఘడియలు

రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్

గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54

E-mail: navachethanaph@gmail.com

నవచేతన బుక్ హౌస్

బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



ఇరాన్ క్షిపణి దాడుల్లో మరో భారత నావికుడు మృతి 08

ప్రజల బాధలపై మోదీ ఎప్పుడు మాట్లాడుతారు? 12 ఏళ్ల బిజెపి సర్కార్ హయాంలో సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను దెబ్బతీసింది : కాంగ్రెస్ 07


## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు

# 2028 జూన్ 2 నాటికి పూర్తి చేయండి



● ఆ రెండు విమానాశ్రయాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి ● వరంగల్ తరహా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులోనూ ఎంఆర్‌ఒ, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించండి ● విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి ● ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించండి ● కేంద్రమంత్రి గడ్కరీని కోరిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి పౌర విమానయాన శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమై రెండు విమానాశ్రయాలపై చర్చించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని సిఎం తెలిపారు. వరంగల్ ఎయిర్ పోర్టు, రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో నగరం కీలకంగా మారుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధి చేస్తామని సిఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్హాలింగ్ (ఎంఆర్‌ఓ) ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028 జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సిఎం



రేవంత్ రెడ్డి వివరించారు. అందుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సిఎం స్పష్టం చేశారు. వరంగల్ విమానాశ్రయం తరహాలోనే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌ఓ, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు (ఎఫ్‌టిఒ) నెలకొల్పాలని సిఎం కోరారు.దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు అభినందించారు. భూ సేకరణ విషయంలో త్వరగా స్పందించినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని ఆయన చెప్పారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం తరువాయి 8లో

## అధికార, ప్రతిపక్షాలు వ్యక్తిగత

# దూషణలు ఆపాలి

● రైతులకు సాగు నీరు ఎలా అందించాలనే అంశంపై దృష్టి సారించాలి ● కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగు నీటి ప్రాజెక్టుల ఇంజనీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలి ● అసలు విషయం తేల్చి వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలి ● ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు ప్రక్రియ గడువును 3 నెలలు పెంచాలి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

### సింగరేణి పరిధిలోని అన్ని గనులు కేటాయించాలి

సింగరేణి సంస్థ పరిధిలోని తాడిచర్ల–2 బొగ్గు గనిని తిరిగి సింగరేణికి అప్పగించడం పట్ల సాంబశివవరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాడిచర్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ ఆందోళన చేసిందని గుర్తు చేశారు. సింగరేణి పరిధిలోని అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపాలని కోరారు.



ప్రజాపక్షం/హైదరాబాద్

అధికార పార్టీ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నాయకులు పరస్పరం వ్యక్తిగత దూషణల పర్వంతో రాజకీయ వికృత క్రీడకు, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు వ్యక్తిగత దూషణల పర్వాన్ని వెంటనే ఆపి రైతులకు సాగు నీరు ఎలా అందించాలనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగు నీటి ప్రాజెక్టుల ఇంజనీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలని, ఈ కమిటీలో కేంద్ర జల వనరుల నిపుణులతో పాటు రాజకీయ పార్టీలు సూచించే నిపుణులను చేర్చి పూర్తిస్థాయి అధ్యయనం చేయించి ఈ కమిటీ సిఫార్సు మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధా న కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ మాట్లాడారు. ఎల్‌నినో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగు నీటి సమస్య కంటే అధికార, ప్రతిపక్ష నాయకులు రాజకీయ పంతాలే ముఖ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజకీయ నాయకుల భాష, సంస్కృతి చాలా అభ్యంతరకరంగా, ఇబ్బందికరంగా మారిందని, ఈ పదేళ్ల కాలంలో ఎప్పుడూ లేనటువంటి ఒక నీచమైన సంస్కృతికి తెర లేపారని, దీనికి ఆద్యుడు మాజీ సిఎం కెసిఆర్ అయితే, ఇప్పుడు ఆయనను మించిన భాషను వాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలా? వద్దా? అనే అంశం తేల్చేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు సాగు నీటి రంగ నిపుణులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తరువాయి 8లో



## హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజినీర్ నివాసాల్లో ఎసిబి సోదాలు

● ఆదాయానికి మించిన ఆస్తుల గుర్తింపు ● ఇళ్లు, ప్లాట్లు, భూ పత్రాలు, వాహనాలు స్వాధీనం ● నాలుగు లక్షల నగదు, కిలోన్నర బంగారం, పన్నెండు కిలోల వెండి గుర్తింపు ● 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు ● ఎసిబికి చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఎఇ

ప్రజాపక్షం/హైదరాబాద్/పెద్దపల్లి

రాష్ట్రంలో మరో అవినీతి అధికారి గుట్టురట్టు అయింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిఉన్నారన్న అభియోగాలపై అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ) చీఫ్ ఇంజినీర్ బి. రవీందర్‌పై కేసు నమోదు చేసింది. మంగళవారం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. సోదాల్లో సుమారు రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులను అధికారులు గుర్తించారు. అయితే ఈ ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. సోదాల్లో కొండగల్, కిష్టాపూర్, పసుమాముల ప్రాంతాల్లో ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రామ్‌గూడలో నాలుగు ఫ్లాట్లు, కొత్తూరు మండలం గూడూరు, శంషాబాద్ ప్రాంతాల్లో నాలుగు ఎకరాల వ్యవసాయ తరువాయి 8లో



## సిజిహెచ్‌ఎస్ ధరలతో ఆరోగ్యశ్రీకి సేవలందించలేం

● తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటన ● ధరలు సవరించాలని వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిహెచ్‌ఎస్) ప్యాకేజీ ధరలతోనే రాష్ట్ర ఆరోగ్య పథకాన్ని వర్తింపజేస్తే తాము సేవలందించలేమని తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టిఎఎన్‌హెచ్‌ఎ) తెలిపింది. ఈ మేరకు టిఎన్‌హెచ్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఆరోగ్య పథకం సిఇఒను కలిసి వినతిపత్రం సమర్పించారు. పాత ఇహెచ్‌ఎస్ ధరల కంటే సిజిహెచ్‌ఎస్ ప్యాకేజీ తరువాయి 12లో

## సచివాలయం ముట్టడి..

# తీవ్ర ఉద్రిక్తం

● ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్ వైపు దూసుకెళ్లిన వందలాది మంది విద్యార్థులు

● నినాదాలతో దద్దరిల్లిన సచివాలయ పరిసరాలు

● అడ్డుకున్న పోలీసులు : ప్రతిఘటించిన వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు

● అరెస్ట్, స్టేషన్‌కు తరలింపు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ,ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి,ఎఐడిఎస్ఒ,ఎఐపిఎస్‌యు తదితర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో సచివాలయం' ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వందలాది మంది విద్యార్థులు, నాయకులు సచివాలయం వైపు దూసుకువెళ్లారు. విద్యార్థి సంఘాల చలో సచివాలయం పిలుపు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ విద్యార్థులను, విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అడ్డుకున్నప్పటికీ వందలాది మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చేరుకుని సచివాయం ముట్టడికి యత్నించారు. విద్యార్థి సంఘాల నేతృత్వంలో విద్యార్థులు ఒక్కసారిగా నినాదాలు చేస్తూ సచివాలయం సమీ పం వరకు దూసుకువెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘా లు నాయకులు విద్యార్థులు చేసిన నినాదాలతో సచివాలయం పరిసరాలు దద్దరిల్లాయి. సచివాలయం వైపు దూసుకువెళుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు వెంబడించి అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తరువాయి 12లో

## ప్రభుత్వం చర్చలు జరిపేంత వరకూ

# దీక్ష విరమించ

● ప్రభుత్వం ఎందుకు చర్చలు జరపడం లేదో ప్రశ్నించండి : పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ● దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు, ప్రముఖులు విజ్ఞప్తి




**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షను విరమించడానికి నిరాకరించారు. కండరాల క్షీణత, తీవ్రమైన నొప్పి ఉన్నప్పటికీ, ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని ఆయన పట్టుబట్టారు. మంగళవారానికి ఆయన దీక్ష 17వ రోజు చేరింది. అలాగే కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన ఆందోళన 25వ రోజుకు చేరుకుంది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై సిజెపి మంగళవారం బులెటిన్ విడుదల చేసింది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి వాంగ్‌చుక్ బరువు 8.5 కిలోలు తగ్గారు. రక్తపోటు 109/70 ఎంఎం హెచ్‌జిగా నమోదైంది. వాంగ్‌చుక్ కండరాల బలాన్ని కోల్పోతున్నారని, తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. అందరిలాగే తాను కూడా దీక్ష విరమించమని ఆయనను బతిమిలాడానని, దీక్షను విరమించాలని తనను అడగడానికి బదులు, అసలు ప్రభుత్వం ఎందుకు చర్చలు జరపడం లేదో వారిని అడగండి అని సమాధానమిచ్చినట్లు దీప్కే ఎక్స్‌లో తరువాయి 8లో



## ఉమ్మడి ఎపి మాజీ మంత్రి ముద్రగడ కన్నుమూత

● రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల ప్రస్థానం ● కాపు రిజర్వేషన్ల కోసం నిరంతర పోరాటం చేసిన నాయకుడు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న తరువాయి 12లో


గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీ
వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ 03

వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి 12


## పోలవరంతో భద్రాద్రికి

# జల గండం?



● 4.88 లక్షల క్యూసెక్కులకే 71.3 అడుగుల వరద

● 2022 వరద ప్రమాద హెచ్చరికను దాటి ఉప్పెనగా మారిన వైనం

● బ్యాక్ వాటర్ లెక్కలు తేల్చకుంటే పెను ప్రమాదమే

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

పోలవరం ప్రాజెక్టు భద్రాచలం మన్యాన్ని జలగండంగా మార్చనుందా....? భారీ వరద వస్తే బ్యాక్ వాటర్ భద్రాద్రిని ముంచెత్తుతుందా..? ఇలాంటి అనేక భయాలు వెంటాడుతున్నాయి. అసలే ఇప్పుడు వరదల కాలం, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోయినప్పటికీ వాతావరణంలో పెనుమార్పులు సంభవించి భారీ వానలు పడితే జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వరదలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. 2022లో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 71.3 అడుగులకు చేరింది. 24.88 క్యూసెక్కుల వరదనీరు ప్రవాహం నమోదైంది.1986 వరదల త ర్వాత అతి పెద్ద వరద 2022లో వచ్చింది. 1986 వరదల కంటే తక్కువే అయినప్పటికీ ఎక్కువ ప్రాంతాలు మునకకు గురయ్యాయి. ఈ వరదలు చూపిన ప్రమాద సంకేతా లు భవిష్యత్‌లో మరింత తీవ్రతరం కానున్నా యా, ఇదంతపోలవరం ప్రాజెక్టు వల్లే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి వరద తీరుతెన్నులు చూస్తే భద్రాచాలనికి పొంచి ఉన్న ముప్పు అతి పెద్దదే అని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాలు శాస్త్రీయ పద్ధతు ల్లో లెక్కలు కట్టి నిజాలను ప్రజల ముంగిట ఉంచాలని కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే సుమారు 50 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరదనీటిని విడుదల చేసే సామర్థ్యంతో రూపొందించారు. ఇందులో సగం స్థాయి సామర్థ్యం 24.88 క్యూసెక్కుల వరద తరువాయి 12లో

## రాతియుగంలోకి ఇరాన్‌ను నెట్టేశాం

● రెండురోజులపాటు ఇంకా చావుదెబ్బ తీస్తాం ● చర్చలతో పరిష్కారానికి ఇంకా అవకాశం ఉంది ● అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన ● మళ్ళీ యుద్ధం మొదలైందని కాంగ్రెస్‌కు నోటీసు ● హోర్ముజ్ మాదేనని ఎంఒయు స్పష్టం చేసింది : ఇరాన్

**వాషింగ్టన్ :** ఇరాన్‌ను మళ్ళీ రాతియుగంలోకి నెట్టేశామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రి,బుధవారం రెండు రోజులపాటు మరింత చావు దెబ్బ తీయబోతున్నాం, ఈ విషయంలో వారు ఏమీ చేయలేరు అన్నారు. ఇరాన్‌కు చెందిన 84 శాతం సైనిక స్థావరాలను నిర్మూలించామని, ఇరాన్ సైన్యాలను చావుదెబ్బ తీశామన్నారు. పెద్ద పెద్ద నోళ్ళు తప్ప చెప్పుకోవడానికి వారి దగ్గర ఏమీ లేదన్నారు. కన్జర్వేటివ్ టాక్ షో సందర్భంగా హోస్ట్ హ్యూహెవిట్‌కు ట్రంప్ ఈ విషయం చెప్పారు. ఒకవైపు ఇరాన్‌ను నీచంగా చిత్రీకరిస్తూ, వారిపై విమర్శలు గుప్పిస్తూనే, ఇరాన్‌తో చర్చల ద్వారా ఒప్పందానికి ఇప్పటికీ ఇంకా అవకాశం ఉందని అన్నారు. పరిష్కారం సాధ్యం కాదనే విషయంపై తాను నిర్ణయం తీసుకోలేదన్నారు. క్యూబాలో కూడా ఇరాన్ తన డ్రోన్లు,



క్షిపణులను నిల్వచేసే అవకాశం ఉందని, దానిపై ఇప్పుడు విచారణ చేస్తున్నామని, ఒకవేళ అలా నిల్వచేసే అదేమంత పెద్ద విషయం కాదని, అలా జరగనివ్వబోమని, దానిపై తాము చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌తో మళ్ళీ యుద్ధం ప్రారంభమైందని లాంఛనంగా అమెరికా తరువాయి 8లో

# 2029లో అమలులోకి ‘ఒక దేశం – ఒక ఎన్నికలు’

‘ఒక దేశం – ఒక ఎన్నికలు’ బిజెపి ఆశాపూరిత పథకం. కాగా అది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం, ప్రజాస్వామ్యం పనితీరుకు విరుద్ధం, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమైన ఏకపక్ష నియంతృత్వ లక్షణం అనేది ప్రతిపక్షాల వాదన. దేశంలో ప్రతి ఏటా విడతలవారీ అసెంబ్లీ ఎన్నికల కారణాన ధనం వృధా వ్యయంతోపాటు అభివృద్ధి కుంటుపడుతుందనేది బిజెపి ప్రతివాదన. ఇది కేవలం సాకు మాత్రమేనని, అధికారం కేంద్రీకరణ, అధినాయకుని ఆకర్షక శక్తితో దేశమంతటికీ, అధికారం విస్తరణ, ప్రాంతీయ మనోభావాలను – ప్రాంతీయ పార్టీలను అణచివేసి ఏకపక్ష అధికారం నెలకొల్పటం బిజెపి ధ్యేయంగా ప్రతిపక్ష పార్టీల బలమైన వాదన. ఇది ఇంతటితో ఆగదని, పార్లమెంటరీ, ఫెడరల్ వ్యవస్థ బదులు యూనిటరీ పాలనా వ్యవస్థ (అధ్యక్ష తరహా పాలన)ను అభిలషించే బిజెపి సిద్ధాంతాన్ని నెరవేర్చుకునే దిశలో ప్రయాణానికి ‘ఒక దేశం – ఒక ఎన్నికలు’ బాటవేస్తాయని అనుమానాలు కూడా లేకపోలేదు. లోక్‌సభ సీట్లను 850కి పెంచి, నియోజకవర్గాల పునర్విభజనతో 2029 ఎన్నికలనుంచే మహిళా రిజర్వేషన్ అమలుకు మోదీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తున్నది.

చర్చలు, అపోహలు, తర్కవాదనలు ఎలా ఉన్నప్పటికీ ‘ఒక దేశం– ఒక ఎన్నికలు’ అమలులోకి తెచ్చే పట్టుదలతో నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ అంశం అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ 2024 సెప్టెంబర్‌లో నివేదిక సమర్పించింది. లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు జరపటాన్ని సౌలభ్యం చేయటం ఎలా అన్నదే ఆ కమిటీకి ఇచ్చిన ఆదేశమైనందున అది అందుకు అనుకూలంగా నివేదిక ఇచ్చింది. ఆర్టికల్ 83(లోక్‌సభ కాలపరిమితి), ఆర్టికల్ 172(రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం) సవరించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని, ఆర్టికల్ 82 ఎ ని చేర్చాలన్నది కోవింద్ కమిటీ ముఖ్యమైన సిఫార్సుల్లో ఒకటి. ఈ సవరణకు రాష్ట్రాల ధృవీకరణ అక్కర్లేదట! రాష్ట్రాల్లో ఫిరాయింపులు తదితర కారణాలతో ప్రభుత్వాలు అర్థంతరంగా పడిపోయే అవకాశాన్ని అధిగమించేందుకు అసెంబ్లీలకు నిర్దిష్టమైన కాలపరిమితి ఉంటుంది. ప్రభుత్వం మెజారిటీ కోల్పోయినప్పుడు అసెంబ్లీని సస్పెన్షన్‌లో ఉంచి, రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుంది. పార్టీ లేదా పార్టీలు విభేదాలు సర్దుబాటు చేసుకుని మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఉంటుంది. లేదా ఎన్నికలు నిర్వహించాల్సివస్తే అవి సంబంధిత అసెంబ్లీ మిగతా కాలానికే పరిమితం చేయబడతాయి. మళ్లీ లోక్‌సభ ఎన్నికలతోపాటే అసెంబ్లీల ఎన్నికలు జరుగుతాయి. రాజకీయ అస్థిరతతో లోక్‌సభలో ఇదే పరిస్థితి (అర్థంతరంగా ప్రభుత్వం పడిపోవటం) తలెత్తితే – రాష్ట్రపతి పాలన విధించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించనందున ఏమి చేస్తారు? ఇది వెల్లడించలేదు. పడిపోయిన ప్రభుత్వాన్నే ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగిస్తూ త్వరలోనే ఎన్నికలు జరుపుతారా? అప్పుడు అసెంబ్లీల సంగతేమిటీ లేక అసెంబ్లీలకువలె లోక్‌సభకు కూడా ఫిక్స్‌డ్ టరం ప్రవేశపెడతారా? ఈ స్పష్టతకోసం కొంతకాలం వేచిచూడాలి.

ఒక దేశం – ఒక ఎన్నికల కోసం 129వ రాజ్యాంగ సవరణ బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ స్క్రూటినీలో ఉంది. 2029 నుండి ఏకకాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చట్రాన్ని రూపొందిస్తున్నామని ఆ కమిటీ చైర్మన్, బిజెపి ఎంపి పి.పి.చౌధురి ఇటీవల వెల్లడించారు. తాము ఇంతవరకు సంప్రదించిన పౌర సమాజ స్టేక్‌హోల్డర్స్‌లో దాదాపు 99శాతం ‘ఒక దేశం – ఒకే ఎన్నికలు’ ప్రతిపాదనను బలపరిచారని ఆయన చెప్పారు.

2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్రప్రభుత్వ ప్రయత్నం అమలులోకి వస్తే, కనీసం 13 అసెంబ్లీల పదవీకాలం కుదించాల్సి ఉంటుంది, 10అసెంబ్లీలు రద్దు చేయాలి లేదా వాటి పదవీకాలం పొడిగించాల్సి ఉంటుంది. 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలు – కర్నాటక, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, మిజోరం. వీటి ఎన్నికలను 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు జరపాలంటే ఈ అసెంబ్లీలను రద్దు చేయాలి లేదా వాటి పదవీకాలం పొడిగించాల్సి ఉంటుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు – 2029లో లోక్‌సభ ఎన్నికలతోపాటు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించటం ఈ సందర్భంగా గమనార్హం. అలాగే 2027లో ఎన్నికలు జరిగే అసెంబ్లీల పదవీకాలాన్ని దాదాపు రెండు సంవత్సరాలు కోతపెట్టాల్సి ఉంటుంది. అవి – ఉత్తరప్రదేశ్, గుజరాత్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్. 2026లో ఎన్నుకోబడిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీల పదవీకాలం మూడేళ్లు మాత్రమే పూర్తవుతుంది. అలాగే బిహార్, ఢిల్లీ అసెంబ్లీల పదవీకాలం కూడా ఒక సంవత్సరం తగ్గుతుంది. గతలోక్‌సభ ఎన్నికలతోపాటు లేదా కొద్దినెలల అనంతరం అసెంబ్లీ ఎన్నిక లు జరిగిన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూ –కశ్మీర్ ఎన్నికలను 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు జరిపేందుకు ఇబ్బంది ఉండదు.


ఇదో పెద్ద విన్యాసం. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చాక 1952 నుండి 1967 దాకా నాలుగు సార్వత్రిక ఎన్నికలు ఏకకాలంలోనే జరిగాయి. ప్రజల్లోని అసంతృప్తి, ప్రాంతీయ రాజకీయ శక్తుల ఆకాంక్షలు ఏకకాల ఎన్నికలను దారితప్పించాయి. తిరిగి పట్టాలెక్కించే ప్రయత్నం ఒక్క బిజెపి ఆకాంక్షగా కాకుండా ఉమ్మడి రాజకీయ ప్రయత్నంగా ముందుకు తెచ్చేందుకు పాలక బిజెపి చొరవ చేయకుండా అంతా ఏకపక్ష వ్యవహారంగా సాగించటం దాని రాజకీయ ఆకాంక్షల ప్రయోజనం అనుమానాలకు తావిస్తోంది. ●



## నావికులకు భద్రత, ఉగ్రవాదులకు నిధుల నియంత్రణకే ప్రాధాన్యం

అంతర్జాతీయ జలాలలో నావికులకు భద్రత, ఉగ్రవాదులకు నిధులు అందకుండా అడ్డుకోవడం వంటి విషయాలకే భారతదేశం ప్రాధాన్యత ఇస్తుంది. అంతర్జాతీయ నియమావళికి అనుగుణంగా సముద్రంలో రవాణా కార్యకలాపాలు, సముద్రయానం కొనసాగాలని భారత్ గట్టిగా ఆకాంక్షిస్తోంది. నియమావళి ప్రకారం సముద్రయానం సాగినప్పడు ఎలాంటి సమస్యలూ తలెత్తే అవకాశం ఉండదు. ఉగ్రవాదం రోజు రోజుకూ విస్తరిస్తున్న తరుణంలో వారికి వివిధ మార్గాలలో నిధులు అందకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. భద్రతామండలిలో భారతదేశం ఇప్పటివరకూ ఎనిమిదిసార్లు తాత్కాలిక సభ్యురాలుగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించింది.

– విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్




## ఉద్యోగానికి తొలిమెట్టు నైపుణ్యం

జులై 15 ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం (వరల్డ్ యూత్ స్కిల్ డే). ఐక్యరాజ్యసమితి 2014లో ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా యువతకు నాణ్యమైన నైపుణ్య విద్యను అందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్వయం ఉపాధివైపు వారిని ప్రోత్సహించడం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో యువత పాత్రను బలోపేతం చేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రతి ఏడాది ఈ రోజు కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో యువత స్థానాన్ని, వారి నైపుణ్యాల ప్రాధాన్యాన్ని గుర్తు చేసే సందర్భంగా నిలుస్తోంది. ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవం దిశగా వేగంగా దూసుకుపోతోంది. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), రోబోటిక్స్, ఆటోమేషన్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీలు ఉపాధి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ‘స్కిల్’ అనే పదానికి అపూర్వమైన ప్రాధాన్యం ఏర్పడింది. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభాను సరైన దిశలో నడిపితే భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రస్థానానికి చేరుకోగలదు. ఉన్నత విద్య పూర్తి చేసిన యువతలో కూడా పరిశ్రమలు కోరుకునే సాంకేతిక, డిజిటల్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యాలు కొరవడుతున్నాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ ఇండియా మిషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన,డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటిఐలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా ఉపాధి ఆధారిత శిక్షణను విస్తరిస్తున్నాయి. అయినప్పటికీ ఈ కార్యక్రమాల ఫలితాలు ప్రతి గ్రామానికి, ప్రతి నిరుద్యోగ యువకుడికి చేరేలా అమలు జరగడం అత్యంత అవసరం. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి యువతకు నైపుణ్యాలను అందించే ఉద్యమంగా ముందుకు సాగాలి.


**ఆళవందార్ వేణు మాధవ్**
8686051752,హైదరాబాద్

# అమెరికా–చైనా హైటెక్ పోటీకి కొత్త వేదిక షాంఘై


నిత్యా చక్రవర్తి

చైనాలోని షాంఘై నగరంలో ఈనెల 17 నుంచి 20 వరకు జరగనున్న ప్రపంచ కృత్రిమ మేధస్సు సదస్సు (వరల్డ్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్/డబ్ల్యుఎఐసి) 2026 ప్రపంచ సాంకేతిక రంగంలో అత్యంత ప్రాధాన్యమైన సమావేశంగా భావిస్తున్నారు. ఈ సదస్సు కేవలం కొత్త కృత్రిమ మేధస్సు (ఎఐ) సాంకేతికతలను ప్రదర్శించే వేదిక మాత్రమే కాదు. కృత్రిమ మేధస్సు (ఎఐ) నిర్వహణ, అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ప్రమాణాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎఐ సాంకేతికత అందుబాటు వంటి కీలక అంశాలపై భవిష్యత్ దిశను నిర్దేశించే సమావేశంగా ప్రపంచ దేశాలు దీనిని చూస్తున్నాయి. భారతదేశంతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ప్రస్తుతం ప్రపంచ సాంకేతిక రంగంలో అమెరికా, చైనా మధ్య తీవ్రమైన ఆధిపత్య పోటీ కొనసాగుతోంది. సెమీకండక్టర్లు, సూపర్ కంప్యూటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఎఐ మోడళ్లు, డేటా సెంటర్లు, రోబోటిక్స్ వంటి రంగాల్లో రెండు దేశాలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. అందువల్ల షాంఘై సదస్సు ప్రపంచ ఎఐ భవిష్యత్తును నిర్ణయించే ఒక దౌత్య, సాంకేతిక వేదికగా కూడా మారింది. సుమారు ఇరవై ఆరు సంవత్సరాల క్రితం ఇదే షాంఘై నగరంలో జరిగిన కంప్యూటర్ సదస్సు డాట్‌కామ్ సంక్షోభం తర్వాత ఐటి పరిశ్రమ ఎదుర్కొన్న సవాళ్లపై చర్చించింది. ఆ సంక్షోభం నుంచి ప్రపంచ ఐటి రంగం క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ టెక్నాలజీ, సోషల్ మీడియా, బిగ్ డేటా వంటి దశలను దాటి ఇప్పుడు ఎఐ యుగంలోకి ప్రవేశించింది. ప్రస్తుతం ఎఐ రంగంలో భారీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతున్నది. అయితే ఈ పెట్టుబడులకు తగిన లాభాలు వస్తాయా? లేదా? అనే సందేహాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. కొందరు నిపుణులు 2000 సంవత్సరంలోని ‘డాట్‌కామ్ బుడగ’ మాదిరిగానే ఎఐ రంగంలో కూడా అతిగా పెట్టుబడులు పెరిగి భవిష్యత్తులో ఆర్థిక ఒత్తిడులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అమెరికా ఇప్పటికీ ప్రపంచ ఎఐ రంగంలో అగ్రస్థానంలో ఉంది. భారీ పెట్టుబడులు, అత్యాధునిక పరిశోధన, ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక సంస్థలు, అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు ఈ రంగంలో అమెరికా బలాన్ని పెంచుతున్నాయి. అయితే ఎఐ రంగంలో అమెరికా సంస్థల మార్కెట్ విలువలు అసాధారణంగా పెరగడం వల్ల భవిష్యత్తులో పెట్టుబడిదారులకు ప్రమాదాలు ఎదురయ్యే అవకాశాన్ని ఆర్థిక విశ్లేషకులు ఊహిస్తున్నారు. ఎఐ రంగంపై అత్యధికంగా ఆధారపడటం నాస్‌డాక్ వంటి సాంకేతిక షేర్ మార్కెట్లపై కూడా ప్రభావం చూపవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు చైనా పూర్తిగా భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. తక్కువ పెట్టుబడులతో, దేశీ య సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందిస్తూ, ఓపెన్ సోర్స్ ఎఐ నమూనాలను అభివృద్ధి చేస్తోంది. ‘డీప్‌సీక్’, ‘క్వెన్’ వంటి చైనా అభివృద్ధి చేసిన ఎఐ మోడళ్లు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వేగంగా ఆదరణ పొందుతున్నాయి. వీటిని ఉపయోగించడానికి అయ్యే వ్యయం తక్కువగా ఉండటంతో చిన్న సంస్థలు, విద్యా సంస్థ లు, పరిశోధనా కేంద్రాలకు కూడా ఎఐ అందుబాటులోకి వస్తోంది. చైనా అభిప్రాయం ప్రకారం కృత్రిమ మేధస్సు కొద్ది దేశాల ఆధిపత్య సాధనంగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఉపయోగపడే ప్రజా సాంకేతిక వనరుగా మారాలి.

‘ఉజ్వల భవిష్యత్తు కోసం ఎఐ భాగస్వామ్యం’ అనేది ఈ ఏడాది డబ్ల్యుఎఐసి ప్రధాన అంశం. దీని ద్వారా సాంకేతిక పోటీతో పాటు అంతర్జాతీయ సహకారాన్ని కూడా ప్రోత్సహించాలనే లక్ష్యాన్ని చైనా ప్రకటించింది. ప్రపంచ ఎఐ పాలన, భద్రతా ప్రమాణాలు, డిజిటల్ అసమానత తగ్గింపు, ఎఐ పరిశ్రమలో న్యాయమైన వాణిజ్యం, హ్యూమనాయిడ్ రోబోటిక్స్, డిజిటల్ ఆస్తుల నియంత్రణ వంటి అనేక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ సదస్సులో 1,400 మందికి పైగా ప్రముఖులు, వెయ్యికి పైగా కంపెనీలు పాల్గొననున్నాయి. మూడు వేలకుపైగా అత్యాధునిక ఎఐ ఉత్పత్తులు, మూడు వందలకుపైగా కొత్త సాంకేతిక



పరిష్కారాలు తొలిసారిగా ప్రపంచానికి పరిచయం కానున్నాయి. మేధో గణన (ఇంటెలిజెన్స్ కంప్యూటింగ్), ఎంబాడీడ్ ఎఐ, రోబోటిక్స్ వంటి విభాగాల్లో వందలాది సంస్థలు తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి.

అమెరికా–చైనా పోటీకి ఇటీవల జరిగిన ఒక పరిణామం కొత్త ఊపునిచ్చింది. జర్మనీలో నిర్వహించిన అంతర్జాతీయ సూపర్ కంప్యూటింగ్ సదస్సులో చైనా తయారు చేసిన ‘లైన్‌షైన్’ సూపర్ కంప్యూటర్ ప్రపంచంలోనే అత్యుత్తమ సూపర్ కంప్యూటర్‌గా గుర్తింపు పొందింది. అమెరికా తయారు చేసిన ‘ఎల్ కాపిటాన్’ను అధిగమిస్తూ ఈ కంప్యూటర్ సుమారు 20 శాతం అధిక పనితీరును కనబరిచినట్టు నిర్వహకులు ప్రకటించారు. ఈ విజయంతో అమెరికా సాంకేతిక ఆధిపత్యానికి గట్టి సవాలు ఎదురైంది. లైన్‌షైన్‌ను చైనా పూర్తిగా దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. అమెరికా విధించిన అధునాతన చిప్‌లు, జిపియుల ఎగుమతి ఆంక్షల మధ్య కూడా చైనా స్వదేశీ చిప్‌లు, నిల్వ వ్యవస్థలు, ఇంటర్‌కనెక్ట్ సాంకేతికత, శీతలీకరణ వ్యవస్థలను ఉపయోగించి ఈ సూపర్ కంప్యూటర్‌ను రూపొందించింది. అంతేకాదు, ప్రస్తుతం ప్రపంచంలోని అధిక భాగం సూపర్ కంప్యూటర్లు జిపియులపై ఆధారపడుతుండగా, లైన్‌షైన్ మాత్రం సిపియుల ఆధారంగానే ఎక్సాస్కేల్ స్థాయి పనితీరును సాధించడం విశేషం. ఇది చైనా సాంకేతిక స్వావలంబనకు నిదర్శనంగా నిలిచింది. ఎఐ రంగంలో పెట్టుబడుల పరంగా అమెరికా ఇప్పటికీ భారీ ఆధిక్యంలో ఉంది. గత కొన్ని సంవత్సరాల్లో అమెరికా ట్రిలియన్ల డాలర్ల స్థాయిలో ఎఐ మౌలిక వసతులపై పెట్టుబడులు ప్రకటించింది. యూరప్, సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. అయితే ఎక్కువ పెట్టుబడుల కంటే తక్కువ ఖర్చుతో విస్తృత వినియోగాన్ని పెంచడంపై చైనా దృష్టి పెట్టింది. స్టార్టప్‌లకు లభించే పెట్టుబడుల్లో కూడా అమెరికా ముందంజలో ఉంది. 2024లో అమెరికా ఎఐ సంస్థలు వంద బిలియన్ డాలర్లకు పైగా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించగా, చైనా సంస్థలకు వచ్చిన పెట్టుబడులు దానికంటే చాలా తక్కువ. అయినప్పటికీ వినియోగదారుల వరకు ఎఐ సేవలను చేరవేయడంలో చైనా ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోంది. అమెరికాలో అనేక ఎఐ సేవలు నెలవారీ చందాలపై ఆధారపడితే, చైనాలోని అనేక సంస్థలు ఉచితంగా ఎఐ సేవలు అందించి ప్రకటనలు, క్లౌడ్ సేవలు, వ్యాపార ఎపిఐల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి.

పారిశ్రామిక రంగంలో ఎఐ వినియోగంలో చైనా మరింత వేగంగా ముందుకు సాగుతోంది. చైనా తయారీ పరిశ్రమల్లో మూడవ వంతుకు పైగా సంస్థలు ఇప్పటికే ఎఐని ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగిస్తుండగా, అమెరికాలో ఈ శాతం గణనీయంగా తక్కువగా ఉంది. అంటే అమెరికా అత్యుత్తమ ఎఐ నమూనాల అభివృద్ధిలో ముందంజలో ఉంటే, చైనా వాటిని పారిశ్రామిక రంగంలో విస్తృతంగా అమలు చేయడంలో ముందుందని అర్థమవుతున్నది. కాగా, నిపుణుల అభిప్రాయం ప్రకారం అమెరికా, చైనా రెండూ పూర్తి స్వయం సమృద్ధిని సాధించలేదు. ప్రతి దేశం కొన్ని రంగాల్లో ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరస్పర ఆధారపడే వ్యవస్థలోనే భవిష్యత్ అంతర్జాతీయ భాగస్వామ్యాలు రూపుదిద్దుకోనున్నాయి. చిన్న దేశాలు కూడా తగిన మౌలిక వసతులు, చౌకైన విద్యుత్, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఉపయోగించుకొని ఎఐ రంగంలో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించగలవని విశ్లేషకులు సూచిస్తున్నారు. భారతదేశం కూడా ఎఐ రంగంలో వేగంగా ముందుకు సాగుతోంది. డేటా సెంటర్ల నిర్మాణం, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, ఎఐ ఆధారిత పరిశోధనలకు ప్రభుత్వం ప్రాధా న్యం ఇస్తోంది. భారతీయ ఐటి సంస్థలు ఉత్పాదకత పెంపు కోసం ఎఐని విస్తృతంగా వినియోగిస్తున్నాయి. అయితే ఎఐ కారణంగా కొన్ని ఉద్యోగాలు తగ్గిపోవడం, కొత్త నైపుణ్యాల అవసరం పెరగడం వంటి సవాళ్లు కూడా ఉన్నాయి. నిరుద్యోగం ఇప్పటికే పెద్ద సమస్యగా ఉన్న భారతదేశం వంటి దేశాల్లో ఎఐ విస్తరణతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి భద్రత వంటి అంశాలపై సమతుల్య విధానాలు అవసరం. మొత్తం మీద షాంఘై ప్రపంచ ఎఐ సదస్సు విజయవంతమైతే అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎఐ సాంకేతికతను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి అంతర్జాతీయ కార్యాచరణ రూపొందే అవకాశం ఉంది. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, విపత్తు నిర్వహణ, ప్రజాసేవల రంగాల్లో ఎఐను సమర్థంగా వినియోగించడం ద్వారా పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం చేయవచ్చు. అమెరికా, చైనా వంటి మహాశక్తులు పోటీతో పాటు సహకారాన్ని కూడా ప్రోత్సహించి ప్రపంచ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటే ఎఐ నిజమైన మానవాభివృద్ధికి శక్తివంతమైన సాధనంగా మారుతుంది. ఈ దిశగా విధాన రూపకల్పనలో భారతదేశం కూడా నిర్మాణాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది.

# నిజం, ఊహల మధ్య రేఖ మసకబారుతోందా?

ఒకప్పుడు ఫోటోను చూసినా, వీడియోను చూసినా వాస్తవానికి ప్రతిరూపంగా భావించేవారు. అంటే మనం చూసే ప్రతి చిత్రం, ప్రతి వీడియో వెనుక ఒక కెమెరా, ఒక సంఘటన, ఒక నిఖార్సయిన వాస్తవం ఉండేది. కానీ నేడు ఉత్పాదక కృత్రిమ మేధస్సు (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎఐ) విస్తృతితో ఆ పాత నమ్మకం పునాదులతో సహా కదిలిపోతోంది. ఇప్పుడు మనిషి కంటికి అసాధ్యంగా అనిపించే దృశ్యమైనా, కెమెరా ఎన్నడూ చూడని ఘటన అయినా, కేవలం కొన్ని పదాల ‘టెక్స్ట్ ప్రాంప్ట్’తో వాస్తవంలా కనిపించే అద్భుతమైన చిత్రాలు, వీడియోలు సృష్టించబడుతున్నాయి. ఈ పరిణామం నేపథ్యంలో ప్రధాన ప్రశ్న ఏఐ చిత్రాలు ఎంత అందంగా ఉన్నాయి? అనేది కాదు; మనకు కనిపిస్తున్నదంతా నిజమేనా? అన్నది. అసలు ఊహకు, నిజానికి మధ్య ఉన్న సరిహద్దు రేఖ మసకబారుతోందా? ఊహాశక్తి వాస్తవాన్ని కప్పివేస్తోందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మనల్ని లోతుగా ఆలోచింపజేస్తున్నాయి.

నేటి దృశ్య కృత్రిమ మేధస్సు (విజువల్ ఎఐ) సామర్థ్యాలు మానవ ఊహాశక్తిని అపారంగా విస్తరించాయి. చంద్రుడిపై పాఠశాలలు, సముద్రం అడుగున నిర్మించిన నగరం, వర్షంలో నడుస్తున్న పురాణ యోధుడు, సూర్యాస్తమయం సమయం లో చంద్రుడిపై నడుస్తున్న ఒక భారతీయ వ్యోమగామి – ఇలాంటి వ్యాక్యాలు ఒకప్పుడు కేవలం ఊహల్లో మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు కొన్ని పదాలు టైప్ చేస్తే చాలు, కొన్ని క్షణాల్లోనే అవి ఫోటోరియలిస్టిక్ రూపంలో మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నాయి. ఓపెన్ ఎఐ సోరా (Open AI Sora) వంటి అత్యాధునిక వ్యవస్థలు కేవలం స్టిల్ ఇమేజ్‌లను మాత్రమే కాకుండా, బహుళ పాత్రలు, నిర్దిష్ట చలనాలు, సంక్లిష్ట భావోద్వేగాలు, దృశ్య శైలిలో స్థిరత్వం కలిగిన ‘ఫోటోరియలిస్టిక్’ వీడియోలను కూడా సృష్టించగలవని నిరూపించాయి.

ఎఐ సృజనాత్మక ప్రపంచానికి విప్లవాత్మక అవకాశాలను తెరిచింది. సినిమా, విద్య, ప్రకటనలు, గేమింగ్, డిజైన్, వైద్యం వంటి ఎన్నో రంగాల్లో ఏఐ చిత్రాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కళారంగంలో ఒక చిన్న బడ్జెట్ సినిమా నిర్మాణంలో దర్శకుడు పెద్ద స్టూడియో స్థాయి కాన్సెప్ట్ విజువల్స్‌ను ఏఐ అప్లికేషన్స్‌తో వేగంగా, తక్కువ బడ్జెట్లో రూపుదిద్దుకోవచ్చు.విద్యారంగంలో ఉపాధ్యాయులు సంక్లిష్టమైన విజ్ఞాన భావనలను దృశ్యరూపంలో చూపిస్తూ, విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లుగా సులభతరంగా విద్యాబోధన చేయవచ్చు. చరిత్రకారులు గతాన్ని దృశ్యరూపంలో పునర్నిర్మించవచ్చు; నగరనిర్మాణ శిల్పి ఇంకా కట్టని నగరాన్ని ముందే ఎఐ ఊహాశక్తితో వీక్షించవచ్చు. ఒక రచయిత తన నవలలోని ప్రపంచాన్ని కళ్ల ముందు నిలబెట్టగలడు. ఇలా ఎఐ మనిషి ఊహను వాస్తవంగా కనిపించే దృశ్యంగా మారుస్తూ అద్భుతాలను సృష్టిస్తూ… మనిషి ఊహకు రెక్కలుగా మారుతుంది.


**ఎఐ ఊహా చిత్రాలు – మనిషి ఇంద్రియశక్తికి సవాల్**

కృత్రిమ మేధస్సు మనిషి ఊహకు వాస్తవ రూపాన్ని ఇస్తూ అద్భుతాలను సృష్టిస్తుంది. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన అసలు విషయమేమిటంటే — ఎఐ కేవలం ఊహా చిత్రాలను మాత్రమే గీయడం లేదు; అది నిజాన్ని గుర్తించే మనిషి ఇంద్రియశక్తినే పరీక్షిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum) ప్రచురించిన ఒక వివరణలో, లాంకాస్టర్ యూనివర్సిటీకి చెందిన సోఫీ నైటింగేల్, డిజిటల్ ఫోరెన్సిక్స్ నిపుణుడు హనీ ఫరీద్‌ల సంయుక్త పరిశోధనలో ఒక దిగ్భ్రాంతికరమైన విషయం వెలుగుచూసింది. ఏఐ సృష్టించిన కృత్రిమ (సింథటిక్) ముఖాలు నిజమైన ముఖాల కంటే ఎక్కువ విశ్వసనీయమైనవిగా మనుషులు రేటింగ్ ఇచ్చారు. సగటున ఆ కృత్రిమ ముఖాలు నిజమైన ముఖాల కంటే 7.7% ఎక్కువ నమ్మదగినవిగా (trustworthy) గుర్తించబడ్డాయి. ఇది చాలా ప్రమాదకరమైన సంకేతం. మోసం గుర్తించడంలోనే కాదు, నిజం చూడడంలోనూ మనిషి కళ్లకు ఉన్న శక్తిని ఎఐ చిత్రాలు మోసం చేస్తున్నాయి.

ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామం. ఎందుకంటే ఇప్పటివరకు మనం మన కళ్లతో చూసినదే నిజం అనే భావన మీదే ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నాం. కానీ నేడు సామాజిక మాధ్యమాల్లో జరగని అల్లర్లు జరిగినట్టుగా, చెప్పని మాటలు చెప్పినట్టుగా, అసలు సంభవించని ప్రకృతి విపత్తులు జరిగినట్టుగా ఎఐ సృష్టించిన చిత్రాలు వైరల్ అవుతున్నాయి. అంటే ఇప్పుడు ఒక అబద్ధానికి కేవలం మరో అబద్ధపు మాటల మద్దతే కాదు — నిజంలా కనిపించే అబద్ధపు దృశ్యం కూడా సాక్ష్యంగా నిలుస్తోంది.

**డీప్‌ఫేక్ యుగం: ‘జ్ఞాన సంక్షోభం’ మరియు ‘లైయర్స్ డివిడెండ్**

ఎఐ ఇప్పుడు కేవలం చిత్రాల వరకే పరిమితం కాలేదు. వీడియోలు, స్వరాలు, ముఖ కవళికలు, మాట్లాడే తీరు — ఇవన్నీ కూడా నిజంలా సృష్టించగలుగుతోంది. డీప్‌ఫేక్ సాంకేతికతతో ఒక వ్యక్తి చేయని పనిని చేసినట్టుగా చూపించడం,




చెప్పని మాటలు చెప్పినట్టుగా వినిపించడం కూడా సాధ్యమవుతోంది. దీంతో ఒక కొత్త ప్రమాదం ముంచుకొస్తుంది. అదేమిటంటే, నిజాన్ని అబద్ధంగా మార్చడం మాత్రమే కాదు అబద్ధాన్ని కూడా నిజంలా చూపించగలగడం. దీనినే యునెస్కో (UNESCO, United Nations Educational, Scientific and Cultural Organization), ‘జ్ఞాన సంక్షోభం (Crisis of knowing )’ గా అభివర్ణించింది. అంటే మనం చూసేది, వినేది, సమాజంతో పంచుకునేది నిజమా? కాదా? అన్న మౌలిక జ్ఞానవ్యవస్థకే ముప్పు వాటిల్లుతోందని. ఈ పరిస్థితిలో ప్రమాదం రెండు దిశల్లో ఉంటుంది. మొదటిది, అసత్యాన్ని నిజమని నమ్మడం. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే జరగని అల్లర్లు, లేని ప్రకృతి విపత్తులు, రాజకీయ నాయకులు చెప్పని మాటలను ‘డీప్‌ఫేక్’ (Deepfake) సాంకేతికత ద్వారా నిజమని నమ్మి ప్రజలు భావోద్వేగాలకు లోనుకావడం. రెండవది, నిజాన్ని అసత్యంగా త్రోసిపుచ్చడం. సమాజంలో నిజంగా జరిగిన సంఘటనను కూడా ‘ఏఐ సృష్టించిన దృశ్యమే’ అంటూ సులభంగా తప్పించుకోవడం. ఈ రెండో పరిస్థితినే నిపుణులు ‘లైయర్స్ డివిడెండ్ (Liar's dividend)’ అంటారు. అబద్ధాలకోరులకు ఎఐ ఒక రక్షణ కవచంగా మారుతోంది. ఒకప్పుడు కోర్టుల్లో, చరిత్రలో, వార్తల్లో ఫోటోలను బలమైన సాక్ష్యాధారాలుగా భావించేవారు. కానీ ఇప్పుడు ఒక చిత్రాన్ని నమ్మడానికి దాని మూలం, మెటాడేటా, ధృవీకరణ వంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇకపై ఒక ఫోటోను చూడగానే ఈ ఫోటో నిజమా? కాదా?,దీన్ని ఎవరు సృష్టించారు? దీని మూలం ఏమిటి?, ఇది ఎలాంటి మార్పులకు గురైంది? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సి వస్తోం ది. అంటే నేడు నిజం ఒకప్పటిలా కంటికి కనిపించేదిగా మాత్రమే లేదు; మూలాలతో సహా ధృవీకరించుకోవాల్సిన అంశంగా మారుతోంది.

**కళాకారులకు ఏఐ వరమా? శాపమా?**

గంటలు, రోజుల తరబడి శ్రమించి ఒక చిత్రాన్ని గీసే కళాకారుడి స్థానంలో, కొన్ని సెకన్లలోనే ఎఐ వేలాది చిత్రాలను రూపొందిస్తుండటం సృజనాత్మక రంగంలో ఆందోళన కలిగిస్తోంది. ఇది మనిషి శ్రమను, కళ యొక్క విలువను తగ్గిస్తుందా అనే చర్చ ఇప్పుడు విస్తృతంగా జరుగుతోంది. అయితే, సాంకేతికత ఎప్పుడూ మానవ మేధస్సుకు పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాలేదు. నేడు చాలామంది కళాకారులు ఎఐను ఒక శక్తివంతమైన సహాయక సాధనంగా (Copilot) ఉపయోగిస్తున్నారు. ఎఐ మనిషి ఆలోచనలకు వేగంగా రూపం ఇవ్వగలదు. కానీ మానవ జీవిత అనుభవం నుంచి, హృదయ లోతుల్లోంచి పుట్టే భావోద్వేగాన్ని మాత్రం ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఒక కళాకారుడి ఊహకు ఎఐ రూపం ఇవ్వగలదు గానీ, ఆ ఊహ వెనుక ఉన్న జీవితం, అనుభూతి, భావప్రపంచాన్ని స్వయంగా సృష్టించలేదు.

**కృత్రిమ మేధస్సు పదునెక్కిన కత్తిలాంటిది**

ఒక పదునెక్కిన కత్తితో పండును కోయవచ్చు. అదే కత్తితో ఇతరులకు హాని కూడా చేయవచ్చు. కృత్రిమ మేధస్సు (ఎఐ) కూడా అలాంటిదే. స్వతహాగా ఎఐలో మంచి, చెడు అనే స్వభావాలు ఉండవు. దాన్ని ఉపయోగించే మనిషి ఆలోచనా విధానమే దాని ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. విద్య కోసం ఉపయోగిస్తే అది జ్ఞానాన్ని అందిస్తుంది. కళ కోసం ఉపయోగిస్తే సృజనాత్మకతను పెంచుతుంది. చరిత్ర కోసం ఉపయోగిస్తే అలనాటి చారిత్రాత్మక ఘట్టాలను కళ్లముందు నిలబెడుతుంది. కానీ హింస, మోసం, ద్వేషప్రచారం, వినాశనం కోసం ఉపయోగిస్తే సమాజాన్ని, దేశాన్ని, మనుషుల మధ్య ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అంటే కృత్రిమ మేధస్సు కేవలం ఒక సాధనం మాత్రమే; అసలు సూత్రధారి మాత్రం మనిషి ఆలోచనా విధానమే.

అందుకే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా C2PA (Coalition for Content Provenance and Authenticity) వంటి ఓపెన్ స్టాండర్డ్‌లు, అలాగే కంటెంట్ క్రెడిన్షియల్స్ వంటి వ్యవస్థలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఇవి ఒక డిజిటల్ ఫైల్ ఎక్కడి నుంచి వచ్చింది, దానిలో ఎలాంటి మార్పులు జరిగాయి, దాన్ని ఎవరు సృష్టించారు వంటి ‘ప్రోవెనాన్స్’ (Provenance – మూల చరిత్ర) సమాచారాన్ని భద్రపరుస్తాయి. భవిష్యత్తులో నిజం కంటికి నేరుగా కనిపించకపోవచ్చు. కానీ దాని డిజిటల్ చరిత్రలో మాత్రం అది నిక్షిప్తమై ఉండే అవకాశం ఉంది.

ఎఐ మన కళ్లను మోసం చేయగలదు. కానీ సమాజం నైతిక ప్రమాణాలతో, వివేకంతో కొత్త నియమాలను నిర్మించుకుంటే ‘నిజం’ ఎన్నటికీ మాయమవదు; అది మరింత బాధ్యతాయుతమైన రూపంలో పునర్నిర్వచించబడుతుంది. సాంకేతికత ఎంత శక్తివంతమైనదైనా, నిజాన్ని శోధించే మానవ వివేకమే సమాజాన్ని రక్షించగలదు. సాంకేతికతను మానవ సమాజ అభివృద్ధికి ఉపయోగించినప్పుడే దాని సృష్టికి విలువ, గౌరవం, అర్థం, పరమార్థం ఉంటాయి. అందుకే మనమందరం సాంకేతికతను వివేకంతో ఉపయోగిస్తూ, నిజం, ఊహల మధ్య ఉన్న రేఖ మసకబారకుండా పదిలంగా కాపాడుకుందాం.

**ననుబోలు రాజశేఖర్,**
శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం,
9885739808,

# గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీ

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



ప్రజాపక్షం/హైదరాబాద్ : భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఐటిడిఎల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీస్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పిహెచ్‌సిలను మంజూరు చేస్తామన్నారు. కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు,ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్ లోని సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివ రావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టిజీఎంఎస్ఐడీసీ ఎండి డాక్టర్ గౌరవ్‌ఉప్పల్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్,కొత్తగా నాలుగు డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకు గానూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు,ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్సులను మంజూరు చేయాలన్నారు. వర్ష కాలం నేపథ్యంలో పిహెచ్‌సిలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

కొత్తగూడెం సహా అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని పీహెచ్‌సిలలో జనరేటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పిహెచ్‌సిలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కొమురారం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఎల్లందు హాస్పిటల్‌లో కొత్త ఐసీయూను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

కొత్తగూడెం జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. అన్నిరకాల మెడిసిన్, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన వైద్య పరికరాలు ప్రతి హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉండాలని,అవసరమైతే ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించాలన్నారు.

**అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారికి పోస్టింగులు ఇవ్వండి**

భద్రాచలం, అశ్వారావుపేట వంటి అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి కనబర్చిన డాక్టర్లు, సిబ్బందికి ఆయా హాస్పిటళ్లలలో పోస్టింగ్స్ ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శికి మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులు, సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్పిటల్స్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ మానిటరింగ్ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలకు మంత్రి వివరించారు.

**త్వరలోనే ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్సులు :** కొత్తగూడెం జిల్లాలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ మంజూరు చేశామని, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్సులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 7 డయాలసిస్ సెంటర్లు ఉండగా, కొత్తగా మరో 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశామన్నారు. కేవలం 20 నిమిషాల ప్రయాణంతో పేషెంట్ డయాలసిస్ సెంటర్‌కు చేరుకునేలా డయాలసిస్ నెట్వర్క్‌ను విస్తరించామన్నారు. భద్రాచలం, అశ్వరావుపేట, ఎల్లందు సహా ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌ సీటీ స్కాన్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామనిమంత్రి హామీనిచ్చారు.

**కొత్తగూడెం వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరితగిన పూర్తి చేయండి: కూనంనేని**

కొత్తగూడెం వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఎంసిహెచ్, జిజిహెచ్ మధ్య దూరం ఎక్కువగా ఉన్నందన ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలని సూచించారు.

కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని,అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు మంత్రి దామోదర రాజనర్సింహ స్పందిస్తూ కొత్తగూడెం ఎంసిహెచ్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్సును మానిటర్ చేసేందుకు ఒక డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించాలని అధికారులను ఆదేశించారు.



## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి

### ఇసికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం నేతృత్వంలో టిపిసిసి ప్రతినిధి బృందం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్ రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం మంగళవారం కలిసి విజ్ఞప్తి చేసింది. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియకు మరింత సమయం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యంగా హైదరాబాద్ జిల్లాలోని 15 శాసనసభ నియోజకవర్గాల్లో ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన వేగంతో సాగడం లేదని తెలిపారు. జిల్లాలో సగటున కేవలం 21 శాతం మాత్రమే సవరణ పూర్తయిందని, ప్రస్తుతం మిగిలిన 10 రోజుల గడువు సరిపోదని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఎస్ఐఆర్ గడువును వెంటనే పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా సుమారు 4,500 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఓటరు సవరణ ప్రక్రియ మందగించిందన్నారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఒలు) ఇంటింటికీ వెళ్లడం లేదని, ఎన్యూమరేషన్ ఫారాలు సక్రమంగా అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రక్రియను వేగవంతం చేయడానికి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, జిహెచ్ఎంసి సిబ్బంది సహకారాన్ని వినియోగించాలని ఎన్నికల సంఘానికి సూచించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన వారిలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్, మోతె రోహిత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన

# బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్–2026

### 14 దేశాల నుంచి 110 మంది ప్రతినిధుల హాజరు

### కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధిపై మూడురోజులపాటు చర్చలు




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ కార్మిక రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్–2026 మంగళవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీ, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా సదస్సును ప్రారంభించారు. జూలై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సు కొనసాగనుంది. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కార్మికులకు సామాజిక భద్రత, ఉద్యోగ భరోసా కల్పించినప్పుడే పరిశ్రమల్లో ఉత్పాదకత పెరుగుతుందని అన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్ వంటి సాంకేతిక మార్పులతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోందని, ఈ పరిస్థితుల్లో కార్మికులకు నైపుణ్యాభివృద్ధి, నిరంతర శిక్షణ, సామాజిక భద్రత అత్యంత అవసరమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగాలపై ప్రపంచ దేశాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ దేశాల్లో అమలవుతున్న ఉత్తమ కార్మిక విధానాలను అధ్యయనం చేసి, వాటిలో ఉత్తమమైన వాటిని అన్ని దేశాలు అనుసరించేలా సిఫార్సులు రూపొందించడమే ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం కూడా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అడ్వాన్స్‌డ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక కోర్సులను అందిస్తోందని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ సంస్థ టామ్‌కామ్ ద్వారా జర్మనీ, జపాన్, యూరప్, మధ్యప్రాచ్య దేశాలతో పాటు పలు దేశాల్లో తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.ఈ అంతర్జాతీయ సదస్సులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బెలారస్, మలేషియా, నైజీరియా దేశాలకు చెందిన సుమారు 110 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. కార్మిక సంక్షేమం, సామాజిక న్యాయం, ఉపాధి భద్రత, ట్రేడ్ యూనియన్ల బలోపేతం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై విస్తృత చర్చలు నిర్వహించి భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన సిఫార్సులు రూపొందించనున్నారు.

దేశంలోని అతిపెద్ద కేంద్ర కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆతిథ్యమిస్తున్న ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా సేవలందించాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఇహెచ్‌సిటి) బోర్డు సభ్యునిగా నియమితులైన స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టియుటిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును హైదరాబాద్‌లోని మఖ్ధూం భవన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సదానందం గౌడ్‌ను కూనంనేని సాంబశివరావు శాలువాతో సన్మానించి, ఇహెచ్‌సిటి బోర్డు సభ్యునిగా నియమితులైనందుకు అభినంధించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో సమర్థవంతంగా సేవలందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, హెడ్ క్వార్టర్స్ సెక్రెటరీ వై.కరుణాకర్ రెడ్డి, సంఘ మాస పత్రిక సబ్ ఎడిటర్ శంకర్ మాతంగి తదితరులు పాల్గొన్నారు.

# ఆ నీళ్లను ఎత్తిపోయండి

### గంగుల కమలాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడిగడ్డ బ్యారేజ్ వద్ద రోజుకు 9టిఎంసి నీళ్లు పోతున్నాయని,కన్నెపల్లి పంపులు ఆన్ చేసి, అన్నారం బ్యారేజిలో నీళ్లను ఎత్తిపోయవచ్చని, ఒక వేళ అన్నారం బ్యారేజ్ కూలిపోతే అందుకు బిఆర్ఎస్ బాధ్యత వహిస్తుందని బిఆర్ఎస్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంపులను ఆన్ చెయాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద,ముఠాగోపాల్,పాడి కౌషిక్ రెడ్డి,బండారి లక్ష్మా రెడ్డితో కలిసి గంగుల కమలాకర్ మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజ్ వద్ద రోజు 9 టి ఎంసిల నీళ్ళు పోతున్నాయని,కన్నేపల్లి పంపులు ఆన్ చేసి అన్నారం బ్యారేజ్‌లో నీళ్ళు ఎత్తిపోయవచ్చని సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోతుందని, సిఎం రేవంత్ రెడ్డికి తప్పుడు సలహాలు ఇస్తున్నారన్నారు. పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ కు ఏమైనా జరిగితే 28 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే బాధ్యత వహిస్తారన్నారు.

అన్నారం సుందిళ్ల బ్యారేజ్ కు ఏమైనా జరిగితే తాము రాజీనామా చేసి, రాజకీయాలకు దూరంగా ఉంటామని సవాల్ విసిరారు. కెపి వివేకానంద మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో సాగు,తాగునీటికి ప్రజలు, ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య మరింత ఎక్కువ అయ్యే అవకాశం కనిపిస్తోందన్నారు.

## కూనంనేనిపై ఫిర్యాదు వార్త పూర్తిగా అవాస్తవం

### ఛానల్స్‌లో వచ్చిన దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా

### ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ కలిసే ఉన్నాయి

### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుపై తాను కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రముఖ టివి ఛానల్‌లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని, సదరు దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వార్త ఛానల్‌లో ప్రసారమైన వార్తపై మంగళవారం ఆయన వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ కేవలం కాంగ్రెస్ ఎంపిను పిలిపించి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి మాత్రమే వివరణ తీసుకున్నారని ఎంపి స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకుసంబంధించి వివరాలు సేకరించారని, అందులో భాగంగానే తాము కూడా పాల్గొన్నామని తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాల రిపోర్టు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే తాము మీనాక్షికి కూలంకుషంగా వివరించామని చెప్పారు. రాజకీయ లబ్ధికోసం ఇలాంటి తప్పుడు వార్తను ప్రసారం చేయించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సిపిఐ కాంగ్రెస్ కలిసికట్టుగా ఉన్నాయని తమ మధ్య ఎలాంటి విభేదలు లేవని రామసహాయం రఘురామిరెడ్డి స్పష్టం చేశారు.

# తుది దశకు సిట్ దర్యాప్తు

### రెండో చార్జ్‌షీట్‌కు సన్నాహాలు

### పూర్తి దశలో కీలక సాక్షుల వాంగ్మూలాల నమోదు






ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు సేకరించిన సాంకేతిక, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తోంది. దర్యాప్తు పూర్తయిన అనంతరం రెండో చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కేసుకు సంబంధించిన పలువురు పోలీసు అధికారులు, బాధితులు, సాక్షులను సిట్ విచారించింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి.వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసింది. ఆయనను నిందితుడిగా కాకుండా సాక్షిగా విచారించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్, నిఘా వ్యవస్థ పని తీరు, అప్పటి పరిస్థితులపై ఆయనకు తెలిసిన వివరాలను అధికారులు నమోదు చేసినట్లు తెలిసింది. దర్యాప్తులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ కోసం ఉపయోగించిన సాంకేతిక వ్యవస్థలు, కాల్ డేటా, డిజిటల్ పరికరాలు, సర్వర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేసులో ఉన్న ఆధారాలను బలోపేతం చేసే దిశగా సిట్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో తొలి చార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన సిట్, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన కొత్త అంశాలు, అదనపు ఆధారాలు, తాజా సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా రెండో చార్జ్‌షీట్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో మరికొంత మంది వ్యక్తుల పాత్ర, కుట్ర, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ప్రస్తావించే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితులపై ఇప్పటికే పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని అరెస్టులు లేదా అదనపు అభియోగాలు నమోదయ్యే అవకాశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకోవడంతో రెండో చార్జ్‌షీట్‌లో ఎలాంటి కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయన్న ఆసక్తి రాజకీయ, పోలీసు వర్గాల్లో నెలకొంది. ప్రస్తుతం సిట్ తుది నివేదిక, రెండో చార్జ్‌షీట్ సిద్ధీకరణపై దృష్టి సారించినట్లు సమాచారం.

# సింగరేణిని కెసిఆర్ జేబు సంస్థగా మార్చారు

### కేటీకే-8 గనిలో గేట్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి




ప్రజాపక్షం/భూపాలపల్లి : గత పది సంవత్సరాలుగా సింగరేణిని కెసిఆర్ అప్పుల పాలు చేసి తన జేబు సంస్థగా మార్చాడని, బిఆర్ఎస్, కాంగ్రెస్ ఇద్దరు కలిసి 54 వేల కోట్ల సింగరేణి కి అప్పు చేశారని జీతాలకు బ్యాంకుల చుట్టూ తిరగవలసిన దుస్థితికి దిగజారిచ్చారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే8 సింగరేణి గనిలో మంగళవారం సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పని శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, టిఆర్ఎస్ కాంగ్రెస్ వళ్ళ సింగరేణి సంస్థ 15 ఏళ్లు వెనక్కి వెళ్లిందని టిఆర్ఎస్ కాంగ్రెస్ రెండు దొందు, దొందేనని అన్నారు. దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి ఇంధనంగా నిలుస్తున్న సింగరేణి కార్మికుల కృషి దేశానికి ఎంతో విలువైనదని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలు, వైఫల్యాల కారణంగా సింగరేణి కార్మికుల్లో అభద్రతాభావం, ఆందోళన పెరిగిందని అన్నారు. సింగరేణిని దేశంలోనే అత్యంత కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థగా బలోపేతం చేయాల్సిన గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) నిధులను సిద్దిపేట, సిరిసిల్ల, కొడంగల్ కు తరలించారని అన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిని దేశంలోనే ఆదర్శ ప్రభుత్వ రంగ సంస్థగా తీర్చిదిద్దుతామని, కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, బీజేపీ రాష్ట్ర, కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, రాష్ట్ర జిల్లా మండల నాయకులు, బీఎంఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, సిద్దిపేట.**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

e-NIT No. 02/SE (R&B) SDPT/DSE/2026-27 తేది: 10.07.2026

| | | |
|---|---|---|
| 1 | పని పేరు మరియు సుమారు అంచనా కాంట్రాక్ట్ విలువ వివరాలు | "సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో గౌరవనీయులైన మంత్రి వినియోగిస్తున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన, భోజనశాల, సిబ్బంది గదులు మరియు మరుగుదొడ్లతో కూడిన మీటింగ్ హాల్ షెడ్ నిర్మాణం." ఇసివి: రూ.84.00 అంచనా (సుమారుగా) |
| 2 | బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం | 17.07.2026 సా.4:00గం.లకు |
| 3 | బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | 31.07.2026 మ.3:30గం.ల వరకు |
| 4 | టెండర్ ప్రారంభ తేది మరియు సయయం | టెక్నికల్ బిడ్ : 31.07.2026 సా.4:00గం.లకు కమర్షియల్ బిడ్ : 05.08.2026 సా. 4:00గం.లకు |
| 5 | సంప్రదించవలసిన సూపరింటెండింగ్ ఇంజనీర్ పేరు & చిరునామా | సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్, సిద్దిపేట. ఫోన్ నెం. 8121127730. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు. |

మరిన్ని వివరాలకు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in/లో 17.07.2026 సా.4:00గం.ల నుండి చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), సర్కిల్, సిద్దిపేట.

DIPR R.O. No. : 6034-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

జీడిమెట్ల సర్కిల్-55, క్యూబిజెడ్, సిఎంసి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు & మొబైల్ నెం. |
|---|---|---|---|---|---|
| NIT No. 11/DB/EE-III/JDM/C-55/QBZ/CMC/2026-27, Dated: 14.07.2026 | సిసి (CC) రోడ్డు నిర్మాణం, అదనపు క్యాచ్పిట్లు, హై మాస్ట్ పోల్స్ ఏర్పాటు మరియు ఏబి (AB) కేబుల్ సేకరణ (6 పనులు) | రూ. 58.656 లక్షలు | 15.07.2026 @ 3:00PM | 23.07.2026 @ 3:00PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సెల్ నెం. 8712034411 |

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు & మొబైల్ నెం. |
|---|---|---|---|---|---|
| NIT No. 11/DB/EE-III/JDM/C-55/QBZ/CMC/2026-27, Dated: 14.07.2026 | బోనాల పండుగ (2 పనులు) | రూ. 2.00 లక్షలు | 15.07.2026 @ 3:00PM | 18.07.2026 @ 3:00PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సెల్ నెం. 8712034411 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III, జెడిఎం సి-55, సిఎంసి.

DIPR R.O. No. : 6051-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

తెలంగాణ ప్రభుత్వము

**ఉపసంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయము**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా

ఆర్.సీ.నం. A2/09/2026 :: టెండరు ప్రకటన :: తేది: 14.07.2026

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోని (04) Post matric వసతి గృహాలకు 2026 2027 సంవత్సరానికి గాను దిగువ తెలుపబడిన సేవలు అందించుట కొరకు అర్హులైన వారి నుండి టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర. సం. | సేవల వివరాలు | వివరాలు | ధరావత్తు (EMD) | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| (04) Post matric వసతి గృహాలకు 2026-2027 సంవత్సరానికి గాను దిగువ సేవలు | | | | |
| 1 | క్యాటరింగ్ (వంట చేయుటకు) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | రూ. 40,000=00 | రూ.1000=00 |
| 2 | స్వీపింగ్ మరియు సానిటేషన్ | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | | |
| 3 | డే మరియు నెట్ వాచ్ మెన్ (సెక్యూరిటి సర్వీస్) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | | |

కావున ఆసక్తి గల కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకి సంబంధించిన పైన తెలుపబడిన సేవలను అందించుట కొరకు రూ.1000=00 Demand Draft "District SC Development Office, Kumuram Bheem Asifabad" జిల్లా పేరున టెండర్ ఫారం నియమ నిబంధనల ప్రకారం తేది: 15.07.2026 ఉ. 10.30 నుండి 20.07.2026 సాయంత్రం 4:00 గంటల వరకు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయము, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుండి పొందవచ్చును. పూర్తి చేయబడిన టెండర్లు తేది 21.07.2026 నాడు సాయంత్రం 4:00 గంటల లోపు స్వీకరించబడును. ఇట్టి టెండరును అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), కుమురం భీం ఆసిఫాబాద్ కార్యాలయము నందు తేది: 22.07.2026 నాడు సమయం సాయంత్రం 03:30 PM గంటలకు తెరువబడును. గడువు తరవాత వచ్చిన టెండర్ ఫారములు స్వీకరించబడవు. ఇట్టి టెండర్లను వాయిదా వేయుటకు గాని, రద్దు పరుచుటకు గాని అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్), కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గారికి పూర్తి అధికారము కలదు.

సం/- షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ అధికారి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా

DIPR R.O. No. : 6006-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఇఇ-II (56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No. 16/EE-56/QBZ/CMC/2026-27, 16/EE-59/QBZ/CMC/2026-27 & NIT No. 15/EE-60/QBZ/CMC/2026-27, Dt:14.07.2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలకు @https://tender.eprocurement.gov.inలో లాగ్ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీ వివరాలు క్రింది విధముగా ఉన్నాయి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం (లక్షలలో) | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 16/EE-56/QBZ/CMC/ 2026-27, Dt: 14.07.2026 | బొల్లారం క్రాస్ రోడ్ వద్ద జంక్షన్ మెరుగుదల పనులు-1 మరియు సి.సి. రోడ్డు నిర్మాణం పనులు-2. | 80.80 | 17.07.2026 02.00 PM to 24.07.2026 02.00 PM | ఇ.ఇ., సర్కిల్-56, 59 & 60, సిఎంసి, కుత్బుల్లాపూర్. సెల్ నెం. 7995468066 / 7331181426 |
| NIT No. 16/EE-59/QBZ/CMC/ 2026-27, Dt: 14.07.2026 | దుండిగల్ వద్ద జంక్షన్ మెరుగుదల పనులు-1 | 24.00 | 17.07.2026 02.00 PM to 24.07.2026 02.00 PM | |
| NIT No. 15/EE-60/QBZ/CMC/ 2026-27, Dt: 14.07.2026 | శివాజీ విగ్రహం జంక్షన్ వద్ద జంక్షన్ అభివృద్ధి పని-1 | 45.00 | 17.07.2026 02.00 PM to 24.07.2026 02.00 PM | |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-56,59&60, క్యూబిజెడ్, సిఎంసి.

DIPR R.O. No. : 6000-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

# ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలి

● కెజిబివిలలో విద్యార్థులకు విద్య,వైద్యవసతులు ● పేదలందరికీ ప్రభుత్వ వైద్యం ● 'సర్' ఫారముల డిజిటలైజేషన్ పూర్తి ● జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





**ప్రజాపక్షం/దస్తురాబాద్ :** నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం దస్తురాబాద్, కడెం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనల్లో కెజిబివి లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ,ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన చేపట్టారు.ముందుగా కెజిబివిను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని) తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ, ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు.విద్యార్థులు,అధికారుల సంఖ్య, ప్రస్తుత హాజరు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాన్ని పరిశీలించారు.అనంతరం దస్తురాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వసతులను పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడుతూ, రోజువారీగా సరాసరి ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య చికిత్సలు, వైద్యులు, సిబ్బంది సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.తప్పనిసరిగా సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు చికిత్సలు అందించాలన్నారు.ఆసుపత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేసి,ఎప్పటికప్పుడు రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం దస్తురాబాద్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. మొత్తం ఓటర్ల సంఖ్య, పంపిణీ పూర్తిచేసిన ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ వెంటనే ముగించాలని ఆదేశించా రు.అనంతరం కలెక్టర్ కడెం మండలంలో పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని కెజిబివిని తనిఖీ చేశారు. పదవతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రతి రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. పలు విషయాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి, విద్యార్థులకు పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. సమాధానాలు చెప్పిన విద్యార్థులనుఅభినందించారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతిరోజు వైద్యులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ చికిత్సలు అందించాలని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈవో భోజన్న, డిఎంహెచ్ఓ రాజేందర్, తహసీల్దార్లు యాదవ రావు, ఖాజా మొయినుద్దీన్, ఎంఇఒలు గంగాధర్,శ్రీనివాస్ రెడ్డి,దస్తురాబాద్ సర్పంచ్ గోపాల్, ఇతర అధికారులు,సిబ్బంది,పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మంగళవారం జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రికి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ. భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రకాష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్క ఓటరు 'సర్'లో గణన చేసుకోవాలి

ఫోరమ్ అధ్యక్షులు శ్రీదర్ మహేంద్ర



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** అర్హులైన ప్రతి ఒక్క ఓటర్ (సర్)లో గణన చేసుకోవాలని అనర్హుల ఓట్లు తొలగించాలని పోరమ్ అధ్యక్షులు శ్రీదర్ మహేంద్ర తమ కుటుంబ సభ్యుల ఓటర్ వివరాల ఎస్ఐ ఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారికి అందచేసిన అనంతరం మాట్లాడుతూ అర్హులైనప్రతీ ఒక్క ఓటర్ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో ఓటర్లు తమ వివరాలు గణన చేసుకోవాలని ,అర్హులైన వారు తమ ఓటు హక్కు తొలిగి పోకుండా సర్‌లో ఓటర్‌లు తమ వివరాలు, సరి చూసుకోవాలని అన్నారు. అర్హులైన ఓటర్‌ల వివరాలు తప్పులు లేకుండా సర్‌లో గణన చేయాలని ,అదే విధంగా అనర్హులైనవారి బోగస్ ఓట్లు తొలగించాలని కోరారు.

## ఆర్ఐని సస్పెండ్ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుకను అక్రమంగా దారి మళ్లించడానే ఫిర్యాదు మేరకు మెండోరా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) సదానంద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు గట్టి నిఘా కొనసాగిస్తున్న విషయం విధితమే. మన ఇసుక వాహనం బుకింగ్ యాప్‌తో మాత్రమే ఇసుక తరలింపునకు అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ లబ్ధిదారుల ఏపరిట ఇసుక తరలింపునకు అనుమతులు పొంది ఇసుక నిల్వలను దారి మళ్లిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను సైతం అధికారులతో వాకబు చేయించగా, తమకు ఇసుక అందలేదని వెల్లడించారు. దీనిని తీవ్రంగా పరిగణించి కలెక్టర్ ఇలా త్రిపాఠి, మెండోరా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సదానంద్‌ను సస్పెండ్ చేస్తూ మం గళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ దారి మళ్లింపు విషయ మై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని, మై నింగ్ ఏడీని ఆదేశించారు. ఇసుక రవాణాలో అక్రమాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## బిఎల్ఓ రజితకు మంత్రి సత్కారం



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణంలో ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన 22వ బూత్ బిఎల్ఓ పొడాల రజితకు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రశంసా బహుమతి అందజేసి ఘనంగా సత్కరించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఆమె కనబరిచిన కర్తవ్యనిష్ఠ, సమయపాలనను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీలోగా ప్రతి బిఎల్ఓ తమ పరిధిలోని ప్రతి అర్హ ఓటరును వ్యక్తిగతంగా సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారమ్‌ను పూర్తిగా నింపించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ కూడా 22వ బూత్‌లో చేపట్టిన కార్యాచరణను ఆదర్శంగా తీసుకుని, బిఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ఎక్కువ మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసే దిశగా చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రజిత చూపిన పనితీరు, క్రమశిక్షణ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి, ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ నర్సింగ్, పట్టణ అధికార ప్రతినిధి, 22వ బూత్ బూత్ లెవల్ ఏజెంట్ సట్ల సంతోష్ గౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు రాచర్ల గణేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జెసిఐ నిర్మల్ స్ఫూర్తి ప్రగతి బాట

తేజస్ మిడ్‌కాన్–2026లో 8 ప్రతిష్ఠాత్మక అవార్డులు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** హైదరాబాద్ సోమాజిగూడలోని కత్రియ హోటల్‌లో ఘనంగా నిర్వహించిన జేసీఐ ఇండియా జోన్12 తేజస్ మిడ్‌కాన్–2026లో జేసీఐ నిర్మల్ స్ఫూర్తి అద్భుత ప్రతిభ కనబరిచింది. వివిధ విభాగాల్లో ఏకంగా ఎనిమిది ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకుని, నిర్మల్ జిల్లా పేరును జాతీయ స్థాయిలో మారుమోగించింది. సంస్థ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలు, నాయకత్వ అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తింపుగా ఉత్తమ స్థానిక వ్యక్తిగత వికాస (ఐడీ) కార్యక్రమం విభాగంలో జేసీఐ నిర్మల్ స్ఫూర్తి విజేత (విన్నర్) అవార్డును అందుకుంది.వ్యక్తిగత ప్రతిభా విభాగాల్లో కూడా నిర్మల్ స్ఫూర్తి సభ్యులు అవార్డుల పంట పండించారు. సంస్థ విజయానికి అండగా నిలిచిన జేసీ డి. విశ్వశ్రీ (కార్యదర్శి), జేసీ దుగ్గె అనిల్ (కోశాధికారి), ఎల్‌జీబీ సభ్యులు, ప్రతి ఒక్క జేసీ సభ్యునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో సమాజ సేవ, యువత నాయకత్వ వికాస కార్యక్రమాలను విస్తృతం చేస్తూ సంస్థను జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానంలో నిలబెడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎస్‌సి ఎస్‌టిలపై దాడులను అరికట్టండి

సిఎం రేవంత్ రెడ్డికి డిబిఎఫ్ విన్నపం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఎస్‌సి ఎస్‌టి అత్యాచారాల నిరోధక ప్రకారం ముఖ్యమంత్రి అధ్యక్షతన సంవత్సరంలో రెండుసార్లు నిర్వహించాల్సిన హై పవర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఎస్‌సి ఎస్‌టిలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు సమీక్షించి నివారణ చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) విన్నవించింది. రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నాయకత్వంలో మంగళవారం ముఖ్యమంత్రి ని కలవడం జరిగిందని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి ఎస్‌టిల పై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని వాటిని అరికట్టాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు.

## మెదక్ జిల్లాలో 55 శాతం 'సర్' నమోదు పూర్తి

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ మున్సిపాలిటీ లోని వార్డ్ నెంబర్ 11 లో సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీఓ, తాహాసిల్దార్ మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. మెదదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ సర్ మోదుకు ఈనెల 24 న చివరి తేదీ ఉందన్నారు. మెదక్ లో 53 శాతం సర్ ప్రక్రియ నమోదయిందని, 4,55000 మంది ఓట్లు కలిగిన మెదక్ లో 55 శాతం సర్ నమోదు శాతాన్ని పూర్తి చేశామన్నారు. సర్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ఫారాలు అందజైయడంతో పాటు వాటిని పూర్తి చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అవసరమైన చోట రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ సిబ్బందితో పాటు ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ఏజంట్లును సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వీడియోలు, సందేశాలు పంపించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని స్పష్టం చేశారు. శని, ఆదివారాల్లో అన్ని మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఎస్ఐఆర్ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించిన కలెక్టర్, ఈ నెల 24వ తేదీలోపు నమోదు ప్రక్రియను నూరు శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, తాహాసిల్దార్ లక్ష్మ ణ బాబు, మున్సిపల్ కమిషనర్ నవీన్, స్థానిక కౌన్సిలర్లు వెంకటరమణ, ఇతర నాయకులు ఉన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి


కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగుపై ఆధారపడకుండా తక్కువ నీటి అవశ్యకత గల ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండకపోవడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో వరి పంట విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. బోరుబావుల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు కూడా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, కంది వంటి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను నివారించవచ్చని తెలిపారు. ఈ నెల జూలై 31 వరకు కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ఆగస్టు మొదటి వారంలో కందులు, ఉలవలు, అలసందలు, ఆముదం, నువ్వులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల విత్తనాలు విత్తుకోవడం రైతులకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. 2025 వానాకాలం సాగు వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 47 వేల 576 ఎకరాలలో వరి సాగు జరగగా, అందులో 22 వేల 876 ఎకరాలు బోరుబావుల ఆధారంగా, 24 వేల 700 ఎకరాలు చెరువులు, కుంటలు, వర్షాధారంపై సాగు జరిగిందని తెలిపారు. రైతులు పంటలు ఎంపిక, విత్తనాల లభ్యత, సాంకేతిక సూచనల కోసం తమ సమీప మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని కలెక్టర్ సూచించారు.

## మెదక్ అభివృద్ధే లక్ష్యంగా పని

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ. 2.93 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురికి కాలువ ల నిర్మాణ పనులకు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కమిషనర్ నవీన్ తో కలిసి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని 31,30, 23,22, 20,16,17,18,19,21,28 వార్డుల్లో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. కౌన్సిలర్లు మన్సూర్ అహ్మద్, అఖిల భరత్, శశాంక్, గంట సంపత్, శివరామకృష్ణ, రాజమణి, శేఖర్, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, కొరివి రాములు, తహేర్, బొజ్జ పవన్, దయాసాగర్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.


## పోడు భూముల సమస్యల పరిష్కారం

కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/కోటపల్లి :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం అటవీ హక్కుల గుర్తింపు చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, కోటపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని స్పష్టం చేశారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులకు అర్థమయ్యేలా వివరించాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్‌ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మందులు లేక ఇబ్బందులు పడుతున్న రోగులు

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వెంకట్రాజ్యం



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఇఎస్ఐ హస్పిటల్ రామచంద్రాపురంలో రోగులకు సరైన మందులు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు ఇచ్చి షేషంట్లకు సరయైన వైద్యము అందించాలని కోరుతూ నేడు ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈఎస్ఐ హాస్పిటల్స్ సూపరెంటెండెంట్ రమేష్ బాబును కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వెంకట్రాజ్యం మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రాంతమైన పటాన్చెరు పరిదిలోని రామచంద్రాపురం నందు 100 పడకలతో ఇఎస్ఐ హాస్పిటల్ నడుస్తున్నదని కానీ ఈ హాస్పిటల్‌లో షేషంట్లకు సరియైన మందులు ఆపరేషన్ చేసుకోవలసిన పేషంట్లకు మత్తు మందు లాంటి కనీస అవసరమైన మందులు లేకపోవడంతో పేషంట్లు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షల మంది కార్మిక కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతమైనటువంటి రామచంద్రాపురం హాస్పటల్ రోగులకు సరైన వైద్య సహాయం అందకపోవడం తీవ్రమైన అనారోగ్యానికి లోవనవుతున్నారు. రామచంద్రాపురం ఇఎస్ఐ హాస్పిటల్ నందు సరైన అంబులెన్స్ సౌకర్యం కూడా లేకపోవడంతో బయటకు రిఫర్ చేస్తున్నటు వంటి రోగులు తమ సొంత ఖర్చులతో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అత్యవసర సమయంలో ఉపయోగపడవలసిన అంబులెన్సులు లేకపోవడంతో పేషంట్లు తమ సొంత ఖర్చులతో వెళ్లలేని వారు గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి నెల నెల తమ వేతనాలను నుండి ఇఎస్ఐ కాంట్రిబూష్యన్ చెల్లిస్తున్నపటికి సరైన వైద్య సహాయం అందించక ఇఎస్ఐ యాజమాన్యం కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నది .ఇప్పటికైన వెంటనే పెషంట్లకు కావలసిన అన్ని రకాల మందులు ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించిన ఇన్‌స్ర్యూమెంట్స్ పరికరాలు వెంటనే ఏర్పాటు చేసి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. పటాన్చెరు పారిశ్రామిక ప్రాంతం నుండి పెద్ద ఎత్తున కార్మికులను తరలించి ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించడం జరిగింది. నర్సింలు , సునీల్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం సహకరించడం లేదు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాకులు ఇస్తామని అనుకున్నా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం బిజెపి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి3 గనిపై చేపట్టిన సింగరేణి భరోసా యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో నైనీ, తాడిచెర్ల 2 బొగ్గు బ్లాకులను సంస్థకు కేటాయించారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి నిధులు 54 వేల కోట్లు వాడుకుందని, చివరకు కార్మికుల జీతాలు బ్యాంకులనుంచి అప్పుతెచ్చి ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. గత కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం 118 బొగ్గు బ్లాకులను వేలానికి అమ్ముకుందని, సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు కుంభకోణం జరిగిందని ఆరోపించారు.తాడిచెర్ల 1 బ్లాక్‌లో టిప్పర్ల ద్వారా కాకుండా కన్వేయర్ బెల్ట్ ద్వారా బొగ్గు రవాణా చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి భవిష్యత్తు కోసం కేంద్రం కేటాయించిన బ్లాకుల్లో 350 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నాయని, తాను తెలంగాణ ప్రాంత మంత్రి కావడంతో ప్రధానితో మాట్లాడి ఈ బ్లాకులు కేటాయించేలా కృషి చేశానని చెప్పారు. సంస్థను కాంగ్రెస్ మంత్రులు కమిషన్లతో దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. కార్మికులు, నాయకులు జెండాలు పక్కనపెట్టి సంస్థ రక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, గోడం నగేష్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి ఫ్లోర్ లీడర్ మహేశ్వరరెడ్డి, శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేష్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, రామారావుపటేల్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేరబెల్లి రమణాధరావు, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గుమాస శ్రీనివాస్, కందుల సంధ్యారాణి, ఏమాజీ, నాయకులు కమలాకరరావు, హాస్నవేని సదానందం, నత్రం రమేష్, మధుసూదన్‌రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియ పరిశీలించిన ఎమ్మెల్యే

బిఎల్‌ఒలు జాగ్రత్తగా ఓట్లు పరిశీలించాలి

ఏ ఒక్క ఓటు పోకుండా చూడాలి

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో జరుగుతున్న SIR ప్రక్రియ కార్యక్రమాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అకస్మాత్తుగా పరిశీలించారు. ఈ సందర్భంగా BLO ల ఫైళ్లను, ఫారంలను పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. తహశీల్దార్, ఎంపిడివో BLO లతో మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవగాహన కల్పించాలని, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లకు సమాచారం అందించి వారి ప్రక్రియ సైతం పూర్తి చేసేలా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సర్పంచ్ రవీందర్, బాబులాల్, విడిసి చైర్మన్ పోతన్న, ఎలుక రాజు, మల్లెపూల సుభాష్, రమణ గౌడ్, అల్లకొండ ప్రశాంత్, రఫీ, సంజీవ్, బాపురెడ్డి, వినయ్, ఇఫ్తేకార్, గోపాల్, సందీప్, ఉప సర్పంచ్ మామిడి సంతోష్ పాల్గొన్నారు.



## 'ఆల్ఫోర్స్' విద్యార్థినికి బంగారు పతకం



ప్రజాపక్షం/కొత్తపల్లి : ఆల్ఫోర్స్ విద్యార్థినికి రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో బంగారు పతకం రావడం పట్ల విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాల పట్ల విస్తృతమైన అవగాహన కల్పించడం ద్వారా వాటి పట్ల ఆసక్తి పెరుగుతుందని పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఎస్ఐపి సఫలీకృతులు అయ్యారని ఎన్నో కార్యక్రమాల ద్వారా నేటికి సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. పాఠశాలకు చెందిన ఈ.అన్విత బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రం, ట్రోఫీ గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ : రెసిడెన్సియల్ కళాశాలలో చదవడం ఇష్టం లేక, కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వలన మనస్థాపం చెంది ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో జరిగింది. సిద్దిపేట త్రీటౌన్ సిఐ లక్ష్మి బాబు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ,ఇల్లంతకుంట మండలం వెంకట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన సిరినేని పుష్ప భర్త మల్లయ్య(39) ప్రస్తుత నివాసం మిట్టపల్లి ఆమె భర్తతో సంసారం విషయంలో గొడవల కారణంగా గత కొంత కాలం నుండి తన కూతురు సిరినేని హర్ష శ్రీ(16)తో తల్లి గారింట్లో నివాసం ఉంటుదని, హర్షశ్రీ పదవతరగతిలో మంచి మార్కులు సాధించి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంద న్నారు. రెసిడెన్షియల్‌లో చదవడం ఇష్టం లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంలో కలత చెంది మంగళవారం ఉదయం తన అమ్మమ్మ ఇంట్లో చీరతో ఇంటి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కృష్ణవేణి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని మార్కండేయ కాలనీలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించని కృష్ణవేణి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పాఠశాల ఎదుట నిరసన చేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగు రంగుల కరపత్రాలతో ,హంగు ఆర్భాటాలతో లేనివి ఉన్నట్టుగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, అనర్హత (డిగ్రీ పాసైన)కలిగినటువంటి ఉపాధ్యాయులచే విద్యాబోధన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, కనీసం 40 మంది విద్యార్థులకు రెండు మూత్రశాలలు, ఒక మరుగుదొడ్డిని కేటాయించాలని జీవోలు చెబుతున్నప్పటికీ విద్యార్థులకు సరిపడు మూత్ర శాలలు, మరుగుదొడ్లు లేవని, విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. విద్యార్థులకు తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యాధికారులు కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మీ ప్రసన్న, గొడిసెల ప్రణీత్, తడిగొప్పుల అనూప్ సాయి, ఆరే జశ్వంత్, అభి, చైత్ర, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం



జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను చిన్న చిన్న భాగాలుగా విభజించి పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పరిసరాలను కలియ తిరుగుతూ సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్ టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పది రోజుల్లోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి**

చొప్పదండి ఏరియా(వంద పడకల) ఆసుపత్రిలో పెండింగ్ పనులను పది రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం చొప్పదండిలోని ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్, డీజీహెచ్ఎస్ కృష్ణ ప్రసాద్, టీజీఎంఐడీసీ అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్, ఈఎంటీ బృందం అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ తో పాటు వివిధ వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమంకు వచ్చిన మంద అనిల్ కుమార్, పెండ్యాల ఆదిత్యాను అడ్డుకొని అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై ఆధారపడి ఉందని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కనీవినీ ఎరుగని రీతిలో పుష్కరాల ఏర్పాట్లు

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/ధర్మపురి : రాబోవు 2027 గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మపురి గోదావరి పుష్కరఘాట్లను దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించిన మంత్రి, పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో క్షేత్రస్థాయిలో విస్తృత సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకై చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పుష్కరాలకు సంబంధించిన అన్ని ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ధర్మపురిలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బైపాస్ రోడ్లు, స్నాన ఘాట్లు, ట్రాఫిక్ నిర్వాహణ, రహదారుల విస్తరణ, టాయిలెట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలను అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను తొలి విడతలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం అదనంగా రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని, భక్తులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని కల్పించడంలో ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచేలా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. పుష్కరాల మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు స్థానిక ఇలవేల్పు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, దేవస్థానం ఈఓ సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, తహశీల్దార్ ఏ.శ్రీనివాస్ దేవాదాయశాఖ, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ జిల్లా అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షులు: పోలోజు రంజిత్, కార్యదర్శి: బ్రాహ్మణపల్లి యుగంధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ : కసి బోసుల సంతోష్ చారి, ఉపాధ్యక్షులు :మ్యాకల రమ్య, మచ్చ రమేష్, సహాయ కార్యదర్శులు. కాల్వ శ్రీనివాస్ యాదవ్, చెంచల మురళి, కోశాధికారి చెంచల రవిలతోపాటు 25 మందితో కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని ఉద్దేశించి ధర్మేంద్ర మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో యువజన సంఘాన్ని ప్రతి గ్రామంలో బలోపేతం చేసి యువజన హక్కుల సాధన కోసం యువతను కదిలించాలని, గ్రామ గ్రామన యువజన సంఘాన్ని నిర్మించి రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీల సాధన కోసం, నిరుద్యోగ భృతి, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం యువతను చైతన్యపరిచి పోరాటాల వైపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో యువత కోసం ప్రత్యేక యువజన కేంద్రాలు ప్రభుత్వ కోచింగ్ సెంటర్లు ఉద్యోగ మార్గదర్శక కేంద్రాలు నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు కోసం పోరాటాలు చేయాలని సమగ్ర యువజన విధానం అమలు కోసం పోరాడాలన్నారు.

## జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సంజయ్

నాణ్యమైన ఆహారం, మౌలిక సదుపాయాలపై అధికారులకు ఆదేశాలు



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల బీసీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్.ఎం.సంజయ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వంటశాల, స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, బూస్టర్ మెనూ అమలు, ఆహార పదార్థాల కేటాయింపుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పంక్తిలో కూర్చుని భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే విద్యార్థులు ప్రస్తావించిన మౌలిక సదుపాయాల సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కళాశాల భవనానికి సంబంధించిన అంశాలపై కూడా అధికారులతో చర్చించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కళాశాల హెల్త్ సూపర్‌వైజర్‌కు సూచించిన ఎమ్మెల్యే, అవసరమైన ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం పెంచడం, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఉదయం అల్పాహార పథకాన్ని అమలు చేయడంపై ముఖ్యమంత్రికి విద్యార్థుల తరపున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తమ సమస్యలను స్వయంగా తెలుసుకుని స్పందించినందుకు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణిశ్రీనివాస్, కౌన్సిలర్ సాయి కిరణ్, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జయరాజ్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాచ్ ది రైన్, డ్రై డే అవగాహన ర్యాలీ




మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

ప్రజాపక్షం/కోరుట్ల : పట్టణ ప్రజలలో నీటి పొదుపు, పరిశుభ్రతపై చైతన్యం తెచ్చేందుకు కోరుట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించ్చారు. కేంద్ర ప్రభుత్వ జల శక్తి అభియాన్ 3.0లో భాగంగా క్యాచ్ ద్ది రైన్ (వాన నీటిని ఒడిసి పట్టుకుందాం)దోమల నివారణే ధ్యేయంగా ప్రతిరోజు డ్రై డే కార్యక్రమాలపై పట్టణంలో ఈ ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీలో కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత, మున్సిపల్ కమిషనర్ వి.రాఘవేంద్ర, వైస్ చైర్‌పర్సన్ మహమ్మద్ షాహెద్ ఉల్ అహద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు పట్టణ పలు వార్డ్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక పట్టణ ప్రముఖులు, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ ర్యాలీని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ముఖ్య వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో పరిశుభ్రత, జల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత కమిషనర్ వి. రాఘవేంద్ర మాట్లాడుతూ వర్షపు నీటిని వృధా చేయకుండా భూగర్భ జలాలను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రతి ఇంట్లోనూ తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని వారు కోరారు ముఖ్యంగా నూతనంగా నిర్మించుకునే భవనాలకు తప్పనిసరిగా ఇంకుడు గుంతల్లు ఏర్పాటు చేస్తుకోవాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ప్రతిరోజు డ్రై డే పాటిస్తూ, దోమల ఉత్పత్తిని అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, డి.ఈ, ఆర్.ఓ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, అకౌంటెంట్ ఆఫీసర్లు, వార్డ్ ఆఫీసర్లు, జడ్.పి. హెచ్.ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నీ, ప్రొస్టేట్ వ్యాధులపై అత్యాధునిక రోబోటిక్ సేవలు

డా.కౌశిక్ అమన్చర్ల



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : ప్రొస్టేట్, కిడ్నీ వైఫల్యానికి సకాలంలో చికిత్స చేయడం వల్ల దీర్ఘకాలీక ఆరోగ్య ఫలితాలు బాగుంటాయని హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ యూరో ఆంకాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా.కౌశిక్ అమన్చర్ల తెలిపారు. కరీంనగర్ యశోద ఆసుపత్రి మెడికల్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యాధునిక యూరాలజీ వైద్య సేవలు ప్రపంచస్థాయి రోబోటిక్ సర్జరీ నిపుణుల సేవలను మరింత సౌలభ్యంగా పొందడానికి యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ ప్రత్యేక కన్సల్టేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. కిడ్నీ, ప్రొస్టేట్, మూత్రాశయం, మూత్ర నాళాలకు సంబంధించిన సంక్లిష్ట వ్యాధులకు చికిత్స కోసం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్ నుంచి నిపుణుల సలహాలు, పూర్తి పరీక్షలు, ఆధునిక చికిత్సా విధానాల గురించి తెలుసుకొని తదుపరి సంప్రదింతులను సులభంగా కొనసాగించవచ్చని పేర్కోన్నారు. రోబోటిక్ టెక్నాలజీ యురాలజీ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వివరించారు. రోబోటిక్ పార్షియల్ నెఫ్రెక్టమీ ద్వారా కిడ్నీలోని క్యాన్సర్‌ను పూర్తిగా తొలగించి ఆరోగ్యకరమైన భాగాన్ని కాపాడవచ్చని, దీర్ఘకాలంలో కిడ్నీ పనితీరు మెరుగ్గా ఉంటుందని తెలిపారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ గురించి మాట్లాడుతూ ప్రతి మార్పిడికి సూక్ష్మమైన ప్రణాళిక అవసరమని యశోద హాస్పిటల్స్ బృందం 81, 71 సంవత్సరాల వయస్సు గల జీవించి ఉన్న దాతల నుంచి విజయవంతంగా కిడ్నీ మార్పిడీలు చేసిందని తెలిపారు. జాగ్రత్తగా ఎంపిక చేసిన వృద్ధ దాతలు కూడా సురక్షింతంగా దానం చేయవచ్చని తుది దశ కిడ్నీ వ్యాధి ఉన్న రోగులకు కొత్త జీవితాన్ని ఇవ్వవచ్చని నిరూపించామన్నారు. మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ పద్ధతులతో శస్త్ర చికిత్స అనంతరం నొప్పి తగ్గడం, రక్త స్రావం తక్కువగా ఉండడం, ఆసుపత్రిలో ఉండాల్సిన సమయం తగ్గడం రోగులు త్వర గా సాధారణ జీవితంలోకి వెళ్లడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. యూరాలజీ వ్యాధులను ముందుగానే గుర్తించడం పై అవగాహనకై ప్రతి వారం సంప్రదింపులకై అందుబాటులో ఉంటామని డా.కౌశిక్ పేర్కోన్నారు. ఈ సమావేశంలో జి.సుధీర్ రెడ్డి, సీనియర్ మేనేజర్, కార్పోరేట్ రిలేషన్స్, యశోద హాస్పిట, కరీంనగర్ ఎగ్జిక్యూటీవ్ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు తరగతి గదుల నిర్మాణాల పూర్తి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రామగుండం ప్రాంతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కొనసాగుతున్న అటవీ–రెవెన్యూకు సంబంధించిన సర్వేను పరిశీలించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను తనిఖీ చేసి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులు అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నుంచి పనుల అమలు వరకు ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ సమీపంలో కొనసాగుతున్న అటవీ–రెవెన్యూ సరిహద్దు సర్వేను పరిశీలించిన కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని ఆదేశించారు. సంబంధిత రికార్డుల ఆధారంగా పారదర్శకంగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో డీఈ (పంచాయతీ రాజ్) నాయుడు, ఏఈ (పంచాయతీరాజ్) రాజ్‌కుమార్, పెద్దపల్లి అటవీ పరిధి అధికారి (ఎఫ్ఆర్ఓ) టి.సతీష్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రదీప్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డుపై గుంతలు పూడ్చండి సారూ!



ప్రజాపక్షం/కరీంనగర్ : నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులలో డాక్టర్స్ స్ట్రీట్ రోడ్డు ఒకటి. ఆ రహదారి లోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఎదురుగా అడుగుకో గుంత అన్నట్లుగా రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో అటుగా వెళ్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ లోని మెజారిటీ ఆసుపత్రులన్నీ ఆ స్ట్రీట్ లోనే ఉండటంతో నిత్యం కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పాటు మంచిర్యాల జిల్లా నుంచి పేషెంట్లుతో పాటు అంబులెన్స్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. మంచిర్యాల చౌరస్తా నుంచి ఫారెస్టు ఆఫీసు వరకు ఉండే ఆ రోడ్డులో ప్రధానంగా జిల్లా ఆసుపత్రి ఎదురుగా రోడ్డు మొత్తం తారు లేచి గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వర్షం కురిసిన రోజు నీరు గుంతల్లో చేరి ట్రాఫిక్‌కు మరింత ఇబ్బందిగా మారుతుంది. పేరుకే స్మార్ట్ సిటీ.. ప్రధాన రోడ్ల పరిస్థితి ఇలా ఉండటమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలు పూడ్చి రోడ్డు బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



## తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డికి నాయకుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో 'భరోసా యాత్ర' పేరుతో మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా ఓసిపి 5 కి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రంలో తెలంగాణలో ఉన్న బొగ్గు గనులను వేలం పాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని, 12వ వేజ్ బోర్డు ఒప్పంద ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లతో సంబంధం లేకుండా గతంలో వలే 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణికి తాడిచర్ల బ్లాక్ 2ను కేటాయించినందుకు కేంద్రమంత్రికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వినతి పత్రం అందజేసి, కేంద్రమంత్రికి డిమాండ్‌లను వెల్లడించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శిమడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీనులు ఉన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్ బాబు, ఎస్.వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్,కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి : రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ ఐడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు శనిగరపు తిరుమల, జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల రమాదేవిలు డిమాండ్ చేశారు. విద్యాహక్కు వ్యాపారం కాదు అని మేము ఎన్ఎఫ్ఐడబ్ల్యుగా స్పష్టం చేస్తున్నాం. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు, ఏఐఎస్ఎఫ్ జూలై 14న చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్య బద్ధంగా శాంతియుతంగా జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి, పోలీసులు అక్రమంగా, ముందస్తుగా ఏఐఎస్ఎఫ్ నాయకులు కామ్రేడ్ రేణికుంట్ల ప్రీతం, సాగర్, సురేష్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఎన్ఎఫ్ఐడబ్ల్యు తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

## బుర్ర లేనిది సిఎంకు కాదు.. కెటిఆర్‌కే!

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

ప్రజాపక్షం/కరీంనగర్: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతలు కరువును కాళేశ్వరంతో ముడిపెడుతున్నారని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోమవారం చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సీఎంకు బుర్రలేదనడం సరికాదని, అసలు బుర్ర లేనిది కేటీఆర్‌కేనని విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆయన వరుస వైఫల్యాలే ఇందుకు నిదర్శనమన్నారు. కాళేశ్వరాన్ని బాగు చేసేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు మూడు నెలల పాటు మంత్రి పదవి అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలోనే ప్రాజెక్టు కుంగిపోయిందని, అడుగు బొడుగు పెండింగ్ వసూళ్ల కోసమే మళ్లీ పదవి కావాలని కోరుతున్నారని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే ఎంతో ప్రయోజనం ఉండేదని, పంతాలు, అక్రమార్జన కోసమే గోదావరిపై ప్రాజెక్టు కట్టారని ఆరోపించారు. నిర్మించిన మూడేళ్లకే మూడు బ్యారేజీలు ఎందుకు గ్యారేజీలుగా మారాయో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, ఎల్ఎండీ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని, వైఎస్సార్ నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు లైఫ్‌లైన్‌గా మారిందని ఆయన గుర్తుచేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోస్తే పెను ప్రమాదం పొంచి ఉందని ఇంజనీరింగ్ నిపుణులు, ఎన్‌డీఎస్ఏ హెచ్చరించినందునే ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కరీంనగర్ మార్కెట్ చైర్మన్ ఆకుల నర్సయ్య, కార్పొరేటర్లు పడాల అజయ్ గౌడ్, చెల్లోజు రాజు, అజయ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంపి రఘురాంరెడ్డి పర్యటన



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం మండలంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి బుధవారం పర్యటించనున్నారని, ఈ పర్యటనను విజయవతం చేయాలని మండల కాంగ్రెస్ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండలంలో వివిధ గ్రామాల్లో సిసి రోడ్లు ,వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవానికి పర్యటించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, సర్పంచ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## టిజి 20 రన్నర్స్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తెలంగాణలో యువ క్రికెటర్ల నైపుణ్యాల ప్రదర్శనకు వేదికగా నిలిచిన టిజి 20 క్రీడల్లో రన్నర్స్‌గా నిలిచిన అన్విత ఖమ్మం ఎసెస్ జట్టును ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. చైర్మన్ గుండాల కృష్ణ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నందిని విక్రమార్క ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను సత్కరించి అభినందనలు తెలిపారు. తొలి సీజన్‌లోనే టోర్నీ ఆరంభం నుండి అద్భుత ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరుకున్నారని రానున్న సీజన్‌లో తప్పకుండా విజయం సాధించి ఖమ్మం కీర్తిని చాటుతారని గుండాల కృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. జట్టులోని సభ్యులంతా తమ వంతు పాత్ర పోషించి రన్నర్స్‌గా నిలవడంలో కృషి చేశారని నందిని విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జట్టు హెడ్ కోచ్ అభిజిత్ ఛటర్జీ, టీమ్ మెంబర్ హరిమోహన్, జట్టు ఫ్రాంఛైజ్ ఓనర్ గోపన్న అచ్యుతరావు, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌ఒడిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణపై అవగాహన




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వర్షపు నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన క్యాచ్ ది రైన్ సేవ్ ఎవరీ డ్రాప్ అనే కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాకర్స్, స్థానిక ప్రజలకు వర్షపు నీటి సంరక్షణ అవసరం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం నగర పాలక సంస్థ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టండి, ప్రతి ఇంటిలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ ఏర్పాటు చేద్దాం, చిన్న పిట్ పెద్ద మార్పు, నీటిని కాపాడితే జీవితాన్ని కాపాడినట్టే' వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ప్రతి ఇంటిలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ ఏర్పాటు చేయడం ద్వారా భూ గర్భ జలాల మట్టం పెరుగుతుందని నీటి కొరతను నివారించవచ్చునని, పట్టణాలలో నీరు నిలిచే సమస్యలను తగ్గించవచ్చునని అధికారులు తెలిపారు. భావి తరాల కోసం నీటి వనరులను సంరక్షించడం ప్రతి పౌరుని బాధ్యత అని అధికారులు తెలిపారు. అనంతరం నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ప్రసాద్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు పిపిఇ కిట్లు పంపిణీ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : 'నమస్తే డే' సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి పిపిఇ కిట్లు, రూ. 5లక్షల నమస్తే బీమా కార్డులను అందజేశారు. మంగళవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెస్ట్ పికర్స్, సీవర్ క్లీనింగ్ , సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లకు పిపిఇ కిటు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా పిపిఇ కిట్లను వినియోగిస్తూ వ్యక్తిగత భద్రత, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండా ప్రమాద పనులు చేయరాదన్నారు. సీవర్, సెప్టిక్ ట్యాం కులు శుభ్రపరిచే పనుల్లో క్లీనింగ్ విధానాన్ని, కార్మికులకు భద్రతా ప్రమాణాలపై నిరంతరం శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నమస్తే డే సందర్భంగా కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న భద్రతా చర్యల్లో భాగంగా పిపిఇ కిట్లు పంపిణీ చేయడంతో పాటు రూ. 5లక్షల నమస్తే బీమా పథకం కార్డులను అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ప్రజాపక్షం/అశ్వాపురం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి త్వరలో జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశంలో నేపథ్యంలో ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని బీజీ కొత్తూరులో హెలీప్యాడ్ పనులు, అమ్మగారిపల్లిలో సమీక్షా సమావేశ ప్రాంగణాన్ని పరిశీలించి భద్రత, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశిల్దార్ సూర్యప్రకాష్, నీటిపారుదల, ఆర్అండ్‌బి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హరిత భవన్‌తో ఖమ్మానికి కొత్త శోభ

రూ. 40 కోట్లతో నిర్మాణం
మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ
నిధుల మంజూరుకు మంత్రి జూపల్లికి లేఖ





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం పర్యాటక రంగంలో కొత్త శోభ సంతరించుకోనుంది. రాష్ట్ర పర్యాటక పటంలో ఖమ్మం జిల్లాను మరింత ప్రముఖంగా నిలిపేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో హరిత భవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. హరిత భవన్ నిర్మాణంతో పర్యాటక అతిథ్య మౌలిక సదుపాయాల కొరత తీరుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని లకారం పార్కు సమీపంలో నిర్మించనున్న హరిత భవన్ ప్రాజెక్టు పై మంగళవారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖాధికారులు లకారం పార్కు పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఆధునిక హోటల్ ప్రణాళికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమగ్రంగా వివరించారు. ప్రతిపాదిత నిర్మాణానికి తొలుత హరిత హోటల్ అని పేరు పెట్టగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిభింభించేలా దీనిని హరిత భవన్‌గా మార్చాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ. 40 కోట్ల నిధులు అవసరమని మంత్రికి వివరించారు. సంబంధిత ప్రాతిపదనలు వెంటనే రూపొందించాలని అవి అందిన వెంటనే పరిపాలన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయిస్తామని మంత్రి తెలిపారు. ఈప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యాటక సూపరింటెండెంట్ ఇంజనీర్ సరిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, కన్సల్టెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి జూపల్లికి మంత్రి తుమ్మల లేఖ..

హరిత భవన్ నిర్మాణానికి సంబంధించి రూ. 40 కోట్ల నిధులను సత్వరమే మంజూరు చేయాలని సంబంధిత శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ ద్వారా కోరారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నియమించిన కన్సల్టెంట్ ఈ ప్రాజెక్టుకు తాత్కాలిక అంచనా వ్యయాన్ని రూ. 40 కోట్లుగా సమర్పించారని, ఇప్పటికే జిల్లా యంత్రాంగం హరిత భవన్ ఏర్పాటు కోసం ఐదు ఎకరాల భూమిని గుర్తించి కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. జిల్లాకు వచ్చే పర్యాటకులు, భక్తులు, వాణిజ్య సందర్శకులు, అధికారులకు ఈ భవన్ నాణ్యమైన వసతి కల్పించడంతో పాటు సదస్సులు, సమావేశాలు తదితర కార్యక్రమాలకు అత్యుత్తమ వేదికగా ఉపయోగపడుతుందని లేఖలో మంత్రి వివరించారు. జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని, టెండర్ల ప్రక్రియను చేపట్టి వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి తుమ్మల కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లా పర్యాటక గుమ్మంగా వెలుగొందుతుందని అధికారులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లకు నియామక పత్రాలు



ప్రజాపక్షం/వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలను వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నాయకత్వంలో విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను చిన్న వయస్సు నుంచే అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం ద్వారా చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు వారి మానసిక, సామాజిక, భావోద్వేగ, శారీరక వికాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, తేలూరి వీరయ్య, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. మంగళవారం నగరంలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతి దశను ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఫారాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి వివరాలు నమోదు చేసి యాప్‌లో డిజిటలైజేషన్ సమయంలో కూడా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 49వ డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణం, 51, 35, 34 వ డివిజన్‌లలో డ్రైనేజీ, రోడ్డును కమిషనర్ పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని డ్రైనేజీలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా




ప్రజాపక్షం/సత్తుపలి: తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేష్ రావుకు కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న మెస్‌చార్జీలు సరిపోక మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. నిత్యావసర సరుకులు, వంటగ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేల వేతన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులను, కార్మికులుగా అధికారికంగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా తదితర సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సత్తుపల్లి మండల ప్రధాన కార్యదర్శి తెలగారపు రామారావు, తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రహీమున్నీసా, సత్తుపల్లి మండల అధ్యక్షురాలు కుంట వెంకమ్మ, ప్రధాన కార్యదర్శి మహాదేవ లక్ష్మి, పూచి సీత, వసంత శ్రీలక్ష్మి , మంగమ్మ, నరసమ్మ, రాజ్యలక్ష్మి , జీవ, కనకదుర్గ, కృష్ణవేణి, వెంకటరమణ, నసీమా తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలు చేసే ఛానళ్లపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : తప్పుడు ప్రచారాలు చేసే వార్తా ఛానళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఒక ఛానల్‌లో వచ్చిన వార్తలపై ఆయన మంగళవారం జిల్లా కేంద్రంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ గత నాలుగున్నర దశాబ్దాలుగా ఎలాంటి మచ్చ లేకుండా ప్రజల పక్షాన నిలబడి నిరంతరం శ్రమిస్తున్న నిజాయితీ గల నాయకుడు కూనంనేని అని కొనియాడారు. నిరాధారమైన ఆరోపణలతో ఇలాంటి తప్పుడు వార్తలను ప్రసారం చేయడం తగదని, కూనంనేని వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం శోచనీయం అన్నారు. మీనాక్షీ నాటరాజన్‌కు తానేమి ఫిర్యాదు చేయలేదని ఎంపి రఘురామిరెడ్డి స్వయంగా ప్రకటించారని, ఛానళ్లలో తప్పుడు వార్తలు రావడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగుందని మండిపడ్డారు. ఇప్పటికైనా మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

## యుద్ధ ప్రాతిపదికన నీటి సంరక్షణ చర్యలు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ల ఏర్పాటుతో పాటు నీటి సంరక్షణ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. భూ గర్భ జలాల పెంపు, పంటల వైవిధ్యీకరణ, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేలా అధికారులు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా।। పి. శ్రీజతో కలిసి వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ఫామ్ పాండ్లు, నీటి సంరక్షణ, పంటల సాగు విధానాలపై కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జులై నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుండడంతో భూ గర్భ జలాల మట్టం తగ్గుముఖం పడుతుందని, భూ గర్భ జలాలను పెంచేందుకు దోహదపడే ప్రతి కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, ఆత్మ పిడి సరిత, ఉద్యాన వన అధికారిణి అనిత, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు, ఏఈవోలు, ఉద్యాన వన క్లస్టర్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలు చేయాలి

టియుడబ్ల్యుజె (ఐజెయు) పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి



ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ తప్పనిసరిగా అమలు చేయాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) పినపాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు జేవి రత్నం ఆదేశాల మేరకు టియుడబ్ల్యుజె (ఐజెయు) ప్రతినిధులు మండల విద్యాశాఖ అధికారి యెదు సింహారాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలుకావాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ఫీజు రాయితీ అందేలా విద్యాశాఖ పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. వినతిపై స్పందించిన మండల విద్యాశాఖ అధికారి యెదు సింహరాజు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసేందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. త్వరలోనే మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దొంకన చంద్రశేఖర్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ మెంబర్ నరసింహారెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శివకుమార్, ఎలక్ట్రానిక్ మీడియా ఇసి సభ్యులు రవి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, డి శ్రీనివాస్, కోట రమేష్, రాంబాబు, శ్రీనివాస్, సుధాకర్, ముజఫర్, కేసుపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలు వేగవంతం

కలెక్టర్ అంకిత్ ఆదేశం



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ మండలంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పర్యటించారు. ఈ పర్యటనలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సర్వే, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. తిప్పనపల్లిలో భూసేకరణ సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మద్దుకూరులో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను ఎన్నికల సంఘం గడువులోగా పూర్తి చేసి, ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించాలని సూచించారు. చంద్రుగొండ జెడ్‌పిహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఒ మధు, తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపిడిఒ అశోక్, ఇరిగేషన్ సర్వే శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియ బాధ్యతగా చేపట్టాలి

సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కంచర్ల



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యత కలిగిందని, ప్రతీ ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంచర్ల జమలయ్య అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో సిపిఐ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని బస్తీల్లో మగంళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన వారందరితో ఎస్ఐఆర్ ఫారాలను పూర్తి చేయించాల్సిన బాధ్యత ప్రతొక్కరిపై ఉందన్నారు. ప్రజా స్వామ్యంలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని అందుకే ఈ సవరణ ప్రక్రియను ఒక బాధ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయులు ఎండి యూసుఫ్, విజయ్‌కుమార్, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, దుర్గయ్య, ధనలక్ష్మి , పండాల ఆకాంక్ష, ఎం. హరిత, శ్రీనివాస్, ఎర్రబెల్లి శంకర్, మునిగడప పద్మ, కంచర్ల హిమశ్రీ, పి.సత్యనారాయణచారి పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చట్ట రీత్యా నేరం

జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ర్యాగింగ్ చట్ట రీత్యా నేరమని దానికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస తెలిపారు. మంగళవారం ఖమ్మం నూతన బస్టాండ్ సమీపంలోని డా।। బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ ఎస్ఆర్‌జెసి (బాలికల) కళాశాలలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి పి. దేవి మానస మాట్లాడుతూ ర్యాగింగ్ చట్ట రీత్యా నేరమని దానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని ఆమె తెలిపారు. విద్యార్థినిలు ఎటువంటి వేధింపులకు గురైన వెంటనే కళాశాల యాజమాన్యానికి యాంటీ ర్యాగింగ్ కమిటీకి లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు, విద్యా సంస్థల్లో సురక్షితమైన స్నేహ పూర్వకమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. యువతలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యా నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టిసారించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## వర్షాల కోసం బొడ్రాయికి జలాభిషేకం



ప్రజాపక్షం/రఘునాథపాలెం : వాన దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామస్తులు బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నాయి. రైతులు వాన దేవుడు కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో రైతులు, గ్రామస్తులు బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించి వరుణ దేవుడిని మొక్కుకున్నారు. గతంలోనూ ఇలా చేస్తే వర్షాలు వచ్చాయని రైతులు, గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కొత్త తేదీ ప్రకటించాలి

**• మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్ వ్యవహారంలో రాహుల్ డిమాండ్ • లీకేజీ బాధ్యతలపై వెంటనే చర్యలు తీసుకోవాలి • నష్టపోయిన అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపివ్వాలి**



**న్యూఢిల్లీ/ఇండోర్ :** భారత విద్యారంగంలో అనేక లోపాలు బయటపడుతున్నాయి. నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవకలు జరుగుతుండగా, రాష్ట్రాల్లోనూ జరిగే పరీక్ష కూడా పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో టెట్ పరీక్షకు ఒక రోజు ముందే పేపర్ లీక్ అయింది. దీంతో పరీక్షను రద్దు చేశారు. కాగా పరీక్షకు మరో కొత్త తేదీని ప్రకటించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ పరిస్థితి వల్ల నష్టపోయిన అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. థానే జిల్లాలో ప్రశ్నపత్రంలోని కొంత భాగం లీక్ అయినట్లు పోలీసులు గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసిన తర్వాత, జూన్ 28న జరగాల్సిన టెట్ పరీక్షను ఒక రోజు ముందుగానే వాయిదా వేశారు. ఆ తర్వాత మహారాష్ట్ర పోలీసులు మరికొందరు అనుమానితులను అరెస్టు చేయడంతో, మొత్తం అరెస్టుల సంఖ్య పదికి చేరింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర టెట్ ప్రశ్నపత్రం లీక్ కావడంతో పరీక్ష రద్దయిందని, ఆరు లక్షల మంది అభ్యర్థులు అనిశ్చితిలో పడ్డారని రాహుల్‌గాంధీ మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. రెండు వారాలు గడిచినా, కొత్త తేదీ గురించి ఎటువంటి సమాచారం లేదని మండిపడ్డారు. లీక్‌కు బాధ్యులైన వారు ఇంకా పట్టుబడకుండా తిరుగుతుండగా, అభ్యర్థులు మాత్రం పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'కష్టపడి, నిజాయితీగా పనిచేసిన వారే మన దేశ ప్రస్తుత, భవిష్యత్తు ఉపాధ్యాయులు— భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దే వారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి సన్నద్ధమై, దరఖాస్తులు నింపి, ఫీజులు చెల్లించి, మారుమూల ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లినప్పటికీ, ఎటువంటి సమాచారం లేకుండా వేచి చూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమమన్నారు. 'ముఖ్యమంత్రి గారూ (దేవేంద్ర ఫడ్నవీస్) నేడు మూడు విషయాలు అవసరం: 1. కాలక్రమం: కొత్త టెట్ తేదీని వెంటనే ప్రకటించండి. 2. బాధ్యత: లీక్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి, అభ్యర్థులపై కాదు. 3. భవిష్యత్తు పరిరక్షణ: ఈ లీక్ కారణంగా ఒక సంవత్సరం వృథా అయిన వారికి వయోపరిమితిలో సడలింపు ఇవ్వండి' అని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వ్యవస్థ వైఫల్యం వల్ల కలిగే భారాన్ని అభ్యర్థులు మోయాల్సి రావడం అన్యాయమన్నారు. విద్యా విప్లవానికి సమయం ఆసన్నమైందని, వ్యవస్థాగత వైఫల్యాల పర్యవసానాలను అనుభవించడం కాకుండా, యువత తమ కష్టానికి తగిన ఫలితాలను పొందే వ్యవస్థను నిర్మించాలని గాంధీ అన్నారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్ వ్యవహారానికి సూత్రధారులుగా అనుమానిస్తున్న బిజేంద్ర కుమార్ గుప్తా, సోనుకుమార్ కిషన్‌లాల్‌లను పట్టుకునేందుకు, ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రస్తుతం ఆర్థిక, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తోందని ఒక అధికారి తెలిపారు.

**నీట్ యుజి పేపర్ లీక్ నిరసనగా సైకిల్ ర్యాలీ**

నీట్ యుజి పరీక్షా పత్రం లీక్ వ్యవహారంలో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార బిజెపిని లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడింది. ఈ అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నీట్ యుజి పరీక్షలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా ఇండోర్ నుండి భోపాల్ వరకు చేపట్టిన 'యువ స్వాభిమాన్: జెన్ – జి' సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ ప్రసంగిస్తూ ప్రవేశ, నియామక పరీక్షలలో పదేపదే జరుగుతున్న అవకతవకలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయన్నారు. మే నెలలో జరిగిన నీట్ యుజి పరీక్ష రద్దు కారణంగా దేశంలో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన ఆరోపించారు. పరీక్షలో జరిగిన అవకతవకలకు ప్రధాన్ నైతిక బాధ్యత వహించి, తన పదవికి రాజీనామా చేయాలని ఆయన పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో బిజెపి రెండున్నర దశాబ్దాల పాలనలో ప్రభుత్వ నియామక పరీక్షలలో భారీగా అక్రమాలు, అవినీతి జరిగాయని పట్వారీ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇండోర్ నుండి ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ మంగళవారం రాత్రి అష్టాకు చేరుకుంది. బుధవారం అష్టా నుండి భోపాల్‌కు కొనసాగుతుంది.



# ప్రజల బాధలపై మోదీ ఎప్పుడు మాట్లాడుతారు?

**12 ఏళ్ల బిజెపి సర్కార్ హయాంలో సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను దెబ్బతీసింది : కాంగ్రెస్**



**న్యూఢిల్లీ:** జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి పెరిగిన నేపథ్యంలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. గత 12 ఏళ్ల బిజెపి ప్రభుత్వ హయాంలో ధరల పెరుగుదల సామాన్య కుటుంబాల బడ్జెట్‌లను దెబ్బతీసిందని మండిపడింది. సామాన్య ప్రజల బాధల గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడు మాట్లాడతారని ప్రశ్నించింది. సోమవారం విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా ఉన్న వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 4.38 శాతానికి పెరిగింది. ఆహార వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా అధికారులు పేర్కొన్నారు. జనవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త శ్రేణి ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం రిజర్వు బ్యాంకు 4 శాతం మార్కును దాటడం ఇదే తొలిసారి. ఈ కొత్త శ్రేణికి 2024నే ప్రాతిపదిక సంవత్సరంగా నిర్ణయించారు. బిజెపి ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో తప్పుడు హామీలు మాత్రమే పెరిగాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. మరోవైపు మాత్రం ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రూపంలో ప్రజలపై తీవ్ర భారం పడిందని విమర్శించారు. ప్రభుత్వ గణాంకాలే జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు చూపిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.74 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు బ్యాంకు వడ్డీ రేట్లు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు. అలాంటి పరిస్థితి వస్తే గృహ, వాహన రుణాల ఈఎంఐలు మరింత పెరిగి మధ్యతరగతిపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద పారిశ్రామిక వర్గాల లాభాలు పెరుగుతుంటే, ధరల భారం మాత్రం సామాన్య ప్రజలే భరిస్తున్నారని జైరామ్ రమేశ్ ఆరోపించారు. పెట్టుబడిదారులకు అండగా నిలుస్తున్న ప్రధాని మోదీ, సాధారణ ప్రజల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారు అని ప్రశ్నించారు. కాగా, మేలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం జూన్‌లో 5.32 శాతానికి చేరింది. వెండి, బంగారం, వజ్రాలు, ప్లాటినం ఆభరణాలు, అల్లం, టమాటా, కిస్మిస్ వంటి వస్తువుల ధరలు అధికంగా పెరిగిన వాటిలో ఉన్నాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, కార్లు, జీలకర్ర, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ వెల్లడించింది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా నమోదుకాగా, గ్రామీణ ప్రాంతాల్లో అది 4.74 శాతం, పట్టణ ప్రాంతాల్లో 3.92 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాలపై ధరల పెరుగుదల ప్రభావం మరింత ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

# జూన్‌లో 9.87 శాతానికి పెరిగిన ద్రవ్యోల్బణం



**న్యూఢిల్లీ :** ఆహార, ఆహారేతర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో, టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యుపిఐ) మే నెలలో 9.68 శాతం ఉండగా, జూన్‌లో 9.87 శాతానికి పెరిగింది. ఈ భారీ పెరుగుదల పశ్చిమాసియా సంక్షోభం, భారత్‌కు ముడి చమురు దిగుమతిలో కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన దిగ్బంధం, దాని ప్రభావం వల్ల ఆహార ధరలపై పడిన ఒత్తిడిని ప్రతిబింబిస్తోంది. 'ఖనిజ నూనెలు (పెట్రోలియం ఉత్పత్తులతో సహా), ఆహార పదార్థాలు, ప్రాథమిక లోహాల తయారీ, రసాయనాలు, రసాయన ఉత్పత్తుల తయారీ రంగాలు జూన్‌లో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) గణాంకాలను విడుదల చేస్తూ పేర్కొంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇంధనం, విద్యుత్ రంగంలో టోకు ద్రవ్యోల్బణం మే నెలలోని 30.33 శాతం నుండి జూన్ నెలలో 27.41 శాతానికి మారింది. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం మే నెలలోని 3.60 శాతం నుండి జూన్ నెలలో 5.49 శాతానికి పెరిగింది. జూన్ నెలలో ఆహారేతర వస్తువుల డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం 11.07 శాతంగా, ఖనిజాల విషయంలో 9.45 శాతంగా నమోదైంది. తయారీ ఉత్పత్తుల విషయంలో ద్రవ్యోల్బణం మే నెల మాదిరిగానే 7.48 శాతం వద్ద స్థిరంగా ఉంది. రిటైల్ లేదా వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం కూడా పెరిగింది. ఇది అంతకుముందు నెలలో ఉన్న 3.93 శాతం నుండి జూన్ నెలలో 4.38 శాతానికి చేరి, గత 17 నెలల గరిష్ట స్థాయిని తాకింది. ద్రవ్య విధానాన్ని రూపొందించేటప్పుడు ప్రధానంగా సిపిఐని పరిగణనలోకి తీసుకునే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రధాన ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద (ఇరువైపులా 2 శాతం మార్జిన్‌తో) ఉంచేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అంతర్జాతీయ ఇంధన ధరల పెరుగుదల ప్రభావం రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలపై పడటం వల్ల పెరిగిన 'ఇన్‌పుట్ ఖర్చుల' (ఉత్పత్తి వ్యయాలు) కారణంగా, గత నెలలో ఆర్‌బిఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తన ద్రవ్యోల్బణ అంచనాను 4.6 శాతం నుండి 5.1 శాతానికి పెంచింది.

ఫారం-6

[చట్టం - 30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ -1 రూల్ 19 ప్రకారం]

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

**కలెక్టర్, వరంగల్ వారి ప్రాథమిక ప్రకటన (preliminary notification)**

**Gazette No. 44/WGL/2026, Date: 11.07.2026**

**ఫైల్ నెం. G/1736/2026** **తేది: 11-07-2026**

**ఫైల్ నెం. A/493/2017** **తేది: 17-06-2026**

కార్యనిర్వాహక ఇంజినీర్ జె చొక్కారావు దేవాదుల లిఫ్ట ఇరిగేషన్ స్కీం ములుగు డివిజన్ నెం. 4 గారి రిక్విజిషన్ ప్రకారం ఈ దిగువ నిర్దిష్టపరిచిన వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలం, మహ్మదాపురం గ్రామములో ఉన్న భూమి విస్తర్ణం [**1.10**] **ఎకరములు** ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా రంగయ్య మరియు ఎర్రయ్య చెరువు 13 R-డిస్ట్రిబ్యూటరి ప్రధాన ఎడమ కాల్వ కి.మీ.0.000 నుండి 0.250 (TE) వరకు త్రవ్వకము నిమిత్తం. ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున, భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టము - 2013 లోని సెక్షన్ 11 [1] అనుసరించిప్రకటన జారీ చేయనైనది.

భూసేకరణలోని సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం 2013 [నెం.30/2013] లోని 10 [A] అనుసరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము GO NO 63 నీటిపారుదల మరియు వాణిజ్య ప్రాంత అభివృద్ధి శక Dt:09.07.2017 అనుసరించి మినహాయించదగిన పరిదిలో ఉన్నందున చాప్టర్- 2. లోని సామాజిక ప్రభావం అధ్యాయన నివేదిక మరియు చాప్టర్- 3. లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, మహ్మదాపురం గ్రామములోని విస్తీర్ణం [**1.0850** ] **ఎకరములు** గల భూమి ఈ క్రింది చూపిన విధంగా భూసేకరణలో ఉన్నదని ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది

**షెడ్యూల్**

గ్రామము : మహ్మదాపురం మండలం: దుగ్గొండి జిల్లా: వరంగల్

(కి.మీ. 0.000 నుండి 0.250 (TE)]

| క్రమ సంఖ్య | సర్వే నం. | [illegible] | [illegible] | [illegible] | పట్టాదారు మరియు అనుభవదారు పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| మహ్మదాపురం గ్రామము దుగ్గొండి మండలము | | | | | | |
| 1 | **300** | Dry | పట్టా | 0.20 | పట్టాదారు: పొలదుగుల రమేష్ తండ్రి కొమురయ్య; ప్రస్తుతం మొఖాపై ఉన్న వారు: పొలదుగుల రమేష్ తండ్రి కొమురయ్య | లేవు |
| 2 | **312/1** | Dry | పట్టా | 0.09 | పట్టాదారు: మైదమ్ కమల భర్త చిన్న రవి; ప్రస్తుతం మొఖాపై ఉన్న వారు: మైదమ్ కమల భర్త చిన్న రవి | లేవు |
| 3 | **356/1** | Dry | పట్టా | 0.1350 | పట్టాదారు: కామ వేణు తండ్రి సాంబయ్య; ప్రస్తుతం మొఖాపై ఉన్న వారు: కామ వేణు తండ్రి సాంబయ్య | లేవు |
| 4 | | | ప్రభుత్వ భూమి | 0.06 | డొంక | లేవు |
| | | | మొత్తం : | 1.0850 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత పునరావస పునరశ్రయ హక్కు చట్టం 30 /2013 లోని నియమములోని సెక్షన్ 11 [1] ప్రకారం సంబంధిత భూయజమానులకు సరైన భూనష్ట పరిహారము చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, వరంగల్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సంపేట్ గారి కార్యాలయములో వుంచనైనది సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలో తనకి చేసుకోవచును జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భూసేకరణ అధికారి / రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సంపేట్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబందించి సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు భూమి కొలతలు తీసుకొనుటకు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 [4] ప్రకారం భూ సేకరణ ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, వరంగల్ గారి అనుమతి లేకుండ ప్రాథమిక ప్రకటన జారి చేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం తనఖి మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల చట్టములోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, వరంగల్ లేదా భూ సేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సంపేట్ గారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి వున్నది.

ఇట్టి ప్రకటన జారి చేసిన [60] దినముల లోపల ఏమైన అభ్యంతరములు వున్న యెడల వారు తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి వున్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి నర్సంపేట.
సం/- అదనపు కలెక్టర్[రెవెన్యూ] వరంగల్
సం/- జిల్లా కలెక్టర్ వరంగల్

DIPR RO NO. 484/LA/PP/Advt/Pub/2026-27

## వివాదాస్పద భోజ్‌శాల పక్కన ప్రార్థనల కోసం...

# ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి

**సుప్రీంకోర్టు ఆదేశం: ఇది తాత్కాలికమేనని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ :** వివాదాస్పద భోజ్‌శాల స్థలానికి ఆనుకుని ఉన్న ప్రదేశంలో శుక్రవారాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3గంటల మధ్య నమాజ్ చేసుకునేందుకు ముస్లింలకు బహిరంగ స్థలాన్ని కేటాయించాలని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్ల తుది ఫలితానికి లోబడి ముస్లింలకు సంబంధించిన ఈ ఏర్పాటు తాత్కాలికంగా ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అనుమతి లేకుండా ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణ మార్పులు చేపట్టరాదని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. భోజ్‌శాల ఒక సున్నితమైన విషయం కాబట్టి హిందువులు, ముస్లిం పక్షాలు ఓపిక పట్టాలని కోరుతూ, ఈ విషయాన్ని రోజువారీగా విచారించి సమస్యను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల సముదాయం సరస్వతీదేవికి అంకితం చేయబడిన ఆలయమని పేర్కొన్న మధ్యప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన పలు అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. ప్రతీ వ్యక్తీకరణ విషయంలోనూ చాలా జాగ్రత్తగా ఉండాలని కోర్టు చెప్పింది. ఇవి చాలా సున్నితమైన విషయాలు. సమావేశంలో చెప్పే మాటలు అనవసరంగా వివాదాలు సృష్టించవచ్చు లేదా తప్పుడు అభిప్రాయాన్ని కలిగించవచ్చు. మనం ఉపయోగించే ప్రతీ పదం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మధ్యంతర ఏర్పాటుకు సంబంధించిన అంశం మా ముందుకు రావడం ఇదే మొదటిసారి. హైకోర్టు ఉత్తర్వు, శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిస్సహాయతను కూడా గమనిస్తున్నాం. ప్రస్తుతం అమలులో ఉన్న ఏర్పాటు ఏదైనప్పటికీ, ఈ విషయాన్ని 10నుంచి 15 రోజుల్లోగా తగిన ధర్మాసనం ముందు విచారణకు పెట్టవచ్చని మా అభిప్రాయం' అని మౌఖికంగా తెలిపారు.సోమవారం ఉదయం ముస్లిం అప్పీల్‌దారుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మదీ, న్యాయవాది నిజాం పాషా, ఈ పిటిషన్లను అత్యవసర ప్రాతిపదికన విచారించాల్సిన అవసరం ఉందని ధర్మాసనాన్ని కోరారు. భారతప్రధాన న్యాయమూర్తి అప్పీల్‌దారుల తరపు న్యాయవాదిని పిటిషన్లలోని లోపాలను సరిదిద్దాలని కోరారు. వాటిని త్వరలో ధర్మాసనం ముందు విచారణకు జాబితా చేస్తామని సిజెఐ వారికి హామీ ఇచ్చారు. మే 15న భోజ్‌శాల–కమల్ మౌలా మసీద్ కాంప్లెక్ సరస్వతీదేవికి అంకితం చేయబడిన ఆలయమని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అదేసమయంలో, ఆ ప్రదేశంలో ముస్లిం సమాజం ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతించి, దశాబ్దాల నాటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఉత్తర్వును కూడా రద్దు చేసింది.

## బంకుల్లో ఇ20, ప్యూర్ పెట్రోల్ ఆప్షన్స్ ఇవ్వాలి

**ప్రధాని మోదీకి ఆప్ అధినేత కేజ్రీవాల్ లేఖ**




**న్యూఢిల్లీ :** ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై వ్యక్తమవుతున్న ఆందోళనపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం లేఖ రాశారు. ఒకవేళ మాట్లాడేందుకు అవకాశం ఇస్తే ఇ20 పెట్రోల్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలను, ప్రజల నుంచి తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను మోదీకి వివరిస్తానని పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల్లో ఇ20 పెట్రోల్‌తో పాటు, స్వచ్ఛమైన పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఇ20 పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంకుల్లో స్వచ్ఛమైన పెట్రోల్ లేదా ఇ20 పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకే ఉండాలని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. 'ఎవరికైనా స్వచ్ఛమైన పెట్రోల్ కావాలంటే వారికి ఆ ఆప్షన్ ఉండాలి. అలాగే ఇథనాల్ కలిపిన పెట్రోల్ కావాలంటే వారికి ఆ ఛాయిస్ కూడా ఉండాలి' అని అన్నారు. ఇ20 పెట్రోల్‌కు సంబంధించి ప్రజలతో మాట్లాడి, వారి ఆందోళనలను అర్థం చేసుకున్న తర్వాతే తాను ప్రధాని మోదీకి లేఖ రాశానని తెలిపారు. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే, ఇథనాల్ కలిపిన ఇంధనం (ఇ20) తక్కువ మైలేజీని ఇస్తుందని, అందువల్ల ఇ20 పెట్రోల్ ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు ఇ20 పెట్రోల్‌తో ఎదురవుతున్న అనుభవాలను స్వయంగా తెలియజేయడానికి తమ పార్టీ తరఫున ఒక ఆన్‌లైన్ పిటిషన్‌ను ప్రారంభించినట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీనిని ఉపయోగించుకొని మైలేజీ, ఇతర సమస్యలపై ప్రజలు తమ ఆందోళనలను పంచుకోవాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై పెద్ద సంఖ్యలో సంతకాలు చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలా సేకరించిన ప్రజా స్పందనలను తాను స్వయంగా ప్రధానికి సమర్పిస్తానని అన్నారు. ప్రధాని మోదీ తనకు త్వరలోనే అపాయింట్‌మెంట్ ఇస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఆప్ కార్యకర్తలు, ఇతరులు పెట్రోల్ బంకులు, సర్వీస్ స్టేషన్లకు నేరుగా వెళ్లి, వినియోగదారులతో మాట్లాడి, వారి అనుభవాలను వీడియోల రూపంలో సోషల్ మీడియాలో షేర్ చేయాలని కేజ్రీవాల్ కోరారు.

## నిషేధిత సిపిఐ (మావోయిస్టు)కు నిధుల సేకరణ కేసులో ఎన్ఐఎ మరో చార్జిషీట్

**న్యూఢిల్లీ:** నిషేధిత సిపిఐ (మావోయిస్టు) సంస్థకు నిధులు సమీకరించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మరో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో చందన్ కుమార్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ జర్ఖండ్‌లోని రాంచీ ప్రత్యేక న్యాయస్థానంలో మూడో చార్జిషీట్‌ను సమర్పించినట్లు నియా అధికారులు తెలిపారు. 2021 డిసెంబర్‌లో ఎన్ఐఎ స్వయంగా నమోదు చేసిన ఈ కేసు దర్యాప్తులో, చందన్ కుమార్ నిషేధిత సిపిఐ (మావోయిస్టు) కోసం చురుకుగా నిధులు సేకరించినట్లు తేలిందని వెల్లడించింది. ఈ కేసులో అతడిని 2026 జనవరిలో ముంబైలో అరెస్టు చేసినట్లు తెలిపింది.

## ఎపి, హర్యానాలో 'సర్' గడువు పొడిగింపు



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, హర్యానాలలో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర ప్రక్రియ (సర్)కు సంబంధించిన వివిధ కార్యకలాపాల గడువును ఎన్నికల సంఘం మంగళవారం పొడిగించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు వేర్వేరుగా లేఖలు రాసింది. హర్యానా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చేసే పరిశీలన ప్రక్రియ జులై 14 వరకు ఉండగా, ఇప్పుడు దానిని 24 వరకు పొడిగించారు. ఈ రెండు రాష్ట్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాలను మొదట జులై 21న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే, ఇప్పుడు అవి 31న విడుదల కానున్నాయి. మే 14న ప్రారంభమైన సర్ ప్రక్రియలో ఈ రెండు రాష్ట్రాలు మూడవ దశలో భాగంగా ఉన్నాయి. మూడవ దశ పూర్తయ్యాక, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడాఖ్ మినహా దేశమంతా సర్ ప్రక్రియ పరిధిలోకి వస్తుంది. వివిధ కారణాల వల్ల సర్ షెడ్యూల్‌లో తరచుగా మార్పులు చేయాల్సి వచ్చింది.

# లాలూ బెయిల్ ఉత్తర్వులపై జోక్యానికి 'సుప్రీం' నిరాకరణ



**న్యూఢిల్లీ :** ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పశుగ్రాసం కుంభకోణం కేసులో బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. జస్టిస్‌లు ఎం.ఎం. సుందరేష్, పి.బి. వరలేలతో కూడిన ధర్మాసనం, ఈ విషయంలో పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లపై విచారణను వేగవంతం చేసి, వీలైతే ఆరు నెలల్లోగా వాటిపై తీర్పు ఇవ్వాలని హైకోర్టును కోరింది. హైకోర్టు జులై 2019 నాటి ఉత్తర్వును సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. తాము ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి సుముఖంగా లేమని ధర్మాసనం పేర్కొంది. పశుగ్రాసం కుంభకోణం కేసుల్లో ఒకదానిలో, ట్రయల్ కోర్టు విధించిన శిక్షను హైకోర్టు తప్పుగా నిలిపివేసి, రాష్ట్రీయ జనతా దళ్ అధినేతకు బెయిల్ మంజూరు చేసిందని పేర్కొంటూ సిబిఐ హైకోర్టు ఉత్తర్వును సవాలు చేసింది. బిహార్ మాజీ ముఖ్యమంత్రి అయిన యాదవ్, డియోఘర్ ఖజానాకు సంబంధించిన కేసు లో దోషిగా తేలారు. అతనికి మూడున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించింది. దేవ్‌ఘర్ ఖజానా నుండి రూ. 89.27 లక్షలను మోసపూరితంగా ఉపసంహరించుకున్నారనే ఆరోపణల కేసులో, యాదవ్ ఇప్పటికే సగం శిక్షను పూర్తి చేశారనే కారణంతో హైకోర్టు ఆ శిక్షను నిలిపివేసి, అతనికి బెయిల్ మంజూరు చేసింది.

**LOST & FOUND**

Lost original GPA No. 1799/1983 (Dt: 18-08-1983) of **Kandula Linganna S/o Rajanna** on 06-07-2026 between Mancherial Chowrasta and Bhagyanagar Road, Nirmal. Notary Affidavit obtained. Finder please contact: **Kota Ravindar, 8096629680.**

# హఫీజ్ సయీద్‌పై ఎన్ఐఎ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్




**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అధిపతి హఫీజ్ సయీద్ పై ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి కేసు లో సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసిన రెండు రోజుల తర్వాత, ఈనెల 8న ఎన్ఐఎ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఈ ఉత్తర్వును జారీ చేశారు. భారత్, అమెరికా దేశాలు ప్రపంచ ఉగ్రవాదిగా ప్రకటించిన సయీద్, 2008 ముంబయి ఉగ్రదాడుల సూత్రధారిగా కూడా పరిగణిస్తున్నారు. జమ్ములోని ప్రత్యేక ఎన్ఐఎ కోర్టులో దాఖలు చేసిన ఈ అనుబంధ ఛార్జిషీట్‌లో, 76 ఏళ్ల సయీద్‌పై అతని వ్యక్తిగత హోదాతో పాటు, నిషేధిత ఎల్ఇటి, దాని అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) అధిపతిగా కూడా అభియోగాలు మోపారు. అతనిపై భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్), 2023, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని పలు నిబంధనల కింద కేసులు నమోదయ్యాయి. కోర్టు ఉత్తర్వు ప్రకారం, పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్ర సర్గోడా నివాసి, పరారీలో ఉన్న ఉగ్రవాది సయీద్, పహల్గామ్ ఉగ్రదాడిలో నిందితుడని, ఉద్దేశపూర్వకంగా అరెస్టు నుండి తప్పించుకుంటున్నాడని కోర్టుకు ఎన్ఐఎ తెలియజేసింది. 'నిష్పక్షపాతమైన, సంపూర్ణమైన, సమర్థవంతమైన దర్యాప్తు కోసం నిందితుడి (సయీద్) అరెస్టు, కస్టడీ విచారణ అవసరం. అందువల్ల అతనిపై నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేయబడింది. చట్ట ప్రకారం అమలు చేయడానికి దానిని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి), ఎన్ఐఎ జమ్ముకు పంపినట్లు' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. గత సంవత్సరం ఏప్రిల్ 22న, దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని పొట్టపెట్టుకున్నారు. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులే ఉన్నారు.

**SUMATHI REDDY INSTITUTE OF TECHNOLOGY FOR WOMEN**
Learning at its best
AN AUTONOMOUS INSTITUTION
Estd:2009
(SR Educational Academy)
Private Un-Aided Non-Minority Institution
College Code | SRIW
Ananthasagar, Hasanparthy, Warangal - 506 371
Email: principal@sritw.org, www.sritw.org
Mobile: +91 90526 36390, 96181 22472
AUTONOMOUS | Approved by AICTE | Affiliated to JNTUH | Accredited by NAAC with 'A' Grade | Accredited by NBA

**SPOT ADMISSIONS : ECET 2026-27**

Few seats are available in **II-B.Tech (Lateral Entry) CSE, CSE(AI&ML) and CSE(Data Science), CSE(Cyber Security) and ECE** branches for the academic year 2026-27. Interested eligible candidates who have not taken admission in any other institution can attend for Spot Admissions on **17.07.2026 at 10:00a.m**. Students are advised to attend Spot Admissions with all original certificates and necessary fee.

Admissions will be made as per the guidelines issued by the Convenor, TGECET-2026.

**Note: The Candidates admitted under Spot Admissions are not eligible for fee reimbursement/scholarship.**

Date:15.07.2026 Sd/- Secretary & Correspondent

# ఇరాన్ క్షిపణి దాడుల్లో మరో భారత నావికుడు మృతి

- పదిమంది భారత నావికులకు గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం
- వరుసగా మూడోరోజూ అమెరికా–ఇరాన్ పరస్పర దాడులు
- బహ్రైన్‌లో అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై విరుచుకుపడిన ఇరాన్ డ్రోన్లు
- తక్షణం దాడులు ఆపాలని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ డిమాండ్

**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రెండు సూపర్ ట్యాంకర్స్‌పై మంగళవారం ఇరాన్ చేసిన క్రూయిజ్ క్షిపణి దాడుల్లో ఒక భారత నావికుడు మరణించాడు. మరో పదిమంది భారత నావికులు గాయపడ్డారు. గాయపడిన భారత నావికులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడినవారిలో ఇద్దరు ఉక్రేన్ జాతీయులు కూడా ఉన్నారు. దాడి కారణంగా రెండు మంటలు చెలరేగడంతో నావికులు గాయపడ్డారు. ఆ తర్వాత మంటలను అదుపు చేశారు. ఒమన్ ప్రాదేశిక జలాల్లో నౌకలు ప్రయాణం చేస్తుండగా ఈ దాడులు జరిగాయి. దీంతో భారతదేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హోర్ముజ్‌లో నావికుల భద్రతను ప్రశ్నించింది. జలసంధిలో నావికులు,పౌర మౌలిక సదుపాయాలు లక్ష్యంగా దాడులను తక్షణం నిలిపివేయాలని భారత విదేశీమంత్రిత్వశాఖ డిమాండ్ చేసింది.

మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,అమెరికా కూడా ఈ పరిణామాల అదనుగా ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ ఉండటంతో జలసంధిలో యుద్ధ ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని, తమకు ప్రతీకారహక్కు ఉందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హెచ్చరించింది. దీనిని బహిరంగ దాడిగా పేర్కొంటూ తీవ్రంగా ఖండించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎంటి అల్ బహియా, ఎంటి మొంబాసా అనే రెండు నౌకలలో మొత్తం 46 మంది నావికులు ప్రయాణం చేస్తున్నారు. వీరిలో మొత్తం 30 మంది భారత నావికులు ఉన్నారు. మూడోరోజు మంగళవారం అల్ బహియా ట్యాంకర్‌పై ఇరాన్ చేసిన క్షిపణి దాడి వల్ల వీరిలో ఒక భారత నావికుడు మరణించాడు. గడచిన మూడు రోజుల యుద్ధంలో ఇద్దరు భారత నావికులు ఇరాన్ దాడుల కారణంగా హత్యకు గురయ్యారు. అంతకుముందు జూన్ 10వ తేదీ బుధవారం అమెరికా చేసిన దాడుల్లో ముగ్గురు భారత నాయకులు హత్యకు గురయ్యారు. దీంతో పశ్చిమాసియా యుద్ధంలో ఇప్పటివరకూ మరణించిన మొత్తం భారత నావికుల సంఖ్య 14కు పెరిగింది. ఈ పరిస్థితులమధ్య హోర్ముజ్ జలసంధిలో వివిధ దేశాలకు చెందిన వేలాదిమంది నావికులు తీవ్ర అభద్రతకు గురవుతూ ఉండటంతో భారత ప్రభుత్వం తక్షణం దాడులు ఆపాలని డిమాండ్ చేసింది. దీనిపై ఇరాన్ ఐఆర్‌జిసి వివరణ ఇచ్చింది. తాము నిర్దేశించిన మార్గంలో వెళ్ళకుండా తప్పుదారిన రెండు సూపర్ ట్యాంకర్లు ప్రయాణం చేస్తున్నాయని, పదే పదే హెచ్చరికలు చేసినప్పటికీ వారు మాట పెడచెవినపెట్టి నిర్లక్ష్యంగా మందుపాతరలు అమర్చిన మార్గంలో ప్రయాణం చేశారని అందుకే వాటిపై క్షిపణి దాడులు చేశామని పేర్కొంది. ఐతే నౌకల పేర్లను ఐఆర్‌జిసి ప్రకటించలేదు.కాగా ఒమన్‌లోని ఖల్బాత్‌కు ఈశాన్యంగా ఒక ట్యాంకర్‌పై దాడి జరిగిందని, ఎలాంటి నష్టం వాటిల్లలేదని బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజన్సీ ప్రకటించింది.ఈ పరిణామాలతో మంగళవారం చమురు ధరలు నెలరోజులక్రితంనాటి హెచ్చుస్థాయికి చేరుకున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర 9.6 శాతం పెరిగింది. దీని బ్యారెల్ ధర 85 డాలర్ల సమీపానికి చేరింది. చట్టవిరుద్ధమైన మార్గాలలో నుండి ప్రయాణం చేయాల్సిందిగా నౌకలను అమెరికా రెచ్చగొడుతోందని, ఈ దాడులకు అమెరికా బాధ్యత వహించాలని పేర్కొంది. దురాక్రమణలకు పాల్పడుతున్న శత్రువులతో చేతులు కలిపి వారికి సహకరిస్తే ఇదేవిధంగా యుద్ధం కొనసాగుతుందని, హోర్ముజ్ జలసంధిని తెరవడంలో జాప్యం జరుగుతుందని, చివరకు ప్రపంచానికి తీవ్ర ఇంధన సంక్షోభమే మిగులుతుందని ఐఆర్‌జిసి హెచ్చరించింది. హోర్ముజ్ జలమార్గం భవిష్యత్తును నిర్ణయించడంలో అమెరికాకు,పశ్చిమ దేశాలకు ఎలాంటి ప్రమేయం లేదని, వారి జోక్యాన్ని అనుమతించబోమని ఇరాన్ ఉన్నతస్థాయి సంయుక్త సైనిక కమాండ్ హెచ్చరించింది. ఈ ఘర్షణలు ఈ ప్రాంతాన్ని అస్థిరపరచాయని, యుద్ధం ఈ ప్రాంతం అంతటా విస్తరించిందని విమర్శించింది.ఇంకోవైపు అమెరికా–ఇరాన్ మధ్య వరుసగా మూడోరోజు మంగళవారం కూడా భీకర స్థాయిలో పరస్పర దాడులు కొనసాగాయి. ఇరాన్ ప్రమేయం లేకుండా హోర్ముజ్ జలసంధిని తామే స్వాధీనం చేసుకుని నిర్వహిస్తామని, నౌకల నుండి ఇరవైశాతం ఛార్జీలు వసూలు, ఇరాన్ ఓడరేవులపై తొలగించిన దిగ్బంధనాన్ని మళ్ళీ అమలు వంటి ప్రకటనలతో ఇరాన్‌ను ట్రంప్ రెచ్చగొట్టడంతో యుద్ధం విస్తరించింది. ఎంఓయు ఒప్పందాన్ని మీరంటే మీరే ఉల్లంఘించారని ఆరోపణలు చేసుకుంటూ హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యంకోసం అమెరికా–ఇరాన్ కొత్త యుద్ధానికి తెరతీయడంతో వాణిజ్య నౌకలలో ఉన్న నావికులు, కార్మికులు, సిబ్బంది ప్రాణభయంతో ఉన్నారు.

మంగళవారం తెల్లవారకముందుగానే బహ్రైన్‌లో ఉన్న అమెరికా నౌకా కేంద్రం ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేశాయి. దీంతో ఆగ్రహించిన అమెరికా సెంట్‌కామ్ సైన్యాలు ఇరాన్‌పై తీవ్రస్థాయిలో గగనతల దాడులు చేయడం ప్రారంభించింది. మంగళ–బుధవారాలలో ఇరాన్‌ను తీవ్రస్థాయిలో అణచివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. బహ్రైన్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడటంతో సైరన్లు అదేపనిగా మోత మోగాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని బహ్రైన్ ప్రభుత్వం తక్షణ ఆదేశాలు జారీ చేసింది

## నావికుడి హత్యపై ఇరాన్‌కు భారత్ తీవ్ర నిరసన

- యుద్ధ దాడుల్లో ఇప్పటివరకూ 14 మంది భారత నావికులు మృతి

**న్యూఢిల్లీ:** ఒమన్ ప్రాదేశిక జలాల్లో వెళుతున్న చమురు ట్యాంకర్‌లో ఉన్న మరో భారత నావికుణ్ణి హత్య చేయడంతో ఇరాన్‌కు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిరసన తెలియజేసింది. న్యూఢిల్లీలో ఉన్న ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ రాయబార కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మహ్మద్ జవాద్ హొస్సేనీని భారత విదేశీ మంత్రిత్వశాఖాధికారులు పిలిపించి తీవ్ర నిరసన తెలియజేశారు. పశ్చిమాసియాలో హింస నివారించి, శాంతి–సుస్థిరతలను తిరిగి నెలకొల్పేందుకు చర్చలు,దౌత్యానికి తిరిగి రావాలని మరోసారి పిలుపు ఇచ్చింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎంటి అల్ బహియా, ఎంటి మొంబాసా అనే రెండు నౌకలలో మొత్తం 46 మంది నావికులు ప్రయాణం చేస్తున్నారు. వీరిలో మొత్తం 30 మంది భారత నావికులు ఉన్నారు. అల్ బహియా ట్యాంకర్‌లో 12 మంది భారతీయులు ఉండగా, దీనిపై ఇరాన్ చేసిన క్షిపణి దాడివల్ల ఒక భారత నావికుడు మరణించగా మరొకరు గాయపడ్డారు. మొంబాసా ట్యాంకర్‌లో ఉన్న 18 మంది భారతీయులలో తొమ్మిదిమంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరు భారత నావికుల పరిస్థితి విషమంగా ఉంది. ఫిబ్రవరి 28వ తేదీన యుద్ధం మొదలైనప్పటినుండీ ఇప్పటివరకూ 14 మంది భారత నావికులు హోర్ముజ్ జలసంధిలో జరిగిన దాడుల్లో మరణించారు.

జులై 12వ తేదీన సైప్రస్ జెండాతో వెళుతున్న చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి చేయడంతో ఒక భారతీయ నాయకుడు గల్లంతయ్యాడు. ఇప్పటివరకూ ఆయన జాడ తెలియరాలేదు. ఆయనకోసం సైప్రస్ షిప్పింగ్ మంత్రిత్వశాఖ ఒమన్ అధికారులతో కలిసి ఉమ్మడిగా తీవ్ర గాలింపు చర్యలు కొనసాగుతున్న సమయంలో మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చమురు ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో మరో భారతీయ నావికుడు మరణించగా మరో పది మంది నావికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలను భారత ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించి జవాద్ హొస్సేనీని తమ సమక్షానికి పిలిపించి భారత విదేశీ మంత్రిత్వ శాఖ హెచ్చరిక చేసింది. తక్షణం హోర్ముజ్ జలసంధిలో దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేసింది. మరణించిన భారత నావికుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసింది. గాయపడిన భారత నావికులంతా సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించింది. వారికి తగిన వైద్యసేవలు లభిస్తున్నాయని పేర్కొంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారత రాయబార కార్యాలయాలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని, ఈ ఘటనల్లో చిక్కుకున్న భారత నావికులు అందరికీ సాధ్యమైనంత ఎక్కువ సహాయం అందేవిధంగా గల్ఫ్‌దేశంలో ఉన్న అధికారులతో భారత దౌత్యవేత్తలు,సిబ్బంది సంప్రదింపులు జరుపుతున్నారని విదేశీమంత్రిత్వశాఖ తెలియజేసింది. "హోర్ముజ్ వంటి కీలకమైన అంతర్జాతీయ జలమార్గాలలో సురక్షిత,స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి అంతరాయం కలిగిస్తూ, నావికులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులను హింసాత్మక చర్యలను భారత్ తీవ్రంగా ఖండిస్తోంది, దాడులను వ్యతిరేకిస్తోంది,పశ్చిమాసియాలో దాడులు తిరిగి ప్రారంభం కావడంపట్ల భారత్ తీవ్ర ఆందోళనతో ఉంది, ఈ ప్రాంతంలో శాంతి,సుస్థిరతల కోసం దౌత్యమార్గంలోకి తిరిగి వారాలి, చర్చలు మళ్ళీ ప్రారంభించాలి" అని భారత విదేశీమంత్రిత్వశాఖ కోరింది. "ముఖ్యంగా అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానాన్ని సత్వరం పునరుద్ధరించాలంటే పౌర,వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిలిపివేయడం ఒక్కటే పరిష్కారం" అని పేర్కొంది.

కాగా భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రణధీర్ జైస్వాల్ మంగళవారం న్యూఢిల్లీలో పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఇరాన్ దౌత్యవేత్తకు భారత్ తన తీవ్ర నిరసన తెలియజేసిందని, ఈ దాడులు వీలైనంత త్వరగా ఆగిపోవాలని కోరుకుంటున్నామన్నారు. పశ్చిమాసియాలో పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని, హోర్ముజ్ జలసంధిలో నిరాఘాటంగా నిశ్చింతగా వాణిజ్య నౌకలు రాకపోకలు సాగించాలని పదే పదే తాము కోరుతూనే ఉన్నామని, ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఇంధన,ఆర్థిక భద్రత సాధించడానికి ఈ జలమార్గం అత్యంత కీలకమైనదని రణధీర్ జైస్వాల్ అన్నారు.

ఇదిలా ఉండగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణమంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ఒమన్ ప్రాదేశిక జలాల్లో హోర్ముజ్ జలసంధి దక్షిణ షిప్పింగ్ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో ఎంటి మొంబాసా, ఎంటి అల్ బహియా నౌకలపై ఇరాన్ క్రూయిజ్ క్షిపణి దాడి చేసిందని పేర్కొంది. సైప్రస్ జెండాతో వెళుతున్న కంటైనర్ షిప్ జిఎఫ్ఎస్ గెలాక్సీపై ఇరాన్ దాడి చేసిన రెండు రోజుల తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నౌకలపై జులై 14 ఉదయం మళ్ళీ దాడులు చేసింది. గెలాకీ నౌకలో ఒక భారతీయులు జాడతెలియకుండా పోగా, పదిమంది సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. జాడతెలియని భారత నావికుడికోసం గాలింపు కొనసాగుతోంది.

## అవినీతిపై చైనా పోరాటం

# కమ్యూనిస్టుపార్టీ పొలిట్ బ్యూరో నేత బహిష్కరణ



**బీజింగ్:** వివిధ రంగాలలో అవినీతిపై చైనా దీర్ఘకాలంగా చేస్తున్న పోరాటంలో భాగంగా అధికార కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ చైనా (సిపిసి) నుండి ఒక సీనియర్ నాయకుణ్ణి పార్టీ బహిష్కరించింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి ప్రజాసేవలు చేయకుండా అవినీతికి పాల్పడినందుకు గ్జిన్‌జియాంగ్ రాష్ట్ర పార్టీ ఉన్నతస్థాయి మాజీ అధిపతి మా జింగ్రుయి(67)ని పార్టీ బహిష్కరించింది.ప్రభుత్వ సేవల నుండి తొలగించింది. దేశంలో అత్యున్నతమైన నిర్ణయాధికార సంస్థ,శక్తిమంతమైన పొలిట్‌బ్యూరోలో సభ్యుడుగా కూడా కొనసాగుతున్న జింగ్రుయి పార్టీకి ఉన్న నమ్మకాలు,ఆదర్శాలను కోల్పోయారని, రాజకీయ విశ్వాసాలను వదిలిపెట్టి పార్టీ మూల సూత్రాలకు ద్రోహం చేశారని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయన పార్టీ రాజకీయ నియమాలు, సూత్రాలను తీవ్రంగా ఉల్లంఘించినట్లు దర్యాప్తులో వెల్లడైందని చైనా ప్రభుత్వ వార్తాసంస్థ జిన్హువా వెల్లడించినట్లు పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది. మా జింగ్రుయి 24 మంది సభ్యులున్న పొలిట్‌బ్యూరోలో సభ్యుడు. ఈ విధంగా అవినీతి విచారణకు గురైనవారిలో మూడవ నాయకుడు.105 సంవత్సరాల పార్టీ చరిత్రలో సమీపకాల పరిణామాల్లో ఇది అత్యంత అరుదైన ఘటనగా పేర్కొం ది. మా జింగ్రుయి పార్టీ రాజకీయ,సంస్థాగత క్రమణశిక్షణ ఉల్లంఘించి మార్కెట్ ధరలకంటే తక్కువగా ఇళ్ళు కొనుగోలు చేయడం, అధికారం, డబ్బు సంపాదించడానికి లైంగిక సంబంధాల లావాదేవీలలో పాల్గొనడంతోపాటు తన పదవి, అధికారం ఉపయోగించుకుని కుటుంబ సభ్యులు భారీగా ప్రయోజనం పొందడానికి అనుమతించారని తమ దర్యాప్తులో తేలిందని సిపిసి పేర్కొంది. వ్యాపార ప్రయోజనాలు,ప్రాజెక్టుల కాంట్రాక్టులు, ఉద్యోగ పదోన్నతుల ప్రయోజనాలు ఇతరులకు కల్పించాలని సిఫార్సులు చేసినట్లు పేర్కొంది. బంధువులు,సన్నిహితులు,ఇతరులతో కుమ్మక్కై భారీ మొత్తంలో ధనాన్ని, కానుకలను స్వీకరించారని ఈ కారణంగా ఆయన పొలిట్‌బ్యూరో సభ్యత్వాన్ని రద్దుచేయాలని, ప్రభుత్వ పదవి నుండి తొలగించి పార్టీ నుండి బహిష్కరించి అక్రమ ఆస్తులు జప్తుచేయాలని,20వ సిపిసి జాతీయ కాంగ్రెస్ ప్రతినిధిగా ఆయన హోదాను రద్దుచేయాలని సిపిసి ఆదేశించిందని జిన్హువా పేర్కొంది.

2012లో జీ జిన్‌పింగ్ దేశాధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టినప్పటినుండీ అన్నిస్థాయిల్లోనూ అవినీతిని పర్యవేక్షిస్తున్నారు. సైనికరంగంలో ఉన్నతస్థాయి జనరల్స్‌సహా ఎవ్వరినీ వదిలిపెట్టకుండా బహిష్కరణతోపాటు మరణ దండన శిక్షలు కూడా కఠినంగా ఆయన అమలు చేస్తున్నారు.అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగంగా వందలమందిపై ఆయన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

## దూషణలు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. అధికారంలో ఎవరు ఉన్నా నిపుణుల సలహాలు, సూచనలు, అధికారుల అభిప్రాయాల మేరకు విధానాలను రూపొందించే వారు మాత్రమేనన్న అంశం మరువరాదని పేర్కొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలి

ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు. వెంటనే నిపుణుల కమిటీని రంగంలోకి దించాలని డిమాండ చేశారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ద్వారా నిపుణులను ఇక్కడికి పంపించి అధ్యయనం చేయించడం ద్వారా అసలు విషయం తేల్చి ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ చూపాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి నీళ్లు వదిలితే అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కూడా ప్రమాదంలో పడతాయని ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికను సిడబ్ల్యుసికి పంపి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్షంగా వ్యవహరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉంటే ఇప్పటికే ఏదో ఒక పరిష్కారం లభించేదని, కానీ ఈ అంశాన్ని రాజకీయాల కోసం అలాగే వదిలేశారని పేర్కొన్నారు.

### ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్షం వహిస్తోందని కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తుది దశకు చేరుకున్న ప్రాజెక్టులు అనేకం ఉన్నాయని వీటికి కొద్ది మొత్తం నిధులు కేటాయిస్తే ఇప్పటీకే పూర్తు అందుబాటులోకి వచ్చేయని, ప్రస్తుత వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో ఇవి ఎంతో ఉపయోగపడేవని ఆయన పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా వంటి ప్రాజెక్టులతో పాటు తమ ప్రాంతంలోని సీతారామ ప్రాజెక్టు పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. తక్కువ బడ్జెట్ పూర్తయ్యే అవకాశమున్న ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

### ఓటర్ల నమోదు ప్రక్రియ గడువును 3 నెలలు పెంచాలి

ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి ఈ నెల 24తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో, ఆ సమయం ఏమాత్రం సరిపోదని, గడువును కనీసం మరో మూడు నెలల పాటు పొడిగించాలని సాంబశివరావు ఎన్నికల కమిషన్ కోరారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలలోనే 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉన్నందన సమాచారం నేపథ్యంలో అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదును పర్యవేక్షించాలని డిమాండ చేశారు.

### ఎన్‌డిఎస్‌ఎ ప్రత్యేక కమిటీ త్వరగా నివేదిక అందించాలి : పశ్యపద్మ

కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని పంపింగ్ చేయవచ్చని కొందరు, అది సాధ్యం కాదని మరికొందరు వాదిస్తున్న నేపథ్యంలో గత జూన్ 30న ఎన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ త్వరితగతిన పరిశీలన పూర్తి చేసి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని పశ్యపద్మ డిమాండ చేశారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ అధికార పార్టీ కాంగ్రెస్ నేతలు ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించే వరకు అందరూ కలిసి పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని దాదాపు 63 శాతం మండలాలలో లోటు వర్షపాతం నమోదు కావడంతో ఇప్పటికే రైతులు లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, కంది, మినుము, పెసర వంటి పంటలు సాగు చేయగా, ఈ పంటలు చివరి దాకా చేతికి వస్తాయన్న నమ్మకం లేదన్నారు. ఈ నేపథ్యంలో మెట్ట పంటల రైతులకు ఎకరాకు రూ.8 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, తద్వారా రైతులకు కొంతైనా వెసులుబాటు కలిగి, వారు ప్రత్యామ్నాయంగా మెట్ట పంటల ద్వారా ఆహార పదార్థాలను అందించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

బ్యారేజీకి సీప్లేన్లు హైదరాబాద్ హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీప్లేన్లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరగా, అందుకు సమంధించిన అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సిఎంను కేంద్ర మంత్రి కోరారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్‌అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావుతో పాటు పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు**

అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మీడియాతో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని సిఎం చెప్పారు.

**ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి**

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రిమండలి అనుమతి ఇప్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తికావడమే కాకుండా నిర్మాణ వ్యయం తగ్గుతుందని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఈ సందర్భంగా సిఎం కోరారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఎపి పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్ విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్ట్ వరకు రవాణా వేగవంతమవుతుందని తెలిపారు. మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సిఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారికి అనుమతులు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీని కోరారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని సిఎం చెప్పారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సిఎం ప్రతిపాదించారు. సమావేశంలో నల్గొండ ఎంపి రఘువీర్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హక్కులు పరిశీలించకుండా లీజు సరికాదు-హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన యజమాని అనుమతి లేకుండా ఉపలీజుకు ఇచ్చిన భవనాన్ని పోలీస్ స్టేషన్‌గా వినియోగించడం చట్టవిరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది. హక్కులను పరిశీలించకుండా భవనాన్ని లీజుకు తీసుకున్న చర్లపల్లి ఎస్‌హెచ్‌ఓ తీరును తప్పుబట్టింది. భవన యజమాని ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించి మూడు నెలల్లో తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. అద్దె ఒప్పందం గడువు ముగిసిన నేపథ్యంలో ఉపలీజు చెల్లదని పేర్కొంటూ, అవసరమైతే తిరిగి కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు సూచించింది.

### మాజీ డిజిపిలకు భద్రత కొనసాగించండి-హైకోర్టు

మాజీ డిజిపిలు స్వరణ్‌జిత్‌సేన్, జె.పూర్ణ చంద్రరావులు దాఖలు చే సిన పిటిషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వారి వినతిపత్రాలను ప్రభుత్వం పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే వరకు ప్రస్తుతం కల్పిస్తున్న భద్రత, బు ల్లెట్ ప్రూఫ్ వాహనం సహా అన్ని సదుపాయాలను కొనసాగించాలని ఆదేశించింది.

పిటిషనర్ల వాదనలు విని తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తూ పిటిషన్లను ముగించింది.

## ఇరాన్‌ను నెట్టేశాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఉభయసభలకు ట్రంప్ లిఖితపూర్వకంగా తెలియజేశారు. కాంగ్రెస్‌అమోదం లేకుండా అమెరికా అధ్యక్షు డు 60 రోజులపాటు ఏ దేశంమీద అయినా యుద్ధం చేయవచ్చు. ఆ తర్వాత యుద్ధం చేయాలంటే కాంగ్రెస్ ఉభయసభల్లో తీర్మానం చేయాలి. ఇంతకుముందు ఫిబ్రవరి 28న యుద్ధం ప్రా రంభించి ఏప్రిల్ రెండో తేదీన ఆపేశారు. గతనెల (జూన్ 17,18)లో ఇరాన్‌తో సంతకాలు చేసిన ఎంఒయును ఆయన చులకనచేసి మాట్లాడారు. అది ఒక పరీక్ష మాత్రమేనని, ఆ ఒప్పంద నిబంధనలకు కట్టుబడి ఉండని నీచమైన దెయ్యాలతో తాము తలపడాల్సివస్తోందని, అందువల్ల ఈ ఒప్పందానికి అర్థంలేదని విమర్శించారు. ఐతే ఇరాన్ కూడా అమెరికాపై ఇదే తరహా విమర్శలు చేసింది. ఇస్లామాబాద్ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని, వారు ఒప్పందానికి కట్టుబడి ఉండని మనుషులని, వారికి నీతి లేదని విమర్శించింది. హోర్ముజ్ జలసంధిలో నియంత్రణ ఇరాన్‌కే ఉంటుందని గలనెలలో ఎంఒయు తేల్చి చెప్పిందని, ఈ ఒప్పందాన్ని వారు ఉల్లంఘించారని విమర్శించింది. అందువల్ల ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్‌పై ఇరాన్ నియంత్రణ చట్టబద్ధమైనదని పేర్కొంది.

ఇరాన్ నాగరికతను సర్వనాశనం చేస్తామని గతంలో ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు చెలరేగాయి. ఆయన సొంత పార్టీలో,ప్రతిపక్షంలో కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. కానీ నెలల విరామం తర్వాత ట్రంప్ మళ్ళీ అదేతరహా విమర్శలు ఎక్కుపెట్టారు. హోర్ముజ్ జలసంధికోసం రెండు దేశాలమధ్యా పోరాటం అదుపుతప్పిన తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ పాలకులకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసన చేసే ప్రదర్శకులకు మద్దతు కొనసాగిస్తారా? అని ప్రశ్నించగా, ఈ ఆలోచనను వ్యతిరేకించారు. నిరాయుధులైన నిరసన ప్రదర్శకులను ప్రభుత్వ సాయుధ బలగాలు ఉక్కుపాదంతో అణచివేస్తున్నాయని,వారి ముందు సామాన్య ప్రజలు ఎదురు నిలబడలేరని అన్నారు. పాలకులపై తిరగబడాలని తాను కోరుకున్నప్పటికీ, ఇరాన్‌లో తిరుగుబాటు విజయవంతమవుతుందని తానెప్పుడూ విశ్వసించలేదన్నారు. ఇరాన్‌తో ఎంఓయు సమయంలో నెతన్యాహూను బలిపశువును చేశారన్న విమర్శలపై స్పందిస్తూ, ఆ దేశంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు.తామిద్దరం అధికారంలో లేకపోతే ఇజ్రాయెల్ ఈనాడు ఈ విధంగా ఉండేదికాదన్నారు.

అంతకుముందు మంగళవారం తెల్లారకముందుగా సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, ఇరాన్ ఓడరేవులపై మళ్ళీ దిగ్బంధనాన్ని పునరుద్ధరించినట్లు ప్రకటించారు. సెంట్‌కామ్ 'రక్షకుడు పాత్ర' నిర్వహిస్తుందని,ఈ జలసంధి ద్వారా ప్రయాణించే అన్ని కార్గో నౌకల నుండి 20 శాతం ఛార్జీలు వసూలు చేస్తామని ప్రకటించారు. "ఇకమీదట అమెరికాను 'హోర్ముజ్ సంరక్షకుడు' అని పిలుస్తారు, అత్యంత అస్థిరమైన ఈ ప్రాంతంతో భద్రత నిమిత్తం ప్రతిఫలం తీసుకుని జలసంధిని కాపాడతాం" అని పేర్కొన్నారు.

## దీక్ష విరమించ

(మొదటి పేజీ తరువాయి)

పోస్టు చేశారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తనకు ఫోన్ చేశారని, ఆయన పరిస్థితి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని దీప్కే తెలిపారు. మరో పోస్ట్‌లో, శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే కూడా తనతో మాట్లాడారని, వాంగ్‌చుక్ ఆరోగ్యం వేగంగా క్షీణిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారని దీప్కే వెల్లడించారు. నిరవధిక నిరాహార దీక్షలో ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేరిన ఎఐఎస్‌ఎ కార్యకర్త దీపక్, మంగళవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన కార్యకర్తలు నేహా, మనీష్, అమీన్ నిరసన స్థలంలోని వేరొక వేదిక వద్ద తమ నిరవధిక దీక్షను కొనసాగిస్తున్నారని ఆ సంస్థ తెలిపింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షలలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందించాలని సిజెపి డిమాండ్ చేస్తోంది.

**దీక్ష విరమించాలని ప్రతిపక్షనేతలు, ప్రముఖులు విజ్ఞప్తి**

ఇదిలా ఉండగా, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంక్‌చుక్ కొనసాగిస్తున్న నిరవధిక దీక్షను విరమించాలని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిపక్ష నాయకులు, పలువురు ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. హృదయం లేని బిజెపి ప్రభుత్వానికి ఏ త్యాగం కూడా విలువైనది కాదని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. వాంగ్‌చుక్‌ను తన దీక్షను విరమించాల్సిందిగా కోరారు. సోనమ్ ప్రాణం ప్రపంచం మొత్తానికి అమూల్యమైనదని, ప్రజాస్వామ్యం పట్ల ఉన్నట్టే మానవత్వం, పర్యావరణం పట్ల కూడా ఆయనలో అదే అంకితభావం కనిపిస్తుందని అఖిలేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆమరణ దీక్ష ద్వారా ఆయన మేల్కొల్పాలని ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వం స్వయంగా ఒక విలువలు లేని, అవినీతిమయమైన వ్యవస్థ అని, దాని అసంవేదన, కఠిన హృదయ స్వభావం దృష్ట్యా, ఎవరి త్యాగమైనా దానికి ఏమాత్రం ముఖ్యం కాదని దుయ్యబట్టారు. అందువల్ల బిజెపి సభ్యుల నుండి ఔచిత్యాన్ని లేదా వారిలో మార్పును ఆశించడం పూర్తిగా వ్యర్థమన్నారు. అయోధ్యలోని రామమందిరంలో విరాళాల చోరీ ఘటనపై కూడా యాదవ్ బిజెపిని విమర్శించారు. అధికారం కోసం గుళ్ళను కూడా దోచుకునే వారికి 'సత్యాగ్రహం' ప్రాముఖ్యత ఎలా అర్థమవుతుందని ప్రశ్నించారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహిస్తున్న నిరసనకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. అలాగే, వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరవధిక నిరాహార దీక్షను విరమించాలని ఆయన కోరారు. మంగళవారం మీడియా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ వాంగ్‌చుక్‌కు, సిజెపి నిరసనకు తన మద్దతును తెలియజేయడానికి గురువారం సాయంత్రం 5 గంటలకు జంతర్ మంతర్‌ను సందర్శిస్తానని చెప్పారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తోందని, ఆయన దేశానికి ఒక ఆస్తి వంటివారన్నారు. ఆయన తన నిరాహార దీక్షను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈ పోరాటానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయని కేజ్రీవాల్ తెలిపారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి, భవిష్యత్తులో విద్యార్థులు సమస్యలు ఎదుర్కోకుండా కాపాడటానికి పరీక్షా విధానాన్ని మెరుగుపరచాలని కేజ్రీవాల్ అన్నారు. అంతకు ముందు శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే కూడా వాంగ్‌చుక్ ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ తన నిరాహార దీక్షను విరమించాలని కోరారు.

**ధర్మేంద్ర ప్రధాన్ డిమాండ్‌కు ప్రముఖులు మద్దతు**

రచయిత్రి అరుంధతీ రాయ్, నటులు నసీరుద్దీన్ షా, రత్నా పాఠక్ షా, ఆర్థికవేత్త జయతి ఘోష్‌లతో సహా పలువురు ప్రముఖ పౌరులు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటిస్తూనే, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నిరసనకారులను తమ దీక్షను విరమించుకోవాలని కోరారు. సోమవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో సంతకం చేసిన వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిస్తున్నందుకు నిరసనకారులకు అత్యంత కృతజ్ఞతలు తెలిపారు, అదే సమయంలో క్షీణిస్తున్న సోనమ్ ఆరగ్యం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత కోసం మీరు ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న తీరు, వారి సంకల్పం, ధైర్యసాహసాలకు తాము సెల్యూట్ చేస్తున్నాన్నారు. 'ముందున్న సుదీర్ఘమైన, కఠినమైన పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని, దయచేసి ఈ నిరాహార దీక్షను తక్షణమే విరమించుకోవాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము. ఈ పోరాటం ఒక మారథాన్ లాంటిది, స్వల్పకాలిక పరుగు పందెం కాదు; రాబోయే రోజుల్లో మాకు మీరు, మీ బలం, మీ నాయకత్వం అవసరం. డిమాండ్లపై స్పందించడంలో ప్రభుత్వం విఫలమవ్వడం వల్ల నిరాహార దీక్ష చేస్తున్న వారి ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడవచ్చని తాము ఆందోళన చెందుతున్నాం' అని సంతకం చేసిన వారు పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే రోజున, సిజెపి తలపెట్టిన పార్లమెంటు మార్చ్‌లో పాల్గొనాలని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాయ్, నసీరుద్దీన్ షా, రత్న పాఠక్ షా, జయతీ ఘోష్‌లతో పాటు, విద్యావేత్తలు అనురాధ చెనోయ్, నివేదిత మీనన్, తనికా సర్కార్, ఆదిత్య నిగమ్, చిత్రనిర్మాత సంజయ్ కాక్, కార్యకర్త లలితా రామ్‌దాస్, కవితా శ్రీవాస్తవ, స్త్రీవాది మధు భూషణ్, సాంస్కృతికవేత్త అరుంధతీ ఘోష్‌లు కూడా ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.

# ఇంగ్లండ్‌తో తొలి వన్డే.. భారత్ లక్ష్యం 259 పరుగులు



వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత పేసర్ల ధాటికి ఇంగ్లండ్ టాపార్డర్ కుప్పకూలినా మిడిలార్డర్ నిలబడింది. ఎడ్జ్‌బాస్టన్‌లో గుర్నూర్ బ్రార్(2–61), ప్రసిధ్ కృష్ణ(2–50)లు ఒకే ఓవర్లో రెండేసి వికెట్లతో రెచ్చిపోగా.. 80 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు అనూహ్యంగా పుంజుకుంది. టెస్టుల్లోనే కాదు వన్డేల్లోనూ రాణించగలనని చాటుతూ జో రూట్(76 నాటౌట్) అర్ధ శతకంతో మెరిశాడు. లియాం డాసన్(68)తో కలిసి ఏడో వికెట్కు శతక భాగస్వామ్యం నెలకొల్పి పరువు కాపాడాడు. ఆఖర్లో అక్షర్ పటేల్(4–62) తిప్పేయగా ఇంగ్లండ్ 258కే కుప్పకూలింది.

ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న తొలి వన్డేల్లో ఇంగ్లండ్ తడబడినా సవాల్ విసిరేంత స్కోర్ చేసింది. పవర్ ప్లేలో అజేయంగా 51 రన్స్ చేసిన ఆతిథ్య జట్టుకు ఆ తర్వాత వరసగా వికెట్లు కోల్పోయింది. గుర్నూర్ బ్రార్(2–61) విజృంభణతో ఒకే ఓవర్లో జాకబ్ బెథెల్(14), బెన్ డకెట్(43) ఔటయ్యారు. రెండో బంతికి బెథెల్ వెనుదిరగగా.. నాలుగో బంతికి థర్డ్మ్యాన్ దిశగా డకెట్ సిక్సర్కు యత్నించగా.. బౌండరీ లైన్ వద్ద బుమ్రా ఒడుపుగా అందుకున్నాడు. దాంతో, 63 పరుగుల వద్ద ఆతిథ్య జట్టు రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాతి బుమ్రా ఓవర్లో కెప్టెన్ హ్యారీ బ్రూక్(1) స్లిప్లో రోహిత్ శర్మ చేతికి చిక్కాడు. టాపార్డర్ విఫలమైన వేళ జట్టును ఆదుకోవాలనుకున్న జోస్ బట్లర్(5)ను, సామ్ కరన్(0)ను ప్రసిధ్ కృష్ణ(250) వెనక్కి పంపాడు.

**రూట్, డాసన్ పోరాటంతో...** గుర్నూర్, ప్రసిద్ధ జోరుతో 80 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు.. 150, 180 కొడితే మహా గొప్ప అనిపించింది. కానీ, జో రూట్(76 నాటౌట్) ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తూ భారత బౌలర్లను విసిగించాడు. ఏడు పరుగుల వద్ద దూబే రిటర్న్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన రూట్.. ఆల్‌రౌండర్ లియాం డాసన్(68)తో కలిసి స్కోర్ బోర్డును నడిపించాడు. కాస్త కుదురుకున్నాక ఇద్దరూ బ్యాట్లకు పని చెప్పారు శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని విడదీసి అక్షర్ పటేల్(462) ఊరటనిచ్చాడు. డాసన్తో పాటు టెయిలెండర్లను డగౌట్ చేర్చిన అక్షర్.. ఇంగ్లండ్ను 258 పరుగులకే కట్టడి చేయడంలో కీలకమయ్యాడు.

## వెంటాడిన భుజం గాయం.. సాత్విక్ చిరాగ్ జోడీ నిష్క్రమణ..!

జపాన్ ఓపెన్‌లో దుమ్మురేపాలనుకున్న భారత డబుల్స్ ద్వయం కల చెదిరింది. టోర్నీలో ఫేవరెట్ అయిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మొదటి మ్యాచ్‌లోనే సాత్విక్ సాయిరాజ్‌కు భుజం గాయం తిరగబెట్టడంతో ఇక ఆడలేమంటూ.. తొలి ఈ స్టార్ జోడీ కోర్టును వీడింది. దాంతో.. డెన్మార్క్ జంటను విజేతగా ప్రకటించారు నిర్వాహకులు. ఫేవరెట్‌గా జపాన్ ఓపెన్ బరిలో నిలిచిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి ద్వయం డెన్మార్క్ ఆటగాళ్లు డానియెల్ లుండ్గార్డ్ మాడ్స్ వెస్టెర్గార్డ్తో మ్యాచ్ సమయంలో సాత్విక్ కుడి భుజం నొప్పి కారణంగా ఆటను కొనసాగించలేకపోయాడు. ఈ ఏడాది పలుమార్లు సాత్విక్ భుజం గాయంతో బాధపడ్డాడు. మార్చి నెలలో ఇదే సమస్యతో సాత్విక్ చిరాగ్ ద్వయం స్విట్జర్లాండ్ ఓపెన్ నుంచి ఇంటొకొచ్చేసింది. ఏప్రిల్లో బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్,.. అనంతరం ఇండోనేషియా ఓపెన్‌లో సైతం వీరు ఆడలేదు. అయితే.. థామస్ కప్‌లో కాంస్యం.. సింగపూర్ ఓపెన్‌లో టైటిల్ విజయంతో దారిలో పడిన ఈజంట.. జపాన్ ఓపెన్‌ను బాధతో వీడక తప్పలేదు. ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా పెట్టుకున్న సాత్విక్ చిరాగ్ అంతకం టే ముందే బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్ షిప్‌లో పోటీపడనున్నారు.




## వైదొలుగుతున్న టీమిండియా కోచ్ డస్కేట్




వరసగా రెండు టి20 సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టుకు మరో షాక్. సహాయక కోచ్ రియాన్ టెన్ డస్చేట్ తన బాధ్యతల నుంచి వైదొలగనున్నాడు. వ్యక్తిగత కారణాలతో అతడు ఒక కొనసాగవద్దనే నిర్ణయానికి వచ్చాడని సమాచారం. ఇదే విషయాన్ని డస్చేట్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐకు అతడు తెలియజేశాడు. ఒకవేళ గౌతీ, భారత బోర్డు ఆమోద ముద్ర వేస్తే ఇంగ్లండ్ పర్యటనతోనే టీమిండియా అసిస్టెంట్ కోచ్గా డస్చేట్ పదవీకాలం ముగియనుంది. టి20ల్లో ఊహించని విధంగా ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో టీమిండియా వైట్‌వాష్‌కు గురయ్యాక.. ఆటగాళ్లపైనే కాదు కోచింగ్ సిబ్బందిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో తొలి వన్డే జరుగుతుండగానే అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్చేట్ రాజీనామా వార్త వెలుగులోకి వచ్చింది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. తనను సహాయక కోచ్ బాధ్యతల నుంచి తప్పించాలని అతడు హెడ్కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐని కోరాడు. అయితే.. అటు గౌతీగానీ, ఇటు భారత బోర్డుగానీ డస్చేట్ గురించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ.. డస్చేట్ కోరినట్టే వెళ్లేందుకు అంగీకరిస్తే.. ఇంగ్లండ్తో మూడుల వన్డే సిరీస్తో భారత అసిస్టెంట్ కోచ్గా అతడి ప్రస్థానం ముగియనుంది. నెదర్లాండ్స్ మాజీ ఆటగాడైన డస్చేట్ రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయక కోచ్గా చేరాడు. ఐపీఎల్లో కోల్కతా నైట్ రైడర్స్ కోచింగ్ సిబ్బందిలో ఒకటైన అతడిని గౌతం గంభీర్ తన బృందంలో చేర్చుకున్నాడు.

## మహిళ

# మహిళల్లో 'ఎడిహెచ్‌డి' గుర్తింపులో ఆలస్యం ఎందుకు?

అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్' (ఎడిహెచ్‌డి) గురించి చాలా కాలంగా ఉన్న సాధారణ అభిప్రాయం ఏమిటంటే, ఇది చిన్న పిల్లల్లో, ముఖ్యంగా అల్లరి చేసే అబ్బాయిల్లో కనిపించే సమస్య అని. కానీ ఇటీవలి పరిశోధనలు ఈ అభిప్రాయం పూర్తిగా సరైనది కాదని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళల్లో 'ఎడిహెచ్‌డి' తరచుగా గుర్తించబడకుండా పోతోంది. అధ్యయనాల ప్రకారం, పురుషులతో పోలిస్తే మహిళలకు 'ఎడిహెచ్‌డి' నిర్ధారణ సగటున ఐదేళ్లు ఆలస్యంగా జరుగుతోంది. చాలామందికి మొదట ఆందోళన, నిరాశ లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలుగా తప్పుగా నిర్ధారణ అవుతోంది. మరికొందరికి జీవితాంతం అసలు 'ఎడిహెచ్‌డి' ఉన్నట్లు కూడా తెలియకపోవచ్చు.

**లక్షణాలు దాచిపెట్టే సామాజిక ఒత్తిడి...**నిపుణుల అభిప్రాయం ప్రకారం, మహిళల్లో 'ఎడిహెచ్‌డి' ఆలస్యంగా గుర్తించబడటానికి ప్రధాన కారణం సామాజిక అంచనాలు. చిన్నప్పటి నుంచే అమ్మాయిలు ప్రశాంతంగా ఉండాలి, క్రమశిక్షణతో ప్రవర్తించాలి, ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదనే భావన సమాజంలో బలంగా ఉంటుంది. దీంతో చాలామంది తమ అసలు ప్రవర్తనను బయటపెట్టకుండా నియంత్రించుకోవడం నేర్చుకుంటారు. దీనినే 'మాస్కింగ్' అంటారు. బయటకు వారు శ్రద్ధగా వింటున్నట్లుగా, పనులు క్రమబద్ధంగా చేస్తున్నట్లుగా కనిపించినా, వారి మనసులో మాత్రం నిరంతరం ఆలోచనలు పరుగులు తీస్తుంటాయి. తరగతి గదిలో పగటి కలలు కనడం, పనులను చివరి నిమిషం వరకు వాయిదా వేయడం, ఒకేసారి అనేక పనులు చేయాలనే ప్రయత్నం, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపించినా, అవి ఇతరులకు పెద్దగా కనిపించవు. ఈ కారణంగా ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, వైద్యులు కూడా వాటిని 'ఎడిహెచ్‌డి'గా గుర్తించలేకపోతారు.



**ఎలా కనిపిస్తుంది?...**నిపుణులు చెబుతున్నట్లుగా, 'ఎడిహెచ్‌డి' ప్రతి వ్యక్తిలో ఒకే విధంగా ఉండదు. ఇది కేవలం లింగం ఆధారంగా మారదు. వ్యక్తిత్వం, కుటుంబ పరిస్థితులు, సంస్కృతి, సామాజిక వాతావరణం వంటి అనేక అంశాల ప్రభావం ఉంటుంది. కొంతమంది మహిళలు చిన్నప్పటి నుంచే చదువులో బాగా రాణిస్తారు. అందువల్ల వారికి 'ఎడిహెచ్‌డి' ఉండదని భావిస్తారు. కానీ వాస్తవానికి వారు అధిక శ్రమతో, తమసమస్యలను దాచుకుంటూ ఆ స్థాయికి చేరుకుని ఉండవచ్చు. ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, పిల్లల సంరక్షణ వంటి ఒత్తిడులు పెరిగే కొద్దీ ఈలక్షణాలు మరింత స్పష్టంగా బయటపడతాయి. ముఖ్యంగా మధ్యవయస్సులో హార్మోన్ల మార్పులు ప్రారంభమైనప్పుడు ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక అలసట వంటి ఇబ్బందులు ఎక్కువ కావచ్చు. అప్పుడు మాత్రమే చాలామంది తమ సమస్యకు అసలు కారణం 'ఎడిహెచ్‌డి' అని తెలుసుకుంటారు.

**అవగాహన అవసరం...**గతంలో 'ఎడిహెచ్‌డి'పై పరిశోధనలు ఎక్కువగా చిన్న వయసు అబ్బాయిల ఆధారంగా జరిగాయి. అందువల్ల మహిళల్లో కనిపించే లక్షణాలు చాలావరకు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అయితే ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. సామాజిక మాధ్యమాలు, కొత్త పరిశోధనలు, మహిళలు తమ అనుభవాలను బహిరంగంగా పంచుకోవడం వల్ల ఈ అంశంపై అవగాహన పెరుగుతోంది. 'ఎడిహెచ్‌డి'ని కేవలం ఒక వ్యాధిగా కాకుండా, మెదడు పనితీరులో సహజమైన వైవిధ్యంగా కూడా చూడాలనే అభిప్రాయం బలపడుతోంది. సరైన సమయంలో గుర్తిస్తే చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం వంటి రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను మెరుగ్గా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఇదే మహిళలకు సరైన సహాయం అందించడానికి, వారి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కీలకమైన ముందడుగు అవుతుంది.

## ఎదురుగాలులకు ఎదురెళ్లిన బెరిల్

ఈ ప్రయాణం అసాధ్యం.. ఎదురుగాలులను జయించడం ఎవరి వల్లా కాదు' అని అందరూ చెప్పారు. వాదించారు. వారించారు. కానీ ఆ మాటలు 34 ఏళ్ళ బెరిల్ మార్కమ్ సంకల్పాన్ని ఏమాత్రం కదిలించలేకపోయాయి. తన చిన్న విమానాన్ని ఆకాశంలోకి ఎగరేసి, ప్రపంచం అసాధ్యమని భావించిన సవాలును ఆమె స్వీకరించింది. ఇంగ్లాండ్‌లో జన్మించిన బెరిల్ మార్కమ్ బాల్యం నేటి కెన్యాలో గడిచింది. చిన్నప్పటి నుంచే ప్రకృతితో మమేకమై, గుర్రాల శిక్షణలో నైపుణ్యం సంపాదించింది. అనంతరం కెన్యాలో తొలిమహిళా వాణిజ్య పైలట్‌గా గుర్తింపు పొందింది. అడవులు, పర్వతాలు, నిర్జన ప్రాంతాల మీదుగా తపాలా, మందులు, ప్రయాణికులను సురక్షితంగా చేరవేస్తూ ధైర్యవంతమైన పైలట్‌గా పేరుతెచ్చుకుంది. ఆ రోజుల్లో అట్లాంటిక్ మహాసముద్రాన్ని తూర్పు నుంచి పడమరకు ఒంటరిగా దాటడం దాదాపు అసాధ్యమని విమానయాన నిపుణులు భావించేవారు. ఎందుకంటే అనుకూల గాలులకు బదులుగా ఎదురుగాలులు నిరంతరం విమానాన్ని వెనక్కి నెట్టేవి. ఇంధనం వేగంగా ఖర్చవుతుంది, చిన్న పొరపాటు కూడా ప్రాణాంతకంగా మారుతుంది. అయినప్పటికీ బెరిల్ వెనక్కి తగ్గలేదు. 1936 సెప్టెంబర్ 4న ఆమె ఇంగ్లాండ్ నుంచి ఒంటరిగా బయలుదేరింది. దాదాపు 21 గంటలపాటు చీకటి, మంచు, తీవ్ర గాలి అలజడులు, తగ్గిపోతున్న ఇంధనంతో పోరాడింది. చివరకు గమ్యస్థానం న్యూయార్క్ చేరుకోలేకపోయినా, కెనడాలోని నోవా స్కోషియాలో అత్యవసరంగా విమానాన్ని దింపి ప్రాణాలతో బయటపడింది. విమానం దెబ్బతిన్నా, ఆమె మాత్రం భయంతో కాకుండా, చిరునవ్వుతో విమానం నుంచి బయటకు రావడం విశేషం. ఆ చిరునవ్వే ఆమె విజయానికి నిజమైన గుర్తుగా నిలిచిపోయింది. అట్లాంటిక్‌ను తూర్పు నుంచి పడమరకు ఒంటరిగా విజయవంతంగా దాటిన తొలి మహిళగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. తరువాత ఆమె తన అనుభవాలను 'వెస్ట్ విత్ ది నైట్' అనే పుస్తకంగా రాసింది. ఆ రచనను ప్రముఖ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్‌వే కూడా ప్రశంసించాడు. విజయం అంటే ఎప్పుడూ గమ్యాన్ని సంపూర్ణంగా చేరుకోవడం కాదు. ప్రపంచం అసాధ్యం అని చెప్పినప్పుడు కూడా మనపై మనకు నమ్మకం ఉంచి ముందుకు సాగడం. మార్గంలో ఎదురుదెబ్బలు తగిలినా ధైర్యాన్ని కోల్పోకపోవడం. ఎదురుగాలులను చూసి వెనక్కి తిరిగినవారు సాధారణంగా మిగిలిపోతారు. అదే ఎదురుగాలుల వైపే ఎగిరినవారే చరిత్రలో నిలిచిపోతారు. బెరిల్ సాహసయాత్ర ఈ విషయాలను గుర్తుచేస్తూనే ఉంటుంది.



# 'సర్' గడువు పొడిగించాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్




**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) గడువును కనీసం మూడు నెలల పాటు పెంచాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ సుమారు 25 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో జరుగుతోందని, దీనిపై సాధారణ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు సరైన అవగాహన కల్పించడంలో ఎన్నికల సంఘం అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) ఇళ్లకు పంపిణీ చేసిన ఫారాలలో కేవలం 15 శాతం వరకు మాత్రమే తిరిగి పూరించి అందజేశారని తెలిపారు. ఇంత తక్కువ శాతంతో గడువు ముగిస్తే లక్షలాది మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ కోసం ఓటర్లు పాత రికార్డులను (కొన్ని సందర్భాల్లో 2002 నాటి ఓటర్ లిస్ట్ వివరాలను లేదా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలను) సమర్పించాల్సి వస్తోందని, సాధారణ ప్రజలు రోజువారీ కూలీలు ఈ డాక్యుమెంట్లను తక్కువ సమయంలో సంపాదించడం కష్టంగా మారిందని అన్నారు. సర్వే కోసం బిఎల్ఓలు ఇళ్లకు వెళ్లినప్పుడు చాలా ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, ఉపాధి కోసం ప్రజలు వేరే ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల చాలా మంది ఓటర్ల వివరాల నమోదు సాధ్యం కాలేదని,ఉదయాన్నే పనులకు వెళ్లే కార్మికులు, పారిశుధ్య కార్మికులు బిఎల్ఓలను కలవలేకపోతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే బూత్ లెవెల్ అధికారులకు, ఈ కొత్త నిబంధనలు, ఫారాలను ఎలా పూరించాలనే దానిపై సరైన శిక్షణ లేదని, దీనివల్ల ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోందని, జూలై 24గా ఉన్న ప్రస్తుత గడువును కనీసం మరో 3 నెలల పాటు పొడిగించాలని, అప్పుడే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభిస్తుందన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరునికి ల్పించిన ఓటు హక్కును దూరం చేయవద్దని, అందరికీ ఎస్ఐఆర్ అవకాశం కల్పించడం ద్వారానే ఒక్కరికి ఒకే ఓటు లక్ష్యం సక్రమంగా నెరవేరుతుందన్నారు. ప్రజలందరికీ సమాన అవకాశం కల్పించేలా ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, పంజాల రమేష్, సంగి ఎలేందర్, ఓర్సు రాజు, మహ్మద్ అక్బర్‌పాషా, రాజేందర్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు


### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ పిలుపు




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేలా కేంద్రంపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణంలో జరిగిన ఎఐటియుసి 4వ జిల్లా మహాసభలకు బాలరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్మల్ పట్టణంలోని గాంధీ పార్క్ నుంచి పెన్షనర్ భవన్ వరకు వందలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి బాలరాజ్‌తో పాటు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.ఫయాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి రమేష్ సారథ్యం వహించారు. అనంతరం పెన్షనర్ భవన్‌లో సీనియర్ నాయకులు ఎస్ఎన్.రెడ్డి ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. పి.పద్మకుమారి, ఎస్‌కె.ఫయాజ్, పి.ముత్యంల అధ్యక్షతన జరిగిన మహాసభలో స్టీరింగ్ కమిటీ, తీర్మానాల కమిటీ, అర్హతల కమిటీలను సభ ఆమోదించింది. ఎస్. బాలరాజ్ ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను దోచుకుంటూ నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే 24 సమ్మెలు జరిగాయని బాలరాజ్ తెలిపారు. దేశ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకించాలని, నాలుగు కోడ్లను రద్దు చేయకపోతే రాబోయే రోజుల్లో తీవ్రమైన పోరాటాలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో నాలుగు కోడ్‌లను అమలు చేయబోమని తక్షణమే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా అంగన్‌వాడీలకు 18,000 రూపాయలు, మధ్యాహ్న భోజన కార్మికులకు 10,000 రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికులకు 58 ఏళ్ల వయసు దాటిన తర్వాత కూడా లేబర్ కార్డుల సౌకర్యం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, మెడికల్ కాంట్రాక్ట్, సివిల్ సప్లైస్, ఎయిర్ బస్ కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ ఎఐటియుసి పోరాటాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి గత మూడేళ్ల నివేదికను, జిల్లా కార్యకలాపాల రిపోర్టును సభకు సమర్పించగా, దానిపై ప్రతినిధులు చర్చించారు. ఆటో, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన, అంగన్‌వాడీ కార్మికులు రాబోయే సమ్మెలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సభలో పలు కీలక తీర్మానాలకు ఆమోదం తెలిపిన అనంతరం ఎఐటియుసి నూతన కౌన్సిల్, నూతన కార్యవర్గం, నూతన ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో నాయకులు టి.గోపి, ఎస్‌కె. లతీఫ్, పుండాలిక్, ఎస్.సాయి, చిట్యాల లక్ష్మి, ఫరాన, లక్ష్మి గంచకర్, శివాజీ, ధర్మరాజు, సందేశ్, రమాదేవి, కె.రాణి, భీమేష్, విట్టల్, రాజేందర్, సాంసంగ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి కార్మికులకు తగ్గించిన వేతనాలు ఏరియర్స్‌తో చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు గత 18 నెలలుగా తగ్గించిన వేతనాలను ఏరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 30 నుంచి 23కు తగ్గించడాన్ని కారణంగా చూపి కార్మికుల వేతనాలను రూ.11వేల నుంచి రూ.7500కు తగ్గించడం అన్యాయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఆసుపత్రి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన జిల్లా ఆరోగ్య సమన్వయ అధికారి డాక్టర్ చైతన్యగౌడ్, కార్మికులు, యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు, ఆసుపత్రి కార్మికులు వరలక్ష్మి, లింగమ్మ, అలివేల, పార్వతమ్మ, రేణుక, పొన్నమ్మ, నాగమ్మ, బాలేశ్వరమ్మ, అనిల్, గణేష్, ప్రసాద్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుకు.. రైతులకు ప్రోత్సాహం అందించాలి

### రైతు సంఘం రాష్ట కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్




**ప్రజాపక్షం /వికారాబాద్ :** ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహం అందించాలి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పశ్య పద్మ మాట్లాడుతూ ఎల్‌నిఒ ప్రభావంతో రాష్ట్రంలోని దాదాపు 63శాతం మండలాలలో లోటు వర్షపాతం నమోదు కావడంతో ఇప్పటికే రైతులు లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, కంది, మినుము, పెసర వంటి పంటలు సాగు చేయగా, ఈ పంటలు చివరిదాకా చేతికి వస్తాయన్న నమ్మకం లేదన్నారు. ఈ నేపథ్యంలో మెట్ట పంటల రైతులకు ఎకరాకు రూ.8వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, తద్వారా రైతులకు కొంతైనా వెసులుబాటు కలిగి, వారు ప్రత్యామ్నాయంగా మెట్టపంటల ద్వారా ఆహార పదార్థాలను అందించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయ మెట్ట పంటలను సాగుచేసే రైతులకు ప్రోత్సహకంగా ఎకరానికి రూ.8వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వరి పండిన పొలాలకు పంటలకు మళ్లించాలంటే అవసరమైన భూసారాన్ని పెంచడానికి రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, మెట్ట పంటలకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి అధికారులకు చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్ట పంటలన్నిటికి మద్దతు ధరలను గ్యారెంటీగా అమలు కావడానికి మార్కెట్ శక్తులను నియంత్రించాలని, మద్దతు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దైర్యంగా భవిష్యత్తులో కూడా పంటలమార్పిడి విదానాన్ని అమలు చేయడానికి వీలు గా రాష్ట్ర ప్రభుత్వం రైతు అనుకూల చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, షీర్‌మహమ్మద్, అనంతయ్య, విమలమ్మ, సావిత్రమ్మ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారులకు అనుకూలంగా కొత్త కార్మిక చట్టాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ(గుర్రంపోడు):** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ కార్మికుల పొట్ట కొడుతుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం గుర్రంపోడులో ఎఐటియుసి నల్లగొండ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11వ మహాసభలు ఈనెల 19న గుర్రంపోడులో జరుగుతాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు రేపాక లక్ష్మీపతి, మండల అధ్యక్షులు ఎస్‌కె అమీర్, ప్రధాన కార్యదర్శి జాల పెద్ద నరసింహా, ఉపాధ్యక్షులు జాల చిన్న నరసింహా, పోలేపల్లి లింగయ్య, పోలేపల్లి లాలయ్య, పగిడిమర్రి లింగయ్య, ఎస్‌కె మమ్మద్, ఎస్‌కె. ఖాసీం తదితరులు పాల్గొన్నారు.






## బిఆర్ఎస్ పాలనలో రైతులు,నిరుద్యోగులకు నష్టం

### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేది కాంగ్రెస్సే: పున్న

**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** బిఆర్ఎస్ కాలంలో 10 సంవత్సరాలలో 10 వేల మంది రైతులు చనిపోయారని,ఏకాలంలో రుణమాఫీ అంటూ ప్రజలను మోసం చేసింది బిఆర్ఎస్ కాదా అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ప్రశ్నించారు. శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను బిఆర్ఎస్ నట్టేట ముంచిందని విమర్శించారు.నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను అప్పట్లో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసిఫ్ నగర్ కాల్వ పరిధిలోని రైతాంగానికి నష్టపరిహారం అందించి కాల్వ పనులను చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బాంధవుడిగా రైతులకు రైతు భరోసా ఏకకాలంలో అందించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింత ధనంజయ్,బండపల్లి కొమురయ్య,తోటకూరి పరశురామ్, శేఖర్ బాబు,పాపారావు,భాషా పాల్గొన్నారు.

## మార్కెట్ ధర ప్రకారంగా నష్టపరిహారం

### భూనిర్వాసిత రైతుల విన్నపం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం కాలువ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెంది, భూనిర్వాసిత రైతులు మంగళవారం స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. లేదంటి భూమికి బదులుగా మరో ప్రాంతంలో భూమిని కేటాయించాలని కోరారు. నూతన భూసేకరణ చట్టం ప్రకారం తమకు న్యాయం చేయాలని, భూమిని నమ్ముకుని ఉన్న మాకు సత్వర న్యాయం అందేలా చూడాలని వినతిపత్రంలో వారు కోరారు. అతి విలువైన భూములను తాము కోల్పోతున్నామని, ప్రభుత్వం అర్థం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో చిట్యాల మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మేడి శ్రీలత శ్రీను, భూనిర్వాసితులున్నారు.

## ఎకరాకు రూ.8వేలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** ఎల్‌నివో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం ఉన్నందున మెట్ట పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సహకంగా ఎకరాకు రూ.8వేలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్లంల యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తిరుమలగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఆశించినంత వానలు పడనందున రైతులను ఆదుకోవాలన్నారు. 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనందున ప్రభుత్వం మెట్ట పంటలకు అవసరమయ్యే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తిప్పిరాల శ్రీకాంత్, ఫయాజ్, కనుక అశోక్, జంపాల మల్లయ్య, నాగులగాని మల్లయ్య, మనోజ్ పాల్గొన్నారు.



### హుజూర్‌నగర్ ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోప్పోజు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావితం వల్ల తక్కువ వర్షపాతం నమోదైందని, వరికి ప్రత్యామ్నాయ పంటలైన మెట్ట పంటలను సాగుచేసి రైతులకు ప్రోత్సహకంగా 8వేల రూపాయలను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13, 14 ,15 తేదీలలో మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టి తహసీల్దార్లకు మెమోరాండాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ అధ్యక్షులు జక్కుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, దొంతగాని సత్యనారాయణ, ఎల్లావుల రమేష్, జడ వెంకన్న, తెల్లబోయిన వీరయ్య పాల్గొన్నారు.

## కేంద్ర బృందం పరిశీలన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు మంగళవారం యరగండ్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు గ్రామంలో చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం యరగండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ వల్లంల సంతోష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కార్యదర్శి లాల్ చంద్, అండర్ సెక్రటరీ రాజీవ్ రాణా,అసిస్టెంట్ డైరెక్టర్ నీతూ,జాయింట్ కమిషనర్ శేషకుమార్,ఎస్‌బీఎం డైరెక్టర్ మురళి, నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రేమకరణ్ రెడ్డి,డిఆర్ఓ వై. శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



# సహకార సంఘాలకు రవాణా భారం

### మార్క్‌ఫెడ్ నిర్ణయాన్ని విభేదిస్తున్న పాలకవర్గాలు

### ఎరువుల అమ్మకాల నిలుపుదలకు నిర్ణయం

### ఎరువుల పంపిణీపై ప్రతిష్టంభన...!?



**ప్రజాపక్షం/సూర్యాపేట :** వ్యవసాయ సహకార సంఘాలపై ఎరువుల రవాణా భారం పడింది. ఇంత కాలం రవాణా చార్జీ లేకుండా ఉచితంగా ఎరువులను సరఫరా చేసిన మార్క్‌ఫెడ్ సంస్థ ఈనెల 9వ తేది నుండి రవాణా చార్జీలు చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ నిర్ణయాన్ని సహకార సంఘాలు విభేదిస్తున్నాయి. దీనితో సహకార సంఘాలు ఎంఆర్‌పి ధరలకు ఎరువులు అమ్మితే తమకు నష్టం వస్తుందని ఇక ఎరువులు అమ్మలేమంటూ చేతులెత్తేసిన పరిస్థితి. ఉన్న నిలువల వరకు ఎరువులు అమ్మకాలు జరుగుతామని చెప్పకనే చెబుతున్నారు. అవసరమైన ఎరువుల కోసం పెట్టిన ఆర్డర్లను రద్దు చేసుకుంటున్నారు. దీంతో రానున్న రెండు, మూడు రోజుల్లో ఎరువుల పంపిణీలో ఆటంకం కలగనుంది.

సూర్యాపేట జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాలు 37 ఉండగా వీటితోపాటు డిసిఎంఎస్, హాకా, రైతు సేవా కేంద్రాలతోపాటు ప్రైవేట్ డీలర్లతో కలిపి 400కు పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. రైతులకు అవసరమైన ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా సరఫరా చేసుకొని అమ్మకాలు జరుపుతున్నారు. ప్రైవేట్ డీలర్ల నుండి మార్క్‌ఫెడ్ సంస్థ రవాణా చార్జీలను మొదటి నుండి వసూలు చేస్తుండగా ప్రాథమిక సహకార సంఘాలకు, డిసిఎంఎస్, హాకా, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసే ఎరువులకు ఎలాంటి రవాణా చార్జీని వసూలు చేయడం లేదు. వీరికి ఉచిత రవాణా చేయడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు అమ్ముతున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం యూరియా బస్తా ఒక్కంటికి ప్రభుత్వ ధర రూ.266.50 పైసలు ఉండగా ఆ ధరకే అమ్ముతున్నారు. కమీషన్ రూపంలో బస్తాకు రూ.12 లు వస్తుందని ఇందులో నుండే దిగుమతి చార్జీలు హమాలీలకు చెల్లించడంతో తమకు బస్తాకు కేవలం రూ.6 లే మిగులుతుందని సహకార సంఘాల ఉద్యోగులు చెబుతున్నారు.

**లారీ లోడ్‌కు రూ.15వేల నుండి 25వేలు భారం...**

ఎరువులు రవాణా చార్జీలు ఇక నుండి సహకార సంఘాలు ఈనెల 9వ తేదీ నుండి చెల్లించాలని మార్క్‌ఫెడ్ సంస్థ ఉత్తర్వులు జారీ చేయడంతో సహకార సంఘాల సభ్యులు ఒక్కసారిగా కంగుతిన్నారు. తమకు ఉచితంగా ఎరువుల రవాణా చేయకుంటే లారీ లోడ్‌కు రూ.15వేల నుండి రూ.25వేల వరకు అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు చార్జీ కలుపుకొని తాము ఎరువుల బస్తాలు అమ్మలేమని ఒక యూరియా బస్తా అమ్మాలంటే (ట్రాన్స్‌పోర్టు దూరాన్ని పరిగణలోకి తీసుకుంటే) రూ.300 నుండి రూ.325 వరకు అమ్మాల్సి వస్తుందని చెబుతున్నారు. ఎంఆర్‌పి ధరలకే అమ్మితే బస్తాకు రూ.30 నుండి రూ.50వరకు అదనపు భారం తమపై పడుతుందని వాపోతున్నారు. ఎరువుల అమ్మకాల నిలుపుదలకు నిర్ణయం మార్క్‌ఫెడ్ ఉత్తర్వులతో ఎరువుల అమ్మకాలను నిలుపుదలకు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు నిర్ణయాలు తీసుకున్నాయి. యూరియా కోసం ఇప్పటికే ఆర్డర్లు పెట్టిన సహకార సంఘాలు వారు వాటిని రద్దు చేసుకుంటున్నారు. నిల్వలు ఉన్నంత వరకే అమ్మకాలు జరుపుతామని చెబుతున్న పరిస్థితి. రెండు, మూడు రోజుల్లో ఉన్న నిల్వలు కూడా అయిపోతే పరిస్థితి ఏంటన్నది అంతుచిక్కడం లేదు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల నుండి కాకుండా రైతులు అత్యధికంగా సహకార పరపతి సంఘాల నుండే ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. వీరు ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తే ప్రతిష్టంభన తప్పదు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే రైతులకు ఎరువుల కష్టాలు తప్పవు.



## బాధితుడితో పోలీసులు మర్యాదపూర్వకంగా సహకరించాలి

### భువనగిరి డిఎస్‌పి బి. రవీందర్

**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించినప్పుడే పోలీసుల పట్ల విశ్వాసం, గౌరవం పెరుగుతుందని భువనగిరి డీఎస్పీ బి. రవీందర్ తెలిపారు. మంగళవారం భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్లను సందర్శించి స్టేషన్ల పనితీరు, రికార్డులు, పెండింగ్ కేసులు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటీషనర్, బాధితుడితో పోలీసులు మర్యాదపూర్వకంగా, సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. అలాగే, పోలీసు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సమాజంలో పోలీస్ శాఖకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించిన డీఎస్పీ, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.రమేష్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, అలాగే మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు ముత్తని అంతరెడ్డి(53) మంగళవారం 3 గంటల సమయంలో తన పొలంలో మోటారు ఆగిపోవడంతో కొంత దూరంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు పోవడంతో ఏబి స్విచ్ ఆఫ్ చేసి మరళ ఫీజు సరిచేసి స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మెడకు 11కేవి వైరు తగిలి అక్కడికక్కడే మరణించాడు. అంతిరెడ్డి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతునికి కుమార్తె ఉన్నట్లు తెలిపారు.



## హమాలీల హక్కుల కోసం పోరాడిన నాయకుడు నర్సింహ

**ప్రజాపక్షం/రామన్నపేట :** ఏఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగె నరసింహ ఆశయాలను కొనసాగిస్తూ, కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐటియుసి జాతీయ నాయకుడు ఉజ్జిని రత్నాకరావు పిలుపునిచ్చారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ప్రాంగణంలో గొరిగె నర్సింహ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గొరిగే నరసింహ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ గొరిగే నరసింహ జీవితాంతం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నిజాయితీపరుడైన ఉద్యమ కార్మిక నాయకుడని కొనియాడారు. సివిల్ సప్లై హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, కార్మిక ఉద్యమంలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మరింత బలంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించి వేస్తుందని ఆయన ఆరోపించారు.కార్మికుల వర్గానికి సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బత్తుల సత్యం అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్,జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్ కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సివిల్ సప్లై యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీనివాస్,సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ,సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్,పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, రామన్నపేట సివిల్ సప్లై గోడౌన్ ఇన్చార్జి కుసుమ, డిఈఓ ఊర్మిళ, సివిల్ సప్లై హమాలి యూనియన్ నాయకులు గొరిగే శంకరయ్య పాల్గొన్నారు.




## అన్ని వర్గాల అభ్యున్నతి.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం

### పనుల పురోగతి సమీక్షలో ఎమ్మెల్యే కుంభం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అన్ని వర్గాల అభ్యున్నతి, సమగ్ర అభివృద్ధే ధ్యేయమని పోచంపల్లిని అన్ని రకాలుగా ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని నిధుల కేటాయింపులో పెద్దపీట వేస్తూ ప్రజల ఆకాంక్షల మేరకు పని ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ఎండిఏ ద్వారా నియోజకవర్గానికి రూ.56 కోట్ల నిధులు తీసుకువచ్చామని, అందులో భాగంగా పోచంపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పునరుద్ఘాటించారు.చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవించే నేత కార్మికుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పాటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్స్, శ్మశానవాటికల అభివృద్ధి, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పన, అమృత్ పథకం కింద రిజర్వాయర్ నిర్మాణం వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.7.90 కోట్ల నిధులు కేటాయించామని, చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోచంపల్లి పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు హెచ్ఎండిఏ అధికారులు పబ్లిక్ హెల్త్, ఎలక్ట్రిసిటీ, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం

### అధికారులకు కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లా ప్రజలకు మెరుగైన, నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్జరీ, ఈఎన్‌టీ, లాపరోస్కోపీ, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పాథాలజీ, జనరల్ సర్జరీ, బ్లడ్ బ్యాంక్, నేత్ర వైద్యం (ఆఫ్తాల్మాలజీ) తదితర విభాగాల పనితీరు,అవసరమైన పరికరాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన నాణ్యమైన సర్జికల్ పరికరాలు, ఆధునిక వైద్య ఉపకరణాలు కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అవసరమైన అన్ని సదుపాయాలను దశలవారీగా కల్పిస్తా మని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాహుల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జి. సత్యనారాయణ, డీసీహెచ్ మాత్రు నాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ జయలత,డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుంధతి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమేష్,హెచ్ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 27వ వార్డులో సర్ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి రోజు కనీసం 2500 ఫా రాల లక్ష్యంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా పెండింగ్ ప్రక్రియను పూర్తి చే యాలని ఆదేశించారు. ఓటర్లు సకాలంలో ఫారాలు పూర్తి చేసి అందజేసేలా చ ర్యలు తీసుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. బిఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఫారం నింపాలని ఆదేశించారు. ఓటర్ల సంతకాలను చెక్ చేసుకోవాలని, మ్యాపింక్ కరెక్ట్‌గా చేయాలన్నారు.

## వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని, రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైన ప్రస్తుత పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా మెట్ట పంటలు సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు ఎకరానికి రూ.8 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఈ మేరకు మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రైతులు పత్తి, ఇతర మెట్ట పంటల సాగు ప్రారంభించినప్పటికీ విత్తనాల మొలక శాతం గణనీయంగా తగ్గిపోయిందని తెలిపారు. దీంతో తిరిగి విత్తనాలు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో మెట్ట పంటలకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో గువ్వల మట్టయ్య, ఎస్‌కె.రహీం, వెంకటేశ్వర్లు, మట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' కథనానికి కదిలిన అధికార యంత్రాంగం

### లక్ష్మి దేవమ్మ దీనగాథకు చలించిన ఎమ్మెల్సీ సత్యం

### రేషన్ కార్డు పునరుద్ధరణకు ఆర్‌డిఒ ఆదేశాలు -తహసీల్దార్ స్పందనతో దరఖాస్తు చేసిన అంధురాలు



బతికుండగానే చనిపోయిందంటూ రేషన్ కార్డు రద్దు..

ఆసరా పింఛన్ మాత్రం వస్తోంది...ఏడాదిగా రేషన్ బియ్యం దూరం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అంధురాలైన లక్ష్మి దేవమ్మ దీనగాథ.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

**పజాపక్షం/నల్లగొండ :** చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అంధురాలు లక్ష్మి దేవమ్మ బతికుండగానే మరణించినట్లు నమోదు చేసి రేషన్ కార్డును రద్దు చేయడంతో ఏడాదికాలంగా ప్రభుత్వ రేషన్ బియ్యానికి దూ రమైన విషాద గాథపై ప్రజాపక్షం దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది.ఈకథనాన్ని చదివిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వెంటనే స్పందించి నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డికి ఫోన్ చేసి లక్ష్మి దేవమ్మ పరిస్థితిని వివరించారు. బతికే ఉన్న వ్యక్తిని మృతురాలిగా నమోదు చేసి రేషన్ కార్డు రద్దు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొం టూ, ఆమె రేషన్ కార్డును తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

ఎమ్మెల్సీ సత్యం సూచనల మేరకు స్పందించిన ఆర్‌డిఓ అశోక్ రెడ్డి చిట్యాల తహసీల్దార్ మారనేని విజయ్ కుమార్ ను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి, రేషన్ కార్డు పునరుద్ధరణ కోసం లక్ష్మి దేవమ్మతో దరఖాస్తు చేయించారు.ఆమె దరఖాస్తును స్వీకరించి,నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. గమనార్హమైన విషయం ఏమిటంటే, లక్ష్మి దేవమ్మకు ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ మాత్రం ప్రతి నెలా సక్రమంగా వస్తుండగా, అదే ప్రభుత్వ రికార్డుల్లో ఆమెను మృతురాలిగా నమోదు చేసి రేషన్ కార్డును రద్దు చేయడం తీవ్ర నిర్లక్ష్యంగా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఏడాదికాలంగా ఆమె ప్రభుత్వ రేషన్ బియ్యానికి దూరమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజాపక్షం కథనం వెలుగులోకి తీసుకురావడంతో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## వర్షాల కోసం ఎదురుచూపులు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ఈ ఏడాది వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమైనప్పటికి గోవిందరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బోరుబావులు నీటిపై ఆధారపడి వరి నాట్లు ప్రారంభించారు వర్షాల కోసం ఎదురుచూడకుండా సాగు పనులను వేగవంతం చేస్తూ పోలాల్లో నాట్లతో రైతులు బిజీగా కనిపిస్తున్నారు మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే నారుమడులు సిద్ధం కాగా బోరుబావుల ద్వారా నీటిని అందిస్తూ వరి నాట్లు చేపడుతున్నారు వ్యవసాయ కార్మికులతో కలిసి రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాట్ల పనుల్లో నిమగ్న మవుతున్నారు వర్షాలు ఆలస్యమవుతుండటంతో పంట కాలం మరింత వెనక్కి వెళ్లకుండా ముందుస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నామని రైతులు మెబుతున్నారు అయితే బోరుబావులపై పూర్తిగా ఆధారపడటం వల్ల విద్యుత్ సరఫరా డీజిల్ ఖర్చులు భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి త్వరలోనే విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు కుంటలు నిండితే సాగుకు మరింత ఊరట లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు వ్యవసాయ అధికారులు కూడా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచిస్తున్నారు ప్రస్తుతం మండలంలోని పలు ప్రాంతాల్లో బోరుబావుల కింద వరి నాట్లు కొనసాగుతుండగా మంచి వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు నేర్కొంటున్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/జనగామ:** అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలని, పెండింగ్ ధరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను కోరారు. మంగళవారం జనగామ పట్టణం, మండలానికి చెందిన 39 మందికి కళ్యాణలక్ష్మి పథకం చెక్కులు అందగా వాటిని మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఆలస్యం జరుగుతుందని, అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. తాను స్వయంగా తహాశీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్ కార్యాలయ అధికారులతో చర్చించి పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు ఆలస్యం కాకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో తాను అధికారులతో మాట్లాడడం జరుగుతుందన్నారు.ఈ పథకం వలన పేద ప్రజలకు న్యాయం జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ మహిపాల్‌రెడి, పలువురు వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నేర నియంత్రణలో రాజీపడొద్దు: ఎస్‌పి




**ప్రజాపక్షం/ములుగు:** జిల్లాలో నేరాల నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్‌పి కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపిఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనాల నియంత్రణ కోసం గస్తీ విధులను మరింత పెంచాలని, ముఖ్యంగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించి, వారి భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామస్థాయిలో బలమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, జిల్లా వ్యాప్తంగా తరచూ వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. యువత గంజాయి వినియోగానికి అలవాటుపడుతున్న ప్రాంతాలు గుర్తించి ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. అరైవ్...అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని, మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్‌పి మనన్ భట్, అదనపు ఎస్‌పి సదానందం, డిఎస్‌పి కిషోర్ కుమార్, ములుగు డిఎస్‌పి రవీందర్, సిఐలు, ఎస్ఐలు, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## 20 లోపు 'సర్' పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈ నెల 20 లోగా ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఘన్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా 306 పోలింగ్ కేంద్రంలో పరిధిలో బీఎల్ఓ గీత నిర్వహిస్తున్న నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తూ, రోజువారీ నమోదు వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన నమోదు ప్రక్రియను రానున్న ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను ఎన్నికల సంఘం యాప్ ద్వారా సులభంగా ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాభితా పారదర్శకత కోసం మరణించిన వారు, వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ డిడి డా॥ కుమారస్వామి, వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవల నాణ్యత పెంపునకు అధికారులు 'ఎఐ'ని వినియోగించాలి



ఎఐతో పరిపాలన మరింత వేగవంతం, సమర్థవంతం: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రభుత్వ పరిపాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం ద్వారా కార్యనిర్వహణను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో టీఫైబర్ సహకారంతో ప్రభుత్వ అధికారుల సామర్థ్యాభివృద్ధి లక్ష్యంగా పరిపాలన సామర్థ్య పెంపునకు కృత్రిమ మేధస్సు (ఏఐ) అంశంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ పరిపాలనలో వినియోగించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. రోజువారీ కార్యాలయ కార్యకలాపాల్లో ఏఐ సాధనాలను సమర్థవంతంగా ఉపయోగిస్తే తక్కువ సమయంలో నాణ్యమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ఒక అధికారిక లేఖను రూపొందించడానికి గతంలో ఎక్కువ సమయం పట్టేది. అయితే ఏఐ సాధనాల సహాయంతో అదే పనిని కొద్ది నిమిషాల్లో పూర్తి చేయవచ్చని అన్నారు. అలాగే ఆకర్షణీయమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, అధికారిక నివేదికలు, సమావేశాల మినిట్స్, కార్యాలయ లేఖలు, పత్రాల సంక్షిప్తీకరణ, అనువాదాలు వంటి అనేక పనులను సులభంగా నిర్వహించవచ్చని వివరించారు.ఏఐ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని, పనిని వేగవంతం చేసే సహాయక సాధనం అని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారుల సామర్థ్యాన్ని మరింత పెంచి, సమయాన్ని ఆదా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఇటీవల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్స్ వెండింగ్ జోన్ ఏర్పాటు కోసం రూపొందించాల్సిన డీపీఆర్ కు కన్సల్టెన్సీ సంస్థలు భారీ మొత్తంలో రుసుము కోరిన సందర్భంలో, ఏఐ సాధనాల ద్వారా అవసరమైన సమాచారాన్ని విశ్లేషించి ఉచితంగా డీపీఆర్ రూపొందించగలిగామని తెలిపారు. దీనివల్ల సాధారణంగా వారం రోజుల సమయం పట్టే పనిని కొద్ది గంటల్లో పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులను కూడా ఆదా చేయగలిగామని చెప్పారు.ఈ శిక్షణలో భాగంగా చాట్‌జీపీటీ, గూగుల్ నోట్ బుక్ ఎల్ఎమ్, క్లాడ్ తో పాటు మొత్తం 15 అధునాతన ఏఐ ఆధారిత ఉత్పాదకత సాధనాల వినియోగంపై శిక్షణ అందించారు.అధికారిక లేఖల తయారీ, సమావేశాల మినిట్స్ రూపొందించడం, పత్రాల సంక్షిప్తీకరణ, ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువాదం, వచనాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, వర్డ్ పత్రాలుగా రూపొందించడం, సమాచార సేకరణ (రిసెర్చ్), డేటా విశ్లేషణ, రోజువారీ కార్యాలయ పనులను స్వయంచాలకంగా నిర్వహించే విధానాలపై పాల్గొన్న అధికారులకు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు.శిక్షకులు వాసుదేవన్ నటరాజన్, ధీరజ్ ఏఐ సాధనాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహిస్తూ, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిపాలనా వ్యవస్థలో వాటి వినియోగం, ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ అధికారులు తమ రోజువారీ విధుల్లో ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. ఏఐ ఆధారిత సాధనాల ద్వారా వేగవంతమైన నిర్ణయాలు, మెరుగైన పత్రాల నిర్వహణ, పునరావృత పనులకు వెచ్చించే సమయం తగ్గడం, ఖచ్చితత్వం, ఉత్పాదకత పెరగడం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 250 మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు పాల్గొని కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతను ప్రభుత్వ పరిపాలనలో వినియోగించే విధానాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఈడీఎం శ్రీధర్, కలెక్టరేట్ ఏవో గౌరీశంకర్, డి సెక్షన్ సూపరింటెండెంట్ నాగరాజు, పలువురు జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గన్నారపు రమేష్‌ను పరామర్శించిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** సిపిఐ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ను సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు మంగళవారం పరామర్శించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయ సారధి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాసు మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, నాయకులు దండు లక్ష్మణ్, ఓర్సు రాజు,ఎండి అక్బర్ బాషా తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. గన్నారపు రమేష్ మాతృమూర్తి గన్నారపు సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఖిలా వరంగల్ లోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా మానుకోట: ఎమ్మెల్యే మురళీనాయక్

రూ.30కోట్లతో 6 నుంచి 12వ తరగతి వరకు భవన నిర్మాణం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మానుకోటను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.30కోట్ల వ్యయంతో బాలబాలికలకు హైస్కూల్ స్థాయి నుంచి 12వ తరగతి వరకూ ఆధునిక వసతులతో కార్పోరేట్ విద్యను అందించే లక్ష్యంతో భవన నిర్మాణాలు మంజూరైనట్లు మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులను ద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, డిసిసి అధ్యక్షురాలు ఉమామురళీనాయక్, విద్యార్థినీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ మాట్లాడుతూ గత 110సంవత్సరాల క్రితం 1917లో నైజాం కాలంలో నిర్మించిన జూనియర్ కళాశాల భవనం శిధిలావస్థకు చేరుకుందని, ఇందులో ఎంతో మంది చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారని, ఎమ్మెల్యేలుగా మంత్రులుగా, కలెక్టర్లుగా, ఉన్నత స్థానాలు అధిరోహించారని, ఇప్పటికి ఈ కాలేజీలు ఆధునిక వసతులు కల్పించే రీతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి సహకారంతో రూ.18కోట్లు మంజూరు చేసి ఓకే కాంపౌండ్‌లో సుమారు 6ఎకరాల స్థలంలో బాలికల, బాలుర కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పటిష్టపర్చే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి, వార్డు కౌన్సిలర్ రవినాయక్, పూర్వ విద్యార్థులు మైస శ్రీనివాస్, డాక్టర్ డోలి సత్యనారాయణ, ఘనపురపు అంజయ్య, రిటైర్డ్ పిడి వంగ రామన్న, కళ్యం వీరారెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పొక్కుల సదానందం, మదార్, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్ తదితరులు విద్యార్థులను ఉద్దేశించి కళాశాల అభివృద్ధిపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాటా భాస్కర్, చీదిరాల జ్ఞానేశ్వర్, బోళ్ళ రాజు, ఖలీల్, బోనగిరి గిరిధర్‌గుప్త, నాళ్ళ నర్సింహారావు, నజీర్, విజయలక్ష్మి, సిరిపురం వీరన్న, సత్యమ నోరమ, లక్ష్మినారాయణ, మొగిలి ప్రసాద్, సాయి, గోనె శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలు వ్యాపార రంగాల్లో రాణించాలి

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** మహిళా సంఘాలు వ్యాపార రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. పొదుపుకే పరిమితం కాకుండా వ్యాపార రంగాల్లో రాణించడం వలన ఎక్కుల ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం జల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్త్రీనిధి రుణాలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రబీ సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్ధవంతంగా నిర్వహించి జిల్లా రికార్డు స్థాయిలో 2లక్షల 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యానిన సేకరించినందుకు ఐకెపి మహిళా సంఘముల సభ్యులను అభినందించారు. రానున్న సీజన్‌లో మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మహిళా సంఘాలకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా సంఘాల ఆర్ధక అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న మన శ్రీనిధి మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ యాఫ్ ద్వారా రుణాలు, ఈఎంఐ చెల్లింపులకు సులభంగా పారదర్శకంగా నిర్వహించుకుకోవచ్చునని తెలిపారు. జిల్లాలో ఐకెపి మహిళా సంఘాలు చక్కగా పని చేస్తున్నారని, భవిష్యత్తులో మరింత మెరుగ్గా పనిచేయాలన్నారు. రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు గ్యాస్ స్టేషన్లు, సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ పిడి భాస్కర్, ఏపిడి నూరుద్దీన్, స్త్రీనిధి జోనల్ మేనేజర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, స్త్రీనిధి డైరెక్టర్, సెర్ప్ సిబ్బంది, మండల సమాఖ్య సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.

## 'సర్'లో ప్రజల భాగస్వామ్యం అవసరం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. జిల్లాలోని 2,36,970 మంది ఓటర్లలో ఇప్పటి వరకు 1,46,583 ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా, 61.86 శాతం పురోగతి నమోదైందని తెలిపారు. ఇంకా 82,994 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలి ఉందన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, పూర్తిగా నింపిన ఫారాలను సేకరించాలని సూచించారు. ఇంటికి తాళం వేసి ఉంటే మరోసారి వెళ్ళి ఫారాలు తీసుకోవాలని ఆదేశించారు. సేకరించిన ఫారాలను రోజువారీగా బిఎల్ఓ యాప్‌లో నమోదు చేసి పెండింగ్ లేకుడా డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. బిఎల్ఓలు, బిఎల్ఏలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు కూడా తమ వివరాలను సరిచూసుకుని ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి అవసరమైన పత్రాలతో నిర్ణీత గడువులోపు సంబంధిత బిఎల్ఓలకు అందించాలని కోరారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉన్న ఏ ఓటరినీ ముందస్తు నోటీసు లేకుండా తొలగించరని కలెక్టర్ స్పష్టం చేశారు. అపోహలకు తావివ్వకుండా ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి అన్నారు. బుధవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వార్డు లో రిటైర్డ్ ఉద్యోగుల ఆఫీస్ లో సిపిఐ స్థానిక 33 వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను విన్నపించారు. అనంతరం సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీఇచ్చారు. వారికి రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఉద్యమాలు బరోసా ఇచ్చారు. అలాగే 33 వ వార్డులో గల రిటైర్డ్ ఉద్యోగుల ఆఫీస్ ఏరియాలో ఎటువంటి సమస్యలున్న పరిష్కరిస్తానని భవిష్యత్తులో విశ్రాంత ఉద్యోగస్తుల కోసం మంచి భవన నిర్మాణానికి తమ వంతు కృషి అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగ సంఘ నేతలు మైస నాగయ్య, వెంకటరెడ్డి, ఈశ్వర్ లు మాట్లాడుతూ మానుకోట పోరాటాల్లో దిక్సూచి అజయ్ సారధి రెడ్డి అన్నారు. ఉద్యమం అంటే గుర్తుకొచ్చేది బి అజయ్ సారధి రెడ్డి అని ప్రశంసల వర్షం కురిపించారు. హ్యాట్రిక్ విజయం సాధించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా బి అజయ్ సారధి రెడ్డి ఉన్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ నేతలు మైస నాగయ్య, ఈశ్వర్ కుమార్, వెంకటరెడ్డి, సంకబద్రి నారాయణ, రఘుపతి, గస్కంటి నారాయణ, నాగేందర్, వెంకటయ్య, సోమయ్య, విజయ్ కుమార్, మల్లయ్య, బొడ్ల వెంకటయ్య, రామచంద్రు ,వెంకటేశ్వరరావు, ప్రసాద్ రావు, రంగారెడ్డి, రాములు చంద్రయ్య, పెరుగు కుమార్, బిర్రు సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం తరపున వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన బాల బాలికలకు ప్రతి ఏటా ప్రధానం చేస్తున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు ఔత్సాహిక బాల బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026–27 సంవత్సరానికి గాను అందించనున్న రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులను ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని, 18 ఏళ్లలోపు బాల బాలికలు ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ మరియు టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరచిన బాలల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన వారు తమ దరఖాస్తులను జూలై 31,లోపు ఆన్ లైన్లో http://awards.gov.in వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.మరిన్ని వివరాలకు (సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం( జి1, జి 2) లో సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ పేర్కొన్నారు.

## ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

గూడూరులో రూ 10.44 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

20.898 కిలోల గంజాయి మొబైల్స్ స్వాధీనం



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీసులు అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణాను భగ్నం చేశారు.రూ 10.44 లక్షల విలువైన 20.898 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందుతును అరెస్టు చేసినట్లు గూడూరు సీఐ వినయ్ కుమార్ తెలిపారు.విశ్వసనీయ సమాచారం మేరకు గూడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పంచుల సమక్షంలో బ్రహ్మణపల్లి గ్రామ పరిసరాల్లో వాహనాలు అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు నిర్వహించారు. ఈసందర్బంగా అనుమానాస్పందంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న మూడు బ్యాగులను తనిఖీ చేయగా మొత్తం 20.898 కిలోల గంజాయి లభించింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ 10.44.900 ఉంటుందని పోలీసులు వెల్లడించారు.అరెస్టు చేసిన నిందుతులు గురు లోకనాథ్ పాత్రా (39) షాపుర్ సూరత్( గుజరాత్) ఇజ్రాయిన్ ఖాసీం సంద్వాని(32) పుల్వాడి సూరత్ (గుజరాత్) గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రంలోని బెరహంపూర్ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రంలో సూరత్ నగరానికి అక్రమంగా తరలించి విక్రయించేందుకు తీసుకెళ్లున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో గంజాయితో పాటు మూడు బ్యాగులు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని నిందితులపై ఎన్‌డిపీఎస్ (ఎన్ డిపిఎస్) చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాపు కొనసాగిస్తున్నట్లు సీఐ వినయ్ కుమార్ వెల్లడించారు. అంత రాష్ట్ర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు మరింత నిఘా పెంచినట్లు ఆయన తెలిపారు.

## 'సర్' ప్రక్రియలో రేషన్ డీలర్లు సహకరించాలి: అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియను పూర్తి చేయడంలో జిల్లాలోని రేషన్ డీలర్లు సహకరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని హనుమకొండ, కాజీపేట, హసన్ పర్తి మండలాల రేషన్ డీలర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడంపై జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ఓటర్లకు గణన ఫారాలనుఅందించారని, ఓటర్లు పూరించిన ఫారాలను తిరిగి బీఎల్వోలకు అందించడంలో రేషన్ డీలర్లు సహకరించాలని అన్నారు. తమ పరిధిలో ఉన్న ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనే విధంగా రేషన్ డీలర్లు సహకరించాలన్నారు. రెండు చోట్ల ఓట్లు కలిగి ఉండడం కూడా చట్ట ప్రకారం తీసుకునే చర్యలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియని జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయడంలో అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు రమేష్ బాబు, మోహన్, ఆయా మండలాల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

12
ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
15-07-2026
www.prajapaksham.in

"ఫహాద్ ఫాజిల్ హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్స్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్.కార్తికేయ నిర్మించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు."

రీల్




## 'రా ఎన్‌టిఆర్'తో సంబంధం లేదు

జూనియర్ ఎన్‌టిఆర్ ప్రకటన

'రా ఎన్‌టిఆర్' పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు, సదరు వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని జూనియర్ ఎన్‌టిఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ రాజకీయ పార్టీ పెడుతున్నారని వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'రా ఎన్‌టిఆర్' అనే సంస్థతో , ఆ సంస్థ చేసే కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం, అనుబంధం, ఎన్‌టిఆర్ నుంచి అనుమతి కూడా లేదని ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ సంస్థకు గాని, ఆ వ్యక్తికి గాని ఎన్‌టిఆర్ తరఫున ప్రాతినిధ్యం వహించే హక్కు లేదని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ పేరుతో ఆ సంస్థ కార్యక్రమాలు చెయ్యడానికి , ఎన్‌టిఆర్ పేరును వాడుకోడానికి ఎలాంటి అధికారము అతనికి ఇవ్వలేదని అన్నారు. ఎన్‌టిఆర్‌కు సంబధించిన ఏ అంశం అయినా అధికారికంగానే తెలియజేస్తామని చెప్పారు. ఇలాంటి గుర్తు తెలియని వ్యక్తులు ప్రకటనలు చేస్తే నమ్మొద్దని అన్నారు. ఇలాంటి పుకార్లు వచ్చినపుడు దయచేసి మీడియా ఎన్టీఆర్ కు సంబధించిన అధికారిక వ్యక్తులను సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

## ఆడబిడ్డ కన్నీటి కథ 'వెంకట్రామయ్య గారి తాలూకా'

'ప్రీ రిలీజ్ ఈవెంట్'లో నిర్మాత కోమలి



ప్రముఖ జానపద గాయని కోమలి నిర్మాతగా మారుతూ నిర్మించిన కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ధినేష్ కుమార్ హీరోగా, ఈ టీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ , సోమేష్ సారిపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫోక్ సింగర్ కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని ప్రశంసించారు. సినిమా ఘనవిజయ ం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. తెలంగాణలో చిన్న సినిమాల అభివృద్ధికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలుగు సినిమా మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రధాన పాత్రధారి మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ తన సినీ జీవితంలో ఎంతో కాలంగా చేయాలనుకున్న పాత్ర ఈ చిత్రంలో లభించిందన్నారు. 'డీజే టిల్లు' తర్వాత తనకు అత్యంత సంతృప్తినిచ్చిన పాత్ర ఇదేనని చెప్పారు. వెంకట్రామయ్య పాత్రలో నటిస్తున్నప్పుడు గ్లిజరిన్ అవసరం లేకుండానే భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. ఈ సినిమా ప్రతి ఒక్కరి గుండెను తాకుతుందని, మానవ సంబంధాల విలువను గుర్తు చేస్తుందని అన్నారు. నిర్మాత కోమలి మహేందర్ తొలిత మాట్లాడుతూ ఇది తన నిజ జీవిత అనుభవాల ఆధారంగా రూపొందించిన చిత్రమని తెలిపారు. ఇది ఒక ఆడబిడ్డ కన్నీటి కథ. నా జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ చిత్రంగా మలిచాను. 17న ప్రతి ఒక్కరూ థియేటర్లకు వచ్చి మా సినిమాను చూసి ఆశీర్వదించాలని ఆమె కోరారు. సీనియర్ నటి సుధ , సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడారు. దర్శకుడు సతీష్ ఆవాల, హీరో దినేష్ కుమార్ ,హీరోయిన్ దివిజ ప్రభాకర్ , నటి జబర్దస్త్ సత్యశ్రీ పాల్గొన్నారు.



## యాక్టింగ్ పరంగా సంతృప్తిగా ఉంది

నభా నటేష్

హీరోయిన్ నభా నటేష్ తెలుగు తెరపై సక్సెస్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల విడుదలైన నాగబంధంపై భారీగా ఆశలు పెట్టుకున్న నభా నటేష్‌కు నిరాశే ఎదురైంది. కాకపోతే మంచి నటిగా పేరు వచ్చింది. టాలీవుడ్‌లో కేవలం పేరుతోనే సరిపెట్టుకుంటే కుదరదు. స్టార్‌డం రావాలంటే ఖచ్చితంగా ఒక మంచి కమర్షియల్ సక్సెస్ కెరీర్‌లో వుండలేసిందే. 'నాగ బంధం' సినిమాలో పార్వతి అనే పవర్ ఫుల్ క్యారెక్టర్ నభా నటేష్ నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. ఒకే పాత్రలో అనేక వైవిధ్యమైన భావోద్వేగాలను పలికించడం ద్వారా నభా తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకుంది. దయ, పట్టుదల, దిక్కారం, బలహీనత, భక్తి...ఇలా అనేక ఎమోషన్స్ ను తన నటనలో పలికించిన అందరి ప్రశంసలు అందుకుంటోంది. తారలకు ఇలాంటి అవకాశం రావడం అరుదు. ఆ అవకాశాన్ని తన టాలెంట్, డెడికేషన్‌తో సద్వినియోగం చేసుకుంది నభా. నాలుగు భిన్నమైన కోణాల్లో ఒకే పాత్రను పోషించి సర్ ప్రైజ్ చేసింది నభా నటేష్. అందుకే కాదు ప్రతి ఎక్స్ ప్రెషన్‌లో స్టోరీని అవి పుర్తించింది. తన పాత్ర కోసం ఆమె తీసుకున్న డెడికేషన్ ప్రూవ్ చేసుకుంటూ...ప్రేక్షకులను మైమరపించే నటనను కనబర్చింది. భారీ పాన్ ఇండియా మూవీగా దర్శకుడు అభిషేక్ నామా 'నాగ బంధం' చిత్రాన్ని రూపొందించారు. కిషోర్ అన్నపరెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించారు. విరాట్ కర్ణ హీరోగా నటించారు. 'నాగబంధం' సినిమా ప్రస్తుతం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సినిమా నభా నటేష్ కెరీర్ లో ఓ స్పెషల్ మూవీగా మిగిలిపోతుందని నభ నటేష్ అంటోంది. ప్రస్తుతం తన యాక్టింగ్ తో సంతృప్తి గానే ఉన్నానని నభ నటేష్ చెప్పింది.



## రాజమౌళి సమర్పణలో 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'

ఫహాద్ ఫాజిల్ హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్స్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్.కార్తికేయ నిర్మించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్.ఎస్ కార్తికేయ మాట్లాడుతూ 'ఫహాద్ ఫాజిల్ తో సినిమా నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మనసుకు హత్తుకునే చిత్రం. ఇకపై నుంచి రాబోయే కంటెంట్‌ని చూస్తే ఆ విషయం మీకే అర్థం అవుతుంది. 'వారణాసి' ప్రారంభం కంటే ముందే ఈ చిత్రం పూర్తి అవ్వాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల ఈ మూవీని ఆలస్యంగా స్టార్ట్ చేశాం. ఫహాద్ నా భార్య తరుపు బంధువులు. నాకు ముందు నుంచీ ఫహాద్ గారంటే ఇష్టం. ఓసారి 'పుష్ప' చిత్రీకరణ సమయంలో ఆయన్ను కలిశాం. ఆ టైంలోనే మేం కొన్ని స్క్రిప్టులు రెడీ చేస్తున్నాం. 'ఆక్సిజన్' అనే స్క్రిప్ట్ ఆయన కోసమే రెడీ చేశాం. ఇంకో స్క్రిప్ట్ కూడా ఉందని ఈ కథ చెప్పాం. ఆయనకు చెప్పిన ఫస్ట్ నెరేషన్‌లోనే 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'ని ఓకే చేశారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి జానర్‌లో సినిమా రాలేదు. ఈ చిత్రంలో చాలా విఎఫ్ఎక్స్ వర్క్ ఉంది. రాజమౌళి స్టాంప్ పడ్డ తర్వాతే స్క్రిప్ట్ లాక్ అయింది. మూవీ అంతా పూర్తయ్యాక మళ్లీ ఆయనకు చూపించి సలహాలు తీసుకుంటాం అని అన్నారు.నిర్మాత శోభు యార్లగడ్డ మాట్లాడుతూ దక్షిణాది భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేస్తున్నాం. ఇప్పటికి అయితే ప్యాన్ ఇండియా అని ప్లాన్ చేయలేదు. రిలీజ్ టైం వరకు ఏం జరుగుతుందో చెప్పలేం అని అన్నారు.దర్శకుడు శశాంక్ యేలేటి, సంగీత దర్శకుడు కాల భైరవ, చైల్డ్ ఆర్టిస్ట్ సారా పాల్గొన్నారు.

## '1=100' సినిమా టీజర్ రిలీజ్



శకుంతల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాబా మైలవరం దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం '1=100' టీజర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. వెస్ట్రన్ స్టైల్ విజువల్స్, యాక్షన్ ఎలిమెంట్స్, అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో కూడిన ఈ టీజర్ ప్రేక్షకులను, సినీ ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. అనిల్ కుమార్ వేగూరు సినిమాటోగ్రఫీ, కెన్నీ చైతన్య సంగీతం, నందమూరి హరి ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. రాజు ఎంటర్‌టైనర్స్, స్పార్కిల్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఇప్పటికే టీజర్‌కు వస్తున్న భారీ రెస్పాన్స్ తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని, త్వరలోనే సినిమా మరిన్ని వివరాలను వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కొరియోగ్రఫీ: సూర్యాస్ మాస్టర్ జోజో, ఫైట్స్: కృష్ణ ఎస్.ఎం. రాజు, డైమండ్ వెంకట్, ఆర్ట్ డైరెక్టర్: నానాజీ.

## 'మనసా మనసా' పాట విడుదల



కమిటీ కుర్రోళ్లు మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, సిద్ధార్థ్ రాయ్ సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న సినిమా 'అదే నీవు అదే నేను'. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవిందు కాండ్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. 'అదే నీవు అదే నేను' సినిమా త్వరలో థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మనసా మనసా' సాంగ్‌ను స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలోని పాటలు నచ్చి ఆదిత్య మ్యూజిక్ ఆడియో రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చింది. తమ మూవీలోని సాంగ్ లాంచ్ చేసి తమకు సపోర్ట్ చేస్తున్న వినాయక్‌కి ప్రొడ్యూసర్ గోవిందు కాండ్రేగుల, డైరెక్టర్ కొండల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ కొండల్ ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేస్తూ అదే నీవు అదే నేను సినిమా రూపొందిస్తున్నారు. ఈ మూవీ ఆయనకు మంచి పేరు తీసుకురావాలి. గోవింద్ రికి నిర్మాతగా తొలి చిత్రమిది. ప్రొడ్యూసర్‌గా గోవింద్ ఈ సినిమా విజయాన్ని అందుకుని, మరిన్ని మూవీస్ చేయాలి. మనసా మనసా సాంగ్ చాలా బాగుంది. ఈ సినిమా సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నా అన్నారు. 'మనసా మనసా' పాట ఎలా ఉందో చూస్తే ఎన్నెన్నె ఎన్నెన్నె వర్ణాలు ఉన్నా, నువు లేని వెలితేదో మిగిలున్నదే, ఇన్నాళ్లకైనా నిన్ను చూశాను అన్న ఆనందం నా సొంతమే. ఈ పాటకు పూర్ణాచారి లిరిక్స్ రాయగా, మ్యూజిక్ డైరెక్టర్ కనిష్క మంచి ట్యూన్‌తో కంపోజ్ చేశారు. టాప్ సింగర్ జావెద్ అలీ అద్భుతంగా పాడారు. త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, తన్వి నేగి, సహర్ కృష్ణన్, కల్పలత, సునయన, బిత్తిరి సత్తి, మీర్, సూర్యతేజ, నరేందర్, రమణ భార్గవ్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ నార్ని శ్రీనివాస్,పాటలు పూర్ణాచారి, మాటలు వై.అమ్మిరాజు, డిఒపి నిమ్మల జయపాల్ రెడ్డి, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, సంగీతం కనిష్క.

# వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

బిఎల్‌ఓలకు అందించి ఓటుహక్కు కాపాడుకోవాలి
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకునేందుకు వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి, బూత్ లెవెల్ అధికారులకు (బిఎల్‌ఓ)లకు అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) సి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాఫ్ట్ (ముసాయిదా) ఓటర్ల జాబితాలో పేరు నమోదు కావాలంటే ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని ఖచ్చితంగా బిఎల్‌ఓలకు అందజేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. బిఎల్‌ఓలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా వివరాలు రాయాలని, వాటిపై పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను తప్పనిసరిగా అతికించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారంలో ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఓ సంతకం కూడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకదానిని పూరించి, బిఎల్‌ఓకు ఇవ్వాలన్నారు. రెండవ ఫారాన్ని ఓటరు భవిష్యత్తు అవసరాల కోసం తమ వద్దే భద్రపరుచుకోవాలన్నారు. ఒకవేళ 2002 ఓటరు జాబితాలో మీ ఓటరు వివరాలు ఉన్నట్లయితే, వాటిని తప్పనిసరిగా ఫారంలో పేర్కొనాలని, ఆ వివరాలు లేకపోయినా ప్రస్తుత వివరాలతో ఫారాలను నింపి అందజేయవచ్చు అని తెలిపారు. రాష్ట్రంలో గత గత 25వ తేదీన ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మరో పది రోజుల్లోనే ఈ గడువు ముగియనుందని, కాబట్టి ఓటర్లు ఆలస్యం చేయకుండా ఈరోజే తమ ఫారాలను సమర్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటి వరకు కేవలం 1,66,70,610 మంది (49.28 శాతం) మాత్రమే తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించారని సిఇఓ వెల్లడించారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తక్షణమే స్పందించి బిఎల్‌ఓలకు సహకరించాలని సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# అయోధ్య అవినీతిపై సిబిఐ విచారణ జరపాలి

వి. హనుమంతరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంగారం, విరాళాల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సిబిఐతో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయోధ్య అవినీతిపై సిబిఐ విచారణ కోరుతూ ఈ నెల 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తాను మౌన దీక్ష చేపట్టనున్నానని ఎఐసిసి అగ్రనేతలు సహా అందరూ పాల్గొని మద్దతు ఇవ్వాలని కోరారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నా చిన్న జీయర్ స్వామి సహా ఇతర ఆధ్యాత్మిక ప్రముఖులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై తాను ఇప్పటికే కరీంనగర్, భద్రాచలంలో మౌన దీక్షలు చేపట్టినట్లు తెలిపారు.తిరుమలలో ప్రతి రోజు నగదు, బంగారం లెక్కలను బహిరంగంగా వెల్లడిస్తారని, అయోధ్యలో బంగారం, విరాళాల వ్యవహారంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలని అన్నారు.'మొన్నటి వరకు ఓటు చోరీ, సీటు చోరీ జరిగిందని, ఇప్పుడు రాముడి బంగారం చోరీ జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. తిరుపతి లడ్డూలో నెయ్యి నాణ్యతపై ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ చేపట్టిన సిబిఐ అయోధ్యలో బంగారం, విరాళాల వ్యవహారంలో ఎందుకు దర్యాప్తు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా స్పందించాలని కోరారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై తమకు విశ్వాసం లేదని, సిబిఐతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎసిబి సోదాలు

(మొదటి పేజీ తరువాయి)



భూమి, మోకిలలో నిర్మాణంలో ఉన్న విల్లా, కొండాపూర్ మస్జిద్ బండలో జీ+4 భవనంకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.45.05 లక్షల నిల్వలు, సుమారు 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, గృహోపకరణాలు, మొబైల్ ఫోన్లు, ఐప్యాడ ట్యాబ్లెట్లు, హార్డ్‌డిస్క్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, అలాగే ఇన్నోవా హైక్రాస్, టాటా సఫారి, ఇన్నోవా క్రిస్టా, మహీంద్రా ఎక్స్‌యూవీ సహా నాలుగు వాహనాలను గుర్తించినట్లు ఎబిసి వెల్లడించింది. అవినీతి నిరోధక చట్టం1988 (2018 సవరణలతో) లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని ప్రత్యేక ఎబిసి కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. మరిన్ని ఆస్తులకు సంబంధించిన వివరాలపై విచారణ కొనసాగుతోందని, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఎసిబి పేర్కొంది.



**రెండు లక్షలు తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ ఎఇ**

పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం మున్సిపల్ ఎఇ సతీష్ రూ.2 లక్షలు కాంట్రాక్టర్ నుంచి ఇంటి వద్ద లంచం తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికా రులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మున్సిపల్ పరిధిలో జరిగిన వర్క్ బిల్లు కోసం బత్తుల శ్రీనును రూ.4.50 లక్షలు డిమాండ్ చేయగా రెండు లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ జేడీ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు సమాచారం. దాడుల్లో కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి మహేందర్ రెడ్డి తో పాటు ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఏఈ సతీష్ ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి రూ.32 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

## సేవలందించలేం

(మొదటి పేజీ తరువాయి)

రేట్లు చాలా తక్కువగా ఉన్నాయని, వీటితో ఆస్పత్రుల నిర్వహణ ఆర్థికంగా సాధ్యం కాదని అసోసియేషన్ తెలిపింది. సీజీహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లను యథాతథంగా అమలు చేయకుండా, క్షేత్రస్థాయి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని, శాస్త్రీయ పద్ధతిలో చికిత్సా ఖర్చులను సవరించాలని కోరారు. వాస్తవిక ధరలను నిర్ణయిస్తేనే నెట్వర్క్ ఆసుపత్రులు ఈ పథకంలో భాగస్వాములు అవుతాయన్నారు. పాలక మండలితో పాటు కీలకమైన కమిటీల్లో వివిధ వైద్య విభాగాలకు చెందిన కనీసం 10 మంది నెట్వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులకు చోటు కల్పించాలని, తద్వారా విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామ్యం దక్కడంతో పాటు, సమస్యలను తక్షణమే పరిష్కరించుకునే వీలు అవుతుందని వారు వివరించారు. కొత్త పథకంలో నిర్దిష్ట కాలపరిమితితో కూడిన, పారదర్శకమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 నుంచి 80 శాతం వైద్య సేవలను నెట్వర్క్ ఆసుపత్రులే అందిస్తున్నాయన్నారు.

## జల గండం?

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాహం గోదావరి పరీవాహకంలో 2022లో నమోదైంది. 71.3 అడుగుల గోదావరి నీటి మట్టం భద్రాచలం వద్ద నమోదైంది. భవిష్యత్‌లో ఇంతకంటే ఎక్కువ వరద వస్తే పరిస్థితి ఏంటీ అనేదే ప్రజల భయం. గోదావరి వరదతో పాటు బ్యాక్‌వాటర్ తోడైతే భద్రాచలంతో పాటు గోదావరి పరివాహక పరిసర ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై స్పష్టమైన సమాధానాలు కరువయ్యాయి. ఈ అనుమానాలకు తెర దించాలంటే ప్రభుత్వాలు శాస్త్రీయమైన పద్దతుల్లో లెక్కలు తేల్చి ప్రజల ముందు ఉంచాలని పలువురు కోరుతున్నారు. పోలవరం పూర్తి జలాశయం మట్టం 150 అడుగులు(45.72 మీటర్లు), భారీవరద సమయంలో గోదావరి సహజ ప్రవాహంపై బ్యాక్ వాటర్ ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్నదే కీలకం. భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని ఉపనదులు, వాగులు, వంకలు కాలువలు, డ్రైన్‌ల నీరు గోదావరిలో సాఫీగా చేరని పరిస్థితి ఏర్పడితే లోతట్టు ప్రాంతాలు వేగంగా జల దిగ్బంధంలో చిక్కుకునే పరిస్థితి ఉందనే ఆందోళన తీవ్రంగా వ్యక్తమవుతోంది.

**ఇకకైనా మౌనం వీడాలి**

ఇప్పటికైనా కేంద్రంతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మౌనం వీడాలి. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై సమగ్ర హైడ్రాలిక్ అధ్యయనం చేపట్టి భద్రాచలానికి వాస్తవంగా ఏ మేరకు ముప్పు ఉంది. ఏపి ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎంత వరద ప్రవాహానికి ఎంత నీటి మట్టం నమోదవుతుంది అనే వివరాలు ప్రజల ముందు ఉంచాలని పలువురు కోరుతున్నారు.

## కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఆయన హైదరాబాద్‌లో ని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పద్మనాభం మృతితో రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయానికి తెరపడింది. ఆయన మరణవార్త తెలుసుకు న్న రాజకీయ ప్రముఖులు, కాపు సంఘాల నాయకులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జననం విద్యాభ్యాసం ముద్రగడ పద్మనాభం1953లో అప్పటి తూర్పు గో దావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా) కిర్లంపూడి గ్రామంలో జన్మించారు. 1978 నుంచి 1989 వరకు వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.ముద్రగడ పద్మనాభం ఎన్.టి.రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, అనంతరం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.కాపు సామాజిక వర్గానికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. పలుమార్లు నిరాహార దీక్షలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించారు.

**సిఎం, డిప్యూటీ సిఎం, ప్రముఖుల సంతాపం**

ముద్రగడ పద్మనాభం మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు, ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎపి మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు,బిఆర్ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు, బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజురవిచంద్రతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, కాపు సంఘాల నాయకులు, సామాజిక సంస్థలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభం ప్రజా సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని వారు కొనియాడారు. పద్మనాభం మృతి రాజకీయ రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు.

## తీవ్ర ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)



తీవ్ర తోపులాట చేటు చేసుకోవడంతో అక్కడి కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ తోపులాటలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.అప్పటికే భారీ చేరుకున్న పోలీసులు విద్యార్థులను విద్యార్థి సంఘాల నేతలను బలవంతంగా అరెస్టు చేసి అక్కడి నుంచి సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు.

**రూ.11 వేల కోట్ల బకాయిలను ఏక కాలంలో విడుదల చేయాలి : విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్**

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, అశోక్ రెడ్డి, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి , పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనగిరి మధుకర్, ఎఐఎస్‌బి రాష్ట్ర నాయకుడు సన్నీ గౌడ్, ఎఐపిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ,ఆడేపు రవి కుమార్ వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనేరూ.11 వేల కోట్ల బకాయిలన్నింటినీ ఏక కాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రాక చదువులకు దూరమవుతున్నారు. కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, గొంతు నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని అరెస్టులతో మా ఉద్యమాలను ఆపలేరని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు వంశీ వర్ధన్ రెడ్డి,అన్వర్,చైతన్య యాదవ్,మురళి కృష్ణ, శరత్, పార్థసారథి, శేఖర్, నరేష్, శాంతి కుమార్,అనిల్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు లెనిన్ గువేరా,శంకర్, పవన్,నాగరాజు,శ్రీకాంత్,పిడిఎస్‌యు సంఘాల నాయకులు రానా ప్రతాప్, బి శ్రీకాంత్,మస్తాన్, ఎఐఎఫ్‌డిఎస్ నాయకులు కుమార్, ఎఐపిఎస్‌యు నాయకులు జి. పరమేశ్,రాజారాం తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com